సత్యమేవ జయతే

# సాక్షి

శుక్రవారం 13-3-2020

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 352

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



**కావాలన్నప్పుడు వస్తా**

స్వచ్ఛ రాజకీయాలు కావాలని ప్రజలు కోరుకుంటే ప్రవేశిస్తా..: రజనీ – 5లో



**తొలి వన్డే రద్దు..**

ధర్మశాలలో భారత్, సౌతాఫ్రికా మ్యాచ్‌కు అడ్డంకిగా మారిన వర్షం – స్పోర్ట్స్‌లో

• కోవిడ్ ఎఫెక్ట్

## ఫ్యాన్స్‌కు 'నో ఎంట్రీ'

- క్రికెట్‌కు చేరిన వైరస్ భయం
- ఖాళీ స్టేడియాల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు!
- రేపు గవర్నింగ్ కౌన్సిల్ తుది నిర్ణయం
- భారత్, దక్షిణాఫ్రికా తర్వాతి రెండు వన్డేలకు ప్రేక్షకులను అనుమతించం: బీసీసీఐ – స్పోర్ట్స్‌లో



గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలసిన సురేశ్‌రెడ్డి, కె. కేశవరావు

# రాజ్యసభకు కేకే, సురేశ్‌రెడ్డి

- టీఆర్‌ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన పార్టీ అధినేత కేసీఆర్
- నేటి ఉదయం 11 గంటలకు అభ్యర్థుల నామినేషన్లు దాఖలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కోటాలో ఈ నెల 26న జరిగే రెండు రాజ్యసభ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల పేర్లను టీఆర్‌ఎస్ అధినేత, సీఎం చంద్రశేఖర్‌రావు గురువారం ఖరారు చేశారు. సుమారు పక్షం రోజులుగా సాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత డాక్టర్ కె.కేశవరావుతో పాటు అసెంబ్లీ మాజీ స్పీకర్ కేఆర్ సురేశ్‌రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించారు. రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు శుక్రవారం తుది గడువు కాగా, టీఆర్‌ఎస్ అభ్యర్థులు మధ్యాహ్నం 12.41 గంటలకు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. పార్టీ తరఫున రాజ్యసభకు పోటీ చేసే అవకాశాన్ని దక్కించుకున్న కేశవరావు, సురేశ్ రెడ్డి గురువారం సాయంత్రం ప్రగతిభవన్‌లో కేసీఆర్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఇద్దరు నేతలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం వారిని పార్టీ తరఫున రాజ్యసభ సభ్యులుగా మిగతా 2వ పేజీలో ▶









# కోవిడ్ క్రాష్

### మహమ్మారి దెబ్బకు మరోసారి కుప్పకూలిన మార్కెట్లు

### పాతాళానికి ప్రధాన 'స్టాక్' సూచీలు

**11 లక్షల కోట్లు** ఒక్కరోజులో ఆవిరైన ఇన్వెస్టర్ల సంపద

**3,204** గురువారం సెన్సెక్స్ పతనమైన పాయింట్లు..(ఇంట్రాడే)

**950** నిఫ్టీ పతనమైన పాయింట్లు

**70 డాలర్లు..** బంగారం(ఔన్స్) ధర ఢమాల్

**8 శాతం** ముడి చమురు ధర క్రాష్

**74.50** డాలరుతో రూపాయి మారకం ఆల్‌టైమ్ కనిష్టానికి...

**3,475 కోట్లు** మన స్టాక్ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల నికర అమ్మకాలు

నిన్నమొన్నటివరకూ కొన్ని దేశాలకే పరిమితమైన కోవిడ్.. 'మహమ్మారి'గా మారడంతో ప్రపంచం చివురుటాకులా వణికిపోతోంది. ఈ తరుణంలో పులిమీద పుట్రలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. యూరప్ నుంచి రాకపోకలపై నెల రోజుల పాటు నిషేధాన్ని విధించడం, ఆర్థిక వ్యవస్థపై కోవిడ్ ప్రభావం తీవ్రంగానే ఉండొచ్చంటూ చేసిన వ్యాఖ్యలు గగ్గోలు పుట్టిస్తున్నాయి. దీంతో అంతర్జాతీయ ఫైనాన్షియల్, కమోడిటీ మార్కెట్లన్నీ మరోసారి నిట్టనిలువునా కుప్పకూలాయి. కోవిడ్‌కు తక్షణం ఔషధం అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేకపోవడం.. దీని కట్టడి విషయంలో ప్రపంచ దేశాలు సరిగ్గా స్పందించకపోవడం వంటి పరిణామాలు మార్కెట్లను దిక్కుతోచని స్థితిలోకి నెట్టేస్తున్నాయి. అమెరికా, యూరప్, ఆసియా స్టాక్ సూచీలన్నీ పాతాళానికి పడిపోతున్నాయి. బుధవారం 5 శాతానికి పైగా పతనమైన అమెరికా ప్రధాన సూచీలు.. గురువారం కూడా ఆరంభంలోనే మరో 8.5 శాతం భారీ క్షీణతను చవిచూశాయి. ఈ దెబ్బతో ఆసియా మార్కెట్లు కూడా తీవ్రమైన నష్టాలతో ఆరంభమై.. అంతకంతకూ మరింత కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. మన మార్కెట్ విషయానికొస్తే.. బీఎస్‌ఈ సెన్సెక్స్, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ సూచీలు చరిత్రలోనే ఎన్నడూలేనంతగా ఒక్కరోజు నష్టాలను మూటగట్టుకున్నాయి. ఒక్కరోజులో రూ.11 లక్షల కోట్ల సంపద తుడిచిపెట్టుకుపోవడం పతనం తీవ్రతకు నిదర్శనం. ఈ వారంలో నాలుగు రోజుల్లోనే రూ.18 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది.

**క్రూడ్ కల్లోలం...**



అమెరికా విధించిన ట్రావెల్ నిషేధంతో అంతర్జాతీయంగా ముడి చమురు డిమాండ్ మరింత పడిపోనుంది. దీంతో క్రూడ్ ధర 8 శాతం మేర తగ్గి 30 డాలర్లను తాకింది. సౌదీ అరేబియా, రష్యాల మధ్య నెలకొన్న ధరల యుద్ధంతో ఇటీవలే ముడిచమురు ధర 30 శాతంపైగా కుప్పకూలి బ్యారెల్‌కు 27 డాలర్ల స్థాయిని తాకిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కోవిడ్ ప్రభావం కూడా తోడవడంతో ఈ రేటు మరింత దిగువకు కూడా పడిపోయే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

**కూలుతున్న విమానం...**



అమెరికా ట్రావెల్ నిషేధం, భారత్‌తో సహా పలు దేశాలు కూడా వీసాలను తాత్కాలికంగా నిలిపేయడం వంటి పరిణామాలతో విమానయాన కంపెనీలు హడలిపోతున్నాయి. దీంతో అంతర్జాతీయంగానే కాకుండా దేశీ ఎయిర్‌లైన్స్ సంస్థల షేర్లు క్రాష్ అవుతున్నాయి. పర్యాటకం, రవాణా, వినియోగ రంగాలకు చెందిన షేర్లన్నీ ఎన్నడూ చూడని ఘోరమైన నష్టాలతో బిక్కచూపులు చూస్తున్నాయి.

**పుత్తడి చిత్తడి...**



కోవిడ్ మహమ్మారి దెబ్బకు ప్రపంచంలో ఏ ఇన్వెస్ట్‌మెంట్ సాధనం కూడా భరోసానిచ్చే పరిస్థితి కనబడటం లేదు. కష్టకాలంలో ఇన్వెస్టర్లకు సురక్షిత పెట్టుబడి సాధనంగా కనబడే బంగారాన్ని కూడా ఈ వైరస్ బెంబేలెత్తిస్తోంది. కోవిడ్ వ్యాప్తితో ఇటీవలే దూసుకెళ్లిన పసిడి.. గురువారం ఒక్కరోజే ఏకంగా 70 డాలర్లు కుప్పకూలి 1,570 డాలర్లను (ఔన్స్ ధర) తాకింది.

**బాబోయ్ రూపాయ్...**



స్టాక్ మార్కెట్ల కకావికలంతో కరెన్సీల్లో కూడా మళ్లీ కల్లోలం మొదలైంది. డాలరుతో రూపాయి మారకం విలువ గురువారం ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి 74.50కి పడిపోయింది. రూపాయి పతనంతో భారత్ దిగుమతుల భారం పెరగడంతోపాటు కార్పొరేట్లకూ విదేశీ రుణాలు మరింత గుదిబండగా మారనున్నాయి. ధరల మంటకు కూడా ఇది దారితీయనుంది.

పూర్తి వివరాలు బిజినెస్‌లో

## భారత్‌లో తొలి మరణం

- కర్ణాటకలో మరణించిన వ్యక్తికి కోవిడ్–19 నిర్ధారణ
- గత నెల సౌదీ అరేబియా నుంచి తిరిగొచ్చిన సిద్ధఖీ
- తొలుత హైదరాబాద్‌లో చికిత్స పొందిన బాధితుడు
- ఆంధ్రప్రదేశ్‌లో తొలి కేసు నమోదు.. నెల్లూరు యువకునికి పాజిటివ్

- వివరాలు 5లో

**1,25,293** 115 దేశాల్లో నమోదైన కోవిడ్ కేసులు

**4,600** మొత్తం మరణాలు..

**74** భారత్‌లో నమోదైన కేసులు

- 5లో

# కేంద్రాన్ని నమ్ముకుంటే శంకరగిరి మాన్యాలే!

### బడ్జెట్‌పై సమాధానంలో కేసీఆర్

- ఇస్తుంది పన్నుల వాటాలే.. కేంద్రం మెహర్బానీ ఏమీ లేదు
- బీజేపీకి లేకలేక అధికారం వచ్చింది
- మేం పోటీ చేసిన మొదటిసారే గెలిచాం
- పన్నుల్లో వాటా మా హక్కు.. బిచ్చం కాదు
- ఇకనైనా బీజేపీ నీచ బుద్ధి మానుకోవాలని సూచన



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో ఇప్పుడున్న ప్రభుత్వాన్ని నమ్ముకుంటే శంకరగిరి మాన్యాలకు పోయినట్లేనని రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. 50–60 ఏళ్ల తర్వాత బీజేపీ అధికారంలోకి వచ్చిందని, యూపీఏ ప్రభుత్వంపై విసుగెత్తి వీళ్లేదో ఉద్ధరిస్తారని ప్రజలు గెలిపిస్తే చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇది ఒక దేశమని, ఎవడబ్బ సొత్తు కాదనే విషయాన్ని బీజేపీ నేతలు గ్రహించాలన్నారు. గురువారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా బీజేపీ సభ్యుడు రాజాసింగ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎన్ని నిధులు ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనికి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సమాధానమిస్తున్న సందర్భంలో సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని మాట్లాడుతూ.. దేశాన్ని నడిపే విషయంలో కాంగ్రెస్, బీజేపీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయని వ్యాఖ్యానించారు. 'కేంద్రం ఏదో మేమిచ్చినం... మేమిచ్చినం అంటోంది. మీరే వరండీ ఇచ్చే దానికి నాకర్థం కాదు. నాకు తిక్కరేగి ఇప్పుడున్న హోం మంత్రిని క్షమాపణ అడిగిన. నేను చెప్పింది తప్పయితే రాజీనామా చేస్తానని చెప్పిన. అయినా వీళ్లు ఇచ్చేది ఏంది? రాజ్యాంగం మేరకు పన్నుల వాటా ఇవ్వాల్సిందే. దానికి పేరు మాత్రం సెంట్రల్ డివల్యూషన్ అని పెట్టారు. సెంట్రల్ డివల్యూషన్ లేదు... మన్ను లేదు. కొన్ని రకాల పన్నులను అన్ని రాష్ట్రాల నుంచి వసూలు చేసే బాధ్యత కేంద్రంపై రాజ్యాంగం పెట్టింది. ఆ ప్రకారం రాష్ట్రం వాటాగా ఆ పన్నులు ఇవ్వాల్సిందే. అదేమీ మిగతా 2వ పేజీలో ▶



# సంక్షేమం ఆగదు..

- ఇంటింటా సౌభాగ్యం, ప్రతి కంట్లో సంతోషమే ప్రభుత్వ లక్ష్యం
- బడ్జెట్‌పై సమాధానంలో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు

"ఆర్థిక మాంద్యం నెలకొన్నా సీఎం కేసీఆర్ సూచనల మేరకు సంక్షేమానికి నిధులు కేటాయించాం. ఈ బడ్జెట్ ద్వారా ఆసరా పెన్షనర్లు, కల్యాణలక్ష్మి లబ్ధిదారులు, రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులు పెరుగుతున్నారన్న విషయాన్ని ప్రజలు, ఇతర పార్టీలు గ్రహించాలి. తొలిసారిగా రాష్ట్ర ఖజానా నుంచి దేవాలయాల అభివృద్ధికి రూ.500కోట్ల నిధుల కేటాయింపు ఘనత మాకే దక్కుతుంది.

- 2లో

# ఇంటి పట్టునే ఉండండి

**విదేశాల నుంచి వస్తే ఇళ్లకే పరిమితం కావాల్సిన రోజులు.. 14**

- బయటకు వెళ్లకూడదు... ఎవరినీ కలవకూడదు
- ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- వైద్య అధికారులతో మంత్రి ఈటల భేటీ

సాక్షి, హైదరాబాద్: భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ కేసుల తీవ్రత పెరుగుతుండటంతో రాష్ట్రంలో వైరస్ నియంత్రణ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా విదేశాల నుంచి వచ్చే ప్రతి ఒక్కరినీ 14 రోజులపాటు ఇళ్లకే పరిమితం చేయాలని నిర్ణయించింది. కోవిడ్ వైరస్ అనుమానిత లక్షణాలున్నా, లేకున్నా అలాంటి వారంతా ఇళ్లలోనే ఉండేలా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. విదేశాల నుంచి వచ్చిన కొందరు ప్రయాణికుల్లో వారం పది రోజులకు వైరస్ లక్షణాలుబయటపడుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది.

**వైరస్ లక్షణాలు ఆలస్యంగా బయటపడుతుండటంతో...**

హైదరాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి నిత్యం సగటున 3 వేల నుంచి 3,500 మంది వరకు విదేశాల నుంచి చేరుకుంటున్నారు. కోవిడ్ కేసులు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 50,679 మంది విదేశాల నుంచి వచ్చారు. వారిలో ప్రతిరోజూ 50–60 మందికి కోవిడ్ అనుమానిత లక్షణాలున్నట్లు గుర్తిస్తుండగా సగటున 25–30 మందిని ఐసోలేషన్‌లో ఉంచి వారి శాంపిళ్లను తీసుకుంటున్నారు. మిగిలిన వారిని ఇళ్ల వద్దనే ఐసోలేషన్ చేస్తున్నారు. అయితే ఇటీవల విదేశాల నుంచి వస్తున్న వారిలో విమానాశ్రయంలో థర్మల్ స్క్రీనింగ్‌లో తొలుత కరోనా లక్షణాలు మిగతా 4వ పేజీలో ▶







# 'మక్కల లొల్లి'కి... మంత్రుల కౌంటర్

- సీఎల్పీ నేత భట్టి ఆరోపణలకు మంత్రి ఈటల సమాధానం
- సీఎం కేసీఆర్ జోక్యం...
- పౌల్ట్రీ పరిశ్రమ నిలబడేందుకు డబ్బులివ్వాల్సి వస్తే వెనక్కుతగ్గమని వ్యాఖ్య
- పౌల్ట్రీ చర్చలో కరోనా ప్రస్తావన... గుడ్లు, చికెన్ తినాలని రాష్ట్ర ప్రజలను కోరిన ఈటల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ 'మక్కల లొల్లి'కి వేదికయింది. పౌల్ట్రీ పరిశ్రమలో మక్కల (మొక్కజొన్నల)కుంభకోణం జరిగిందని బుధవారం తన ప్రసంగంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేసిన ఆరోపణలకు గురువారం సభలో ప్రభుత్వం దీటైన కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేసింది.ఈ సందర్భంగా అధికార టీఆర్ఎస్, ప్రతి పక్ష కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. బడ్జెట్‌పై చర్చకు సమాధానంలో భాగంగా ఆర్థిక మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ భట్టి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు.వాటికి మంత్రి ఈటల వివరంగా జవాబిస్తారని చెప్పారు. ఆ తర్వాత ఈటల మాట్లాడుతూ భట్టి చేసిన ఆరోపణల్లో నిజం లేదని, కరోనా ప్రభావంతో పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభంలో ఉన్న సమయంలో చేయాల్సిన ఆరోపణలు కావని అన్నారు.



'కరోనా ప్రభావంతో కుప్పకూలింది....పౌల్ట్రీ రంగానికి చెందిన ఏ రైతు ఇంటికి వెళ్లినా చనిపోయిన వారి కుటుంబాలను తలపిస్తున్నాయి. అయినా భట్టి ఇంతటి అవాస్తవాలు ఎలా చెప్పారో అర్థం కావడం లేదు.పౌల్ట్రీకి ప్రభుత్వం సబ్సిడీపై మక్కలు ఇవ్వలేదు. మొదటి ఏడాది కొనుగోలుకు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవడంతో పౌల్ట్రీకి ఇవ్వాలన్న తమ విజ్ఞప్తిని సీఎం కేసీఆర్ మానవీయ కోణంలో అంగీకరించారు. అయినా ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా టన్నుకు రూ.100–200 కన్నా ఎక్కువ తగ్గించలేదు. అంతా కలిపిన అందులో ప్రభుత్వం తగ్గించుకుంది రూ.6–7 కోట్లకు మించి ఉండదు. వందల కోట్ల కుంభకోణం అని అంటున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశ్రమ అయిన పౌల్ట్రీపై ఇలాంటి ఆరోపణలు చేయడం వల్ల కాంగ్రెస్ నేతలే అభాసుపాలవుతారు. ఇచ్చిన మక్కల్లో కూడా 2లక్షల టన్నులు పౌల్ట్రీ రైతులకే ఇచ్చారు. ఆ తర్వాత మిగిలినవే పెద్ద పెద్ద బ్రీడర్ కంపెనీలకు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన మక్కలు పెద్ద కంపెనీలకు మూడు నెలలకు కూడా సరిపోవు.మరి అలాంటప్పుడు అమ్ముకునేది ఎక్కడిది? ఇలాంటి ఆరోపణలు చేయడం మంచిది కాదు.'అని అన్నారు. ఏ ఏడాదిలో పౌల్ట్రీ పరిశ్రమలకు ఎంత మక్కలు ఇచ్చారన్న వివరాలు తమకు పంపుతానని, సభ్యులకు ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు.

### బేజాప్తా కాదు బాజాప్తా చేస్తాం : సీఎం కేసీఆర్

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఈ చర్చలో జోక్యం చేసుకుని ఇందులో కుంభకోణం లేదు లంబకోణం లేదని వ్యాఖ్యానించారు. పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకునేందుకు రెండు, మూడు వందల కోట్లు ఇవ్వాల్సి వచ్చినా తాము ఖాతరు చేయబోమని, ఖచ్చితంగా ఇస్తామని స్పష్టం చేశారు. ఇందులో దాచుకోవాల్సింది ఏమీ లేదని, పౌల్ట్రీ రంగం కూలిపోకుండా బేజాప్తా కాదు బాజాప్తా ఇస్తామని అన్నారు. 'పరిశ్రమలు నిలబడాలంటే కొన్ని రాయితీలు ఇవ్వక తప్పదు. రాష్ట్రం ఏర్పాటయిన రెండేళ్లకే మనకు ఓ బడా పరిశ్రమరావడం ఖాయమయిపోయింది. కానీ, అప్పుడున్న మహారాష్ట్ర సీఎం చురుగ్గా వ్యవహరించి ఏకంగా రూ.3,500 కోట్ల విలువైన ప్రోత్సాహకాలిచ్చి ఆ పరిశ్రమను అక్కడకు తీసుకెళ్లారు. పారిశ్రామిక రాయితీలు ఆనవాయితీగా ఇస్తున్నారు. నాడు వైఎస్సార్, కోట్ల, జలగం వెంగళరావు ప్రభుత్వాలు కూడా ఇచ్చాయి. పరిశ్రమను నిలబెట్టుకోవాలంటే ఇవ్వాల్సిందే.'అని వ్యాఖ్యానించారు. అనంతరం ఈటల మళ్లీ వివరణ ఇస్తున్న సందర్భంలో రాష్ట్రంలో కరోనా లేదని చెప్పాలని సీఎం సూచించారు. వాటికనుగుణంగా రాష్ట్రంలో కరోనా లేదని చెప్పిన వైద్య మంత్రి అపోహలకు పోకుండా పౌష్టికాహారమైన గుడ్లు, చికెన్ తినాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### మేం కాదు... మీ నేతలవే చిల్లర పనులు : భట్టి

అనంతరం భట్టి మాట్లాడుతూ మక్కల విషయంలో ప్రభుత్వం తప్పు చేసిందని తాము చెప్పడం లేదని, పౌల్ట్రీ ఫెడరేషన్‌కు ఇచ్చినవి దుర్వినియోగం అయ్యాయన్నదే తమ ఆరోపణ అని, వాటిని అమ్ముకున్నారా లేదా అన్నదానిపై విచారణ జరపాలని తాము డిమాండ్ చేస్తే అడిగిన దానికి చెప్పకుండా ఏవేవో చెపుతున్నార న్నారు. మంత్రి ఈటల చెప్పినట్టు తమవి చౌకబారు, చిల్లర ఆరోపణలు కావని, టీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు పెద్దలు చిల్లర పనులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దీంతో సభలో కొంత గందరగోళం నెలకొంది.

### అడ్డగోలు ఆరోపణలు... రొడ్డ కొట్టుడేనా : సీఎం కేసీఆర్

పౌల్ట్రీ కుంభకోణం ఆరోపణలపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ పార్టీనుద్దేశించి సీఎం కేసీఆర్ ఘాటు రాజకీయ వ్యాఖ్యలు చేశారు. 'ప్రతిపక్షాలు చేసే విమర్శ పట్ల విచక్షణ ఉండాలి. ప్రతి దాన్నీ అడ్డగోలుగా మాట్లాడి రొడ్డకొట్టుడు కొట్టుడేనా? మీకు ప్రజలెందుకు ఓట్లు వేస్తలేరో ఇప్పటికీ అర్థమయితలేదు. ఈవీఎం లన్నారు.. బ్యాలెట్ వచ్చినా ఏం జరిగింది. అంటే ప్రతి సందర్భంలో ప్రజలు మాకు స్పష్టంగా చెబుతున్నారు. వాళ్లెన్ని అరిచినా పట్టించుకోవద్దని, మీ దారిలో మీరు వెళ్లాలని చెపుతున్నారు. మీరు సమీక్షించుకోవాలి. మీ పద్ధతి మారాలి. మేం చెపుతున్నా మీరు సవరించుకోవడం లేదు.'అని వ్యాఖ్యానించారు.

## ఆసుపత్రుల స్థాయి పెంపు ఉండదు

### ఉన్నవాటిల్లో వసతుల మెరుగుకే ప్రాధాన్యం: ఈటల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వ ఆసుపత్రుల స్థాయి పెంపు ఇప్పట్లో ఉండదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. గతంలో స్థాయి పెంచిన ఆసుపత్రుల్లో అన్ని రకాల వసతులు, మెరుగైన వైద్య సేవలు కల్పించడంపైనే ప్రభుత్వం దృష్టి ఉందని పేర్కొన్నారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు మర్రి జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, డాక్టర్ ఆనంద్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ మేరకు సమాధానం చెప్పారు. తెలంగాణ రాకముందు మెడికల్ కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లోనే ఐసీయూ కేంద్రాలుండేవని, రాష్ట్రం ఆవిర్భవించాక రూ.41 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ఆసుపత్రుల్లో వాటిని అందుబాటులోకి తెచ్చామన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెరిగిన తర్వాత వాటికి తాకిడి బాగా పెరిగిందని, దీనివల్ల కొన్ని చోట్ల కొన్ని రకాల సమస్యలు కూడా ఏర్పడుతున్నాయని వెల్లడించారు. ముఖ్యంగా ఇప్పటికే చాలా ఆసుపత్రుల్లో వైద్యుల పోస్టులను భర్తీ చేసినప్పటికీ, నర్సులు, టెక్నీషియన్స్ సరిపోని పరిస్థితి ఉందన్నారు. ఆయా కేటగిరీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలో భర్తీ చేయాలని సీఎం ఆదేశించారని, ఆ మేరకు చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. చాలామంది ఎమ్మెల్యేలు వారి పరిధిలో ఉన్న ఆసుపత్రుల స్థాయి పెంచాలని డిమాండ్ చేస్తున్నారని, ప్రస్తుతానికి ఉన్న వాటిల్లో వసతులు మెరుగుపరిచి మరింత నాణ్యమైన వైద్యం అందించడంపై మాత్రమే తాము దృష్టి సారిస్తున్నామన్నారు.



టీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎంపికైన సురేశ్‌రెడ్డి, కె.కేశవరావును అభినందిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, హరీశ్‌రావు, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాల్కసుమన్, ఎంపీ సంతోష్‌కుమార్ తదితరులు

# రాజ్యసభకు కేకే, సురేశ్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

నామినేట్ చేస్తూ పత్రాలు అందజేశారు. అనంతరం అసెంబ్లీ ఆవరణకు చేరుకున్న కేశవరావు, సురేశ్ రెడ్డి శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసెంబ్లీకి వచ్చిన పార్టీ రాజ్యసభ అభ్యర్థులకు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు సంతోశ్‌కుమార్, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, నరేందర్ తదితరులు కేకే, సురేశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, సురేశ్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించడానికి ముందు కేసీఆర్ అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో పోచారంతో భేటీ అయ్యారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన మంత్రి ప్రశాంత్ రెడ్డి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ అభ్యర్థిపై కసరత్తు..

శాసన మండలి నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా ఎన్నిక నోటిఫికేషన్ గురువారం వెలువడగా, ఈ నెల 19 నామినేషన్ల దాఖలకు తుది గడువు. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న పలువురు నేతలు గురువారం అసెంబ్లీలో కేటీఆర్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, లోయపల్లి నర్సింగరావు, ముజీబ్ శాసన మండలి అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. గతంలో స్థానిక సంస్థల కోటాలో టీడీపీ నుంచి ఎన్నికైన అరికెల నర్సారెడ్డి ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. ఆరంభం నుంచి పార్టీలో ఉంటూ వరుసగా మూడుసార్లు ఎంపీపీగా పనిచేసిన తనకు అవకాశం ఇవ్వాలని నర్సింగరావు కోరుతున్నారు. మైనారిటీ కోటాలో తనకు అవకాశం ఇవ్వాల్సిందిగా ముజీబ్ కోరుతుండటంతో జిల్లాకు చెందిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకున్న తర్వాత అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది.

### పాత్రికేయుడిగా ప్రారంభించి..

కంచర్ల కేశవరావు
భార్య: వసంతకుమారి
జననం: 1939, జూన్ 4
స్థలం: మహబూబాబాద్

జర్నలిస్టుగా కెరీర్ ప్రారంభించిన కేశవరావు ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి పలు పదవులు నిర్వర్తించారు. 2005లో ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా, ఆ తర్వాత ఏఐసీసీ సభ్యుడిగా పనిచేశారు. పట్టభద్రుల కోటాలో శాసన మండలి సభ్యుడిగా ఎన్నికై అంజయ్య, భవనం వెంకట్రాం, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి మంత్రివర్గాల్లో విద్య, పరిశ్రమలు వంటి కీలక శాఖలతో పాటు కాంగ్రెస్ హయాంలో కొంతకాలం శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా పనిచేశారు. 2006లో కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కేశవరావు 2013లో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. టీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్‌గా పనిచేస్తూ 2014లో రెండో పర్యాయం రాజ్యసభకు ఎన్నికై పార్టీ పార్లమెంటరీ పక్ష నేతగా వ్యవహరిస్తున్నారు.

### యువజన కాంగ్రెస్‌తో మొదలు..

కేఆర్ సురేశ్‌రెడ్డి...
భార్య: పద్మజారెడ్డి
జననం: 1959, మే 25
స్థలం: చౌట్‌పల్లి, కమ్మరపల్లి మండలం, నిజామాబాద్

1984లో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రాజకీయాల్లో ప్రవేశించిన సురేశ్‌రెడ్డి తండ్రి గోవిందరెడ్డి రాజకీయ వారసత్వాన్ని స్వీకరించారు. 1989, 1994, 1999, 2004లో వరుసగా నాలుగు పర్యాయాలు నిజామాబాద్ బాల్కొండ అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ తరఫున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికయ్యారు. 1990లో లైబ్రరీ కమిటీ చైర్మన్‌గా, 1997లో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2004లో ఉమ్మడి ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2009, 2014లో ఆర్మూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2018, సెప్టెంబర్‌లో టీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# కేంద్రాన్ని నమ్ముకుంటే శంకరగిరి మాన్యాలే!

▶ మొదటి పేజీ తరువాయి

బిచ్చమెత్తుకునేది కాదు'అని స్పష్టం చేశారు. సీఎస్టీ పేరుతో యూపీయే ప్రభుత్వం రాష్ట్రాల పన్నులను మింగేస్తే జీఎస్టీ పేరుతో ఎన్డీయే సర్కార్ మింగేస్తోందని, ఆ జీఎస్టీకే దిక్కులేదని వ్యాఖ్యానించారు. కేంద్రం వాటా కింద ఇచ్చే పన్నులపై ఆధారపడి ఉద్యోగస్తులకు ప్రతి నెలా మొదటి తారీఖు కల్లా జీతాలిస్తామని, కానీ ఇప్పుడున్న కేంద్రం ఇవ్వడం లేదని, రూ.3,910 కోట్లకు ఇప్పటివరకు దిక్కులేదన్నారు. ఇవ్వాల్సింది ఇవ్వకపోగా మన నెత్తిమీద మన చెయ్యి పెట్టినట్లు రూ.1,410 కోట్లు అప్పు తెచ్చుకోవాలని కేంద్రం చెప్పిందని ఎద్దేవా చేశారు. పన్నుల వాటాలో కేంద్రం మెహర్బానీ ఏమీ లేదని, ఎన్డీయే ప్రభుత్వం ఏ ఒక్క ఏడాది కూడా గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.10వేల కోట్లకు మించి ఇవ్వలేదన్నారు. దానికే తామేదో చేసేస్తున్నట్లు బాజా కొట్టుకుంటున్నారని, బాజాలో బీజేపీ.. కాంగ్రెస్ తాత అయిందని పేర్కొన్నారు. 'కిస్‌నే ఆయా బోలో... కిసీ కా బాప్‌కా హై? దేశాన్ని సాదే మొదటి మూడు రాష్ట్రాల్లో తెలంగాణ ఉంది. మిగిలినవన్నీ అడుక్కుతినే రాష్ట్రాలే. మనం రూ.50 వేల కోట్లు ఇస్తే వాళ్లు రూ.24 వేల కోట్లు కూడా ఇవ్వడం లేదు. ఇప్పటికయినా బీజేపీ నీచబుద్ధి మానుకోవాలి'అని సీఎం కేసీఆర్ సూచించారు.

### మేం మొదటి సారే గెలిచాం..

బీజేపీ లేకలేక అధికారంలోకి వచ్చిందన్న సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై బీజేపీ సభ్యుడు రాజాసింగ్ స్పందించి తాము రెండుసార్లు అధికారంలోకి వచ్చామని, టీఆర్ఎస్ కూడా అధికారంలోకి వచ్చింది కూడా రెండోసారే నని అన్నారు. దీనికి కౌంటర్‌గా సీఎం మాట్లాడుతూ.. తాము మొదటిసారి పోటీ చేసిన ఎన్నికల్లోనే గెలిచామని, బీజేపీ 50–60 ఏళ్లకు అధికారంలోకి వచ్చిందని వివరించారు.

### కిసీకా బాప్‌కా హై..

బడ్జెట్‌లో పెట్టిన నిధుల ఖర్చుపై గురువారం సభలో ఆసక్తికరమైన చర్చ జరిగింది. బడ్జెట్‌పై ప్రభుత్వ సమాధానంలో భాగంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. కేంద్రం ఏదో ఇస్తున్నామని చెబుతోందని, అది బిచ్చమెత్తుకునేది కాదని, రాజ్యాంగం ప్రకారం రావాల్సిన వాటా అంటూ 'కిసీకా బాప్‌కా హై'అని వ్యాఖ్యానించారు. తర్వాత సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రైతుబంధు కింద రాష్ట్రంలోని రైతాంగానికి ఇచ్చే నిధులు 'మీ జేబుల్లోంచి ఇచ్చారా..? టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి తెచ్చారా'అని ఘాటుగా ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ చెప్పినట్టు 'కిసీ కా జాగీర్ నహీ హై... కిసీకా బాప్‌కా నహీ హై'అని అన్నారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. అధికార సభ్యులు భట్టి వ్యాఖ్యల పట్ల నిరసన వ్యక్తం చేశారు. మీరు ఎస్సారెస్పీ కట్టామని చెబుతున్నారు.. ఆ నిధులు మీ ఇంట్లోంచి తెచ్చారా అని భట్టిని ప్రశ్నిస్తూ కామెంట్లు చేశారు. అనంతరం ఆర్థిక మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రజాధనం ఖర్చు విషయంలో భట్టి మాట్లాడిన మాటలు అసంబద్ధమన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతు బంధు ద్వారా రాష్ట్ర రైతాంగానికి సాయం చేయాలన్న సోయి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సంపద పెంచాలి... పేదలకు పంచాలి.. అనేది తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. మొత్తంమీద ప్రజాధనం మీద చర్చ పార్టీల మధ్య విమర్శలకు దారితీసింది.

## ఏడాది ప్రగతి రూ. 42 వేల కోట్ల అప్పు

### కౌన్సిల్‌లో జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించే ప్రగతి రూ.42 వేల కోట్ల అప్పు అని, మార్చి 31 నాటికి రాష్ట్రం మొత్తం అప్పు రూ.3,18,805 కోట్లకు చేరుకుంటుందని, అప్పులు పెరగడమే సాధించిన ప్రగతిగా నిలుస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం శాసన మండలిలో బడ్జెట్‌పై చర్చలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక మాంద్యం కనబడని శాఖ ఆబ్కారీ ఒక్కటేనని, 2014లో రూ.2,300 కోట్లున్న ఆ శాఖ ఆదాయం 2020–21 కల్లా రూ.16 వేల కోట్లకు చేరుకుందన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ పేరును మద్యం ప్రోత్సాహకశాఖగా మారిస్తే బావుంటుందని వ్యంగ్యంగా అన్నారు.

# సంక్షేమం ఆగదు

### ఇంటింటా సౌభాగ్యం, ప్రతి కంట్లో సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: డబ్బులకు వెనుకాడకుండా పేదలే ఎజెండాగా, ప్రజలే కేంద్ర బిందువుగా టీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని ఆర్థిక మంత్రి టి. హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రతి ఇంటా సౌభాగ్యం, ప్రతి కంట్లో సంతోషం చూడాలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రపంచం ఆగమయినా, దేశంలో ఏం జరిగినా, ఎంత కష్టమొచ్చినా రాష్ట్రంలో సంక్షేమం ఆగదని తేల్చి చెప్పారు. తమ బడ్జెట్ ప్రజలను సంతోషపెట్టిందని, కాంగ్రెస్‌ను మాత్రం నిరాశపరిచిందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షం చెబుతున్నట్లు ఈ బడ్జెట్ ప్రజలను భ్రమల్లోకి నెట్టలేదని, కాంగ్రెస్ నేతల భ్రమలను బద్దలు కొట్టిందన్నారు. 2020–21 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై చర్చ అనంతరం ప్రభుత్వ పక్షాన హరీశ్‌రావు గురువారం అసెంబ్లీలో సమాధానమిచ్చారు. దాదాపు రెండు గంటలపాటు సాగిన ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను, విధానాలను, ఐదున్నరేళ్ల టీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. హరీశ్ బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

### మాంద్యంలోనూ సంక్షేమానికి నిధులు...

''ఆర్థిక మాంద్యం నెలకొన్నా సీఎం కేసీఆర్ సూచనల మేరకు సంక్షేమానికి నిధులు కేటాయించాం. ఈ బడ్జెట్ ద్వారా ఆసరా పెన్షనర్లు, కల్యాణలక్ష్మి లబ్ధిదారులు, రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులు పెరుగుతున్నారన్న విషయాన్ని ప్రజలు, ఇతర పార్టీలు గ్రహించాలి. తొలిసారిగా రాష్ట్ర ఖజానా నుంచి దేవాలయాల అభివృద్ధికి రూ. 500 కోట్ల నిధుల కేటాయింపు ఘనత మాకే దక్కుతుంది. హైదరాబాద్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎం ఎన్నిసార్లు కేంద్రానికి లేఖలు రాసినా, స్వయంగా ఢిల్లీ వెళ్లి కోరినా ప్రయోజనం లేకపోవడంతో ఈసారి బడ్జెట్‌లో రూ. 10 వేల కోట్లను హైదరాబాద్ అభివృద్ధికి కేటాయించాం. రైతు సంక్షేమం కోసం రైతు బంధు నిధులు పెంచడంతోపాటు మార్కెట్ స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశాం. రైతు బీమా బడ్జెట్ పెంచడంతోపాటు రైతు వేదికలు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాం.



### కాంగ్రెస్‌ది కరెంటు బంద్ ప్రభుత్వం...

విద్యుత్‌రంగ అభివృద్ధి లెక్కలు చెబితే కాంగ్రెస్ నేతలు పశ్చాత్తాపపడక తప్పదు. ఎంత డిమాండ్ ఉన్నా కనురెప్పపాటు కూడా కరెంటు పోకుండా విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రభుత్వం మాది. కాంగ్రెస్ పార్టీది కరెంటు బంద్ ప్రభుత్వమైతే మాది రైతు బంధు ప్రభుత్వం. దేశంలోనే ప్రజారోగ్యం అందిస్తున్న మూడు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. గతంలో రాష్ట్రంలో ఒక్క డయాలసిస్ సెంటర్ కూడా ఉండేది కాదు. ఇప్పుడు 40కిపైగా ఏర్పాటు చేశాం. జిల్లాకు నాలుగైదు ఐసీయూ యూనిట్లు పెట్టాం.

### కేసీఆర్ పేదల మనిషి...

ఎన్నికలకు ముందు వరాలివ్వడం, ఆ తర్వాత మర్చిపోవడం మా విధానం కాదు. మేము ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా కల్యాణలక్ష్మి, రైతు బంధు, మిషన్ కాకతీయ లాంటి పథకాలను అమలు చేస్తున్నాం. ఎన్నికలు, ఓట్లు, సీట్ల కోసం పనిచేసే వ్యక్తి సీఎం కేసీఆర్ కాదు. ఆయన పేదల మనిషి. మానవీయకోణంలో ప్రజల కష్టాలను దగ్గరగా చూసిన మనిషి. కేసీఆర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సిద్దిపేట పరిధిలోని ఇమాంబాద్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వచ్చి తన అల్లుడు కట్నంగా సైకిల్ అడుగుతున్నాడని, అది ఇవ్వకపోతే కూతురు పెళ్లి ఆగిపోయే పరిస్థితి ఉందని చెబితే వెంటనే సైకిల్ ఇచ్చి పంపించిన హృదయం కేసీఆర్‌ది. అందుకే ఆయన సూచనల మేరకు ఈసారి బడ్జెట్‌లో కల్యాణలక్ష్మికి రూ. 700 కోట్లు పెంచాం. ఓవర్సీస్ స్కాలర్‌షిప్, రుణమాఫీ, గుడుంబా నిర్మూలన, పునరావాసం, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేసిన ఘనత టీఆర్ఎస్‌దే. గృహ నిర్మాణ రుణాల మాఫీ, నీటి తీరువా రద్దు, తాటి చెట్లపై పన్ను రద్దు, చేనేత రుణాలు, ఆటో, ట్రాక్టర్లపై పన్ను మినహాయింపు, ఎస్సీ, ఎస్టీలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సెలూన్లకు డొమెస్టిక్ కేటగిరీ వర్తింపు, నివాస స్థలాల క్రమబద్ధీకరణ, సాదాబైనామాల పరిష్కారం లాంటి చాలా కార్యక్రమాలను ప్రజల కోసం చేశాం.

### పన్నేతర ఆదాయంపై క్లారిటీ ఉంది..

పన్నేతర ఆదాయం పెంచుకొనే విషయంలో మాకు క్లారిటీ ఉంది. వాణిజ్య పన్నుల శాఖలో అపరిష్కృత కేసుల వన్‌టైం సెటిల్‌మెంట్, మైనింగ్, ఇసుక కొత్త పాలసీ, కోకాపేటలో గెలిచిన భూముల అమ్మకం, పరిశ్రమలకు లీజుకిచ్చిన భూముల క్రమబద్ధీకరణ ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటాం. ఈ విషయంలో కాంగ్రెస్‌కు అనుమానాలు అక్కర్లేదు. అభివృద్ధి ప్రజలకు కనపడుతున్నందునే ప్రతి ఎన్నికల్లో మమ్మల్ని గెలిపిస్తున్నారు. మూసీ నది పాపం, పుణ్యం కాంగ్రెస్‌దే. ఆ కంపును వదిలించేందుకు మేము కంకణం కట్టుకున్నాం. ఈ విషయంలో కాంగ్రెస్ చెంపలేసుకొని క్షమాపణలు చెప్పాలి. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి. అవసరమైతే అప్పులు మరిన్ని తెచ్చయినా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరు అందిస్తాం. కాంగ్రెస్‌లాగా సంకుచిత ధోరణులు మాకు ఉండవు. ఎఫ్‌ఆర్‌బీఎం చట్టానికి అనుగుణంగానే అప్పులు తెస్తున్నాం. ఈ విషయంలో ఎక్కడా పరిధి దాటట్లేదు. అప్పులతోపాటు జీఎస్‌డీపీ పెరిగిందని ప్రతిపక్షాలు గుర్తించాలి.

### కేంద్రం నిధులివ్వట్లేదు...

కేంద్రం నుంచి ఆశించినంత సాయం అందట్లేదు. జీఎస్టీ, ఐజీఎస్టీ బకాయిలు, మిషన్ కాకతీయ, భగీరథ గ్రాంట్లు, వెనుకబడిన జిల్లాలకు సాయం, పన్నుల వాటా కలిపి రూ. 10 వేల కోట్లకుపైనే రావాల్సి ఉంది. అయినా ప్రజల కోసం ఖర్చుకు వెనుకాడం. మాది పేదల ప్రభుత్వం. పేదల సంక్షేమం కోసమే ప్రతిపైసా ఖర్చు పెడతాం.

### కాంగ్రెస్‌ది వద్దుల పార్టీ.. అందుకే ప్రజలు వద్దనుకున్నారు

బడ్జెట్ గురించి కాంగ్రెస్ ఒక్క మంచి మాటయినా చెబుతుందని ఆశించాం. అయినా కాంగ్రెస్ సభ్యులు మాత్రం పాడిందే పాట పాచిపళ్ల బాట అన్న రీతిలోనే విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు కరెంటు వద్దంటారు.. జిల్లాలు, ప్రాజెక్టులు, మిషన్ భగీరథ వద్దని చెబుతారు. అందుకే కాంగ్రెస్ వద్దుల పార్టీ అయింది. ప్రజలు కూడా ఆ పార్టీ వద్దని రద్దు చేశారు. వరుస ఓటములతో అయినా ఆ పార్టీకి జ్ఞానోదయం అవుతుందని ఆశించినా, అన్ని ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా వారి తీరులో మార్పులేదు. ప్రజలు కర్రుకాల్చి వాతపెడుతున్నా ఆత్మవిమర్శ చేసుకోని కాంగ్రెస్‌ను ఆ దేవుడే కాపాడాలి.''

### ఆర్థిక మాంద్యమంటూనే అన్ని కోట్ల ప్రతిపాదనలెలా...?

- కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో సమతుల్యత లోపించిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. ఆర్థిక మాంద్యం ఉందని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తక్కువగా ఉంటాయని పేర్కొంటూనే రూ.1.83 లక్షల కోట్ల బడ్జెట్ ఎలా ప్రవేశపెట్టారని ప్రశ్నించారు. బడ్జెట్‌పై సాధారణ చర్చ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. రూ.30 వేల కోట్లకు పైగా ఉన్న ద్రవ్యలోటును ఎలా పూడుస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. ప్రజలపై ఆస్తిపన్ను, ఇతర చార్జీల భారం మోపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కనబడుతోందని అన్నారు.

### ఇద్దరూ కలిసి వెళ్లండి..

కాళేశ్వరం ద్వారా భూపాల జిల్లాకు నీళ్లివ్వాలని శ్రీధర్‌బాబు కోరడంతో గండ్ర వెంకటరమణారెడ్డి స్పందించారు. తన నియోజకవర్గానికి నీళ్లిచ్చే అంశమై ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి సానుకూలంగా ఉన్నారని, కాళేశ్వరంతో రాష్ట్ర ముఖచిత్రమే మారనుందని అన్నారు. అందుకే ఆ ప్రాజెక్టు సందర్శనకు రావాలని కాంగ్రెస్ నేతలను తాను కోరానన్నారు. దీనిపై శ్రీధర్‌బాబు మట్లాడే ప్రయత్నం చేయగా, స్పీకర్ మైక్ ఇవ్వలేదు. అయినా శ్రీధర్‌బాబు నిల్చుని ఉండటంతో 'మీరూ, గండ్ర వెంకటరమణ ఇద్దరూ కలిసి కాళేశ్వరం వెళ్లిరండి. ప్రాజెక్టు చూసిరండి'అనడంతో అంతా నవ్వుకున్నారు.

### కేంద్ర సాయం అందకపోతే చలో ఢిల్లీ : బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ, రాష్ట్రానికి కేంద్రం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. కరెంట్, రైల్వేలు, 11 సాగునీటి ప్రాజెక్టులు, పింఛన్లు, గృహ నిర్మాణాలకు కేంద్రం నిధులిస్తోందన్నారు. కేంద్రంనుంచి ఒకవేళ రాష్ట్రానికి అందాల్సిన సాయం అందకపోతే అంతా కలిసి చలో ఢిల్లీ కార్యక్రమం చేద్దామని పేర్కొన్నారు.

# ఏదైనా మంచి ఉంటే గదా.. చెప్పడానికి?

- బడ్జెట్‌పై సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్య
- సంక్షేమ నిధుల్లో కోత పెట్టి సంక్షేమ బడ్జెట్ అంటారా?
- కాళేశ్వరమేనా? మేం కట్టించిన ప్రాజెక్టుల మాటేంటి?
- తమను అనాల్సినవన్నీ అని సీఎం వెళ్లిపోతే ఎలా?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి ఒక్క మంచి మాట అయినా కాంగ్రెస్ సభ్యులు చెప్పలేదని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారని, అసలు ఈ బడ్జెట్‌లో ఏదైనా మంచి ఉంటే గదా చెప్పడానికి అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి సమాధానం అనంతరం వివరణల్లో భాగంగా సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. తమది సంక్షేమ ప్రభుత్వమని, సంక్షేమ బడ్జెట్ అని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, సంక్షేమ ప్రభుత్వమైతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థుల ఫీజులపై బడ్జెట్‌లో ఎందుకు కోత విధించిందని ప్రశ్నించారు. తమను కర్రు కాల్చి ప్రజలు వాతపెట్టారని ప్రభుత్వం అంటోందని, తమకేమీ ప్రజలు వాత పెట్టలేదని, అధికార పార్టీ సభ్యులను ఎలా గెలిపించారో, తమను కూడా ప్రజలు అలాగే గెలిపించారన్నారు. ప్రభుత్వం చేసే తప్పులను ఎత్తిచూపేందుకు ప్రతిపక్ష సభ్యులుగా తమను సభకు పంపారని చెప్పారు.

### మేడిగడ్డ నుంచి చుక్క నీరు కూడా ఎత్తిపోయలే..

ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు గురించి గొప్పలు చెప్పుకుంటోందని, ఈ ప్రభుత్వం గొప్పలు చెపుతున్నట్టు మేడిగడ్డ నుంచి చుక్క నీరు కూడా ఎత్తిపోయలేదని భట్టి విమర్శించారు. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా ఉండే శ్రీపాద ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ, కడెం, మిడ్‌మానేరు, లోయర్‌మానేరు ప్రాజెక్టులు కాంగ్రెస్ పార్టీ కట్టిందని, కాకతీయ కెనాల్, వరద కాల్వ కూడా తాము తవ్వినవేనని టీఆర్ఎస్ గ్రహించాలన్నారు. రెప్పపాటు కూడా కరెంటు పోకుండా తామేదో చేశామని ప్రభుత్వం గొప్పలు చెబుతోందని, ఈ ప్రభుత్వం విద్యుదుత్పత్తికి అదనంగా చేసిందేమీ లేదన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యాదాద్రి, భద్రాద్రి ప్రాజెక్టుల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో ఒప్పందం తప్ప ఏమీ చేయలేదని, భద్రాద్రి, యాదాద్రి ఇంతవరకు పూర్తి కాలేదని, గత కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన కృషి కారణంగానే రాష్ట్ర విద్యుత్ పరిస్థితి మెరుగుపడిందని చెప్పారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క రైతుకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని ఆరోపించారు.

### సీఎంను పిలిపించండి..

అంతకుముందు తన ప్రసంగంలో భాగంగా భట్టి మాట్లాడుతూ.. తమను అనాల్సినవి అన్నీ అనేసి సీఎం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రతిపక్షం చెప్పే సూచనలను సీఎం వింటే బాగుంటుందని వెంటనే పిలిపించాలని స్పీకర్‌ను కోరారు. ఈ సందర్భంగా అధికార పక్షం అడ్డుకునే ప్రయత్నం చేయగా స్పీకర్ పోచారం రాజకీయ వ్యాఖ్యలు కాకుండా బడ్జెట్ గురించి మాట్లాడాలని భట్టికి సూచించారు. దీనిపై స్పందించిన భట్టి 'మాకు స్పీకర్ స్థానంపై గౌరవముంది. మేం మాట్లాడేటప్పుడు కట్టడి చేస్తాం. వాళ్లకు మాత్రం మమ్మల్ని తిట్టేందుకు అవకాశం ఇస్తాం అనడం మాత్రం సరైంది కాదు.' అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత హరీశ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడంలో స్పీకర్ ఉదారంగా వ్యవహరిస్తున్నారని, ఆయనను ఉద్దేశించి భట్టి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలన్నారు. బడ్జెట్‌పై కాంగ్రెస్ సభ్యులు ఎంతసేపు మాట్లాడారో హరీశ్ సభకు వివరించారు.

ఇదండీ జోక్



epaper.sakshi.com

# ఘట్‌కేసర్-మౌలాలి మధ్య 4 లేన్

- అందుబాటులోకి వచ్చిన ఎంఎంటీఎస్-2 ప్రాజెక్టు కొత్త డబుల్ మార్గం
- ఇక మౌలాలి వద్ద రైళ్లు నిలిచిపోయే సమస్యకు స్వస్తి
- ఘట్‌కేసర్ నుంచి సనత్‌నగర్‌కు కొనసాగనున్న మార్గం
- రక్షణశాఖ స్థలాలు, రాష్ట్రప్రభుత్వ నిధులు అందితే మిగతా పనులు పూర్తి



**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ప్రధాన రవాణా మార్గాల్లో ఒకటిగా ఉన్న ఎంఎంటీఎస్ ప్రాజెక్టు రెండో దశలో కీలక మార్గంలో కొంత భాగం అందుబాటులోకి వచ్చింది. సనత్‌నగర్-ఘట్‌కేసర్ మధ్య ఎంఎంటీఎస్ రైళ్లు నడిపే లక్ష్యంతో ఆ ప్రాజెక్టు రెండో దశలో పనులను చేర్చారు. ఘట్‌కేసర్ నుంచి మౌలాలి మీదుగా మౌలాలి హౌసింగ్ బోర్డు కాలనీ, ఫిరోజ్‌గూడ, సుచిత్ర కూడలి, నేరేడ్‌మెట్ మీదుగా 35 కిలోమీటర్ల మేర ఈ మార్గం కొనసాగుతుంది. ఇందులో కీలకమైన ఘట్‌కేసర్-మౌలాలి మధ్య తాజాగా అదనంగా డబుల్ లేన్ నిర్మించారు. ఇప్పటికే ఆ మార్గంలో డబుల్ లేన్ ఉండగా, దానికి అదనంగా కొత్తగా రెండు వరసల మార్గం అందుబాటులోకి వచ్చింది. దానికి ఎలిక్ట్రిఫికేషన్, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ అనుసంధానం పూర్తి కావటంతో సాధారణ రైళ్లు నడిపేందుకు రైల్వే సేఫ్టీ కమిషనర్ పచ్చజెండా ఊపటంతో బుధవారం నుంచి రైళ్లను నడుపుతున్నారు. మౌలాలి నుంచి సనత్‌నగర్ వరకు ఎంఎంటీఎస్ మార్గం పూర్తి కావాల్సి ఉన్నందున వాటిని నడిపేందుకు ఇంకా సమయం పట్టనుంది. ఘట్‌కేసర్-మౌలాలి స్టేషన్లు ప్రధాన మార్గంలో ఉన్నందున, నిత్యం నడిచే సాధారణ రైళ్లు, గూడ్సు రైళ్లకు ఈ నాలుగు వరసల మార్గం ఎంతో ఉపయుక్తంగా ఉండనుంది. దక్షిణ మధ్య రైల్వేలో ఇదే తొలి నాలుగు లేన్ల మార్గంగా రికార్డులోకెక్కింది.

**ఎంతో ఊరట**

సికింద్రాబాద్-కాజీపేట ప్రధాన మార్గంలో ఉన్న ఘట్‌కేసర్-మౌలాలి స్టేషన్ల మధ్య తాజాగా అందుబాటులోకి వచ్చిన కొత్త డబుల్ లేన్ ఇప్పుడు రైళ్ల రద్దీతో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ఎంతో ఊరటనివ్వబోతోంది. సికింద్రాబాద్, కాజీపేట, నడికుడి (గుంటూరు), సనత్‌నగర్ (బైపాస్) లను అనుసంధానిస్తుంది. ఈ 12.2 కి.మీ. మేర రెండు వరసలతో ట్రాక్ నిర్మాణానికి రూ.200 కోట్లు ఖర్చయింది. ఇప్పటికే ఈ మార్గంలో డబుల్ లేన్ ఉన్నప్పటికీ, రైళ్ల సంఖ్య ఎక్కువగా ఉన్నందున వాటి వేగం తగ్గిపోతోంది. మౌలాలి స్టేషన్ వద్ద నిత్యం ఇతర రైళ్లకు మార్గం కల్పించేందుకు మిగతా వాటిని నిలిపేస్తున్నారు. ఇప్పుడు ఆ నిలిపివేసే బాధ తప్పుతుంది. కొత్తగా రెండు మార్గాలు అందుబాటులోకి రావటంతో వాటి మీదుగా మిగతా రైళ్లను పరుగుపెట్టిస్తారు. ఈ మార్గంలో ఉండే చర్లపల్లి స్టేషన్‌లో రెండు, ఘట్‌కేసర్ స్టేషన్‌లో 2 చొప్పున అదనపు ప్లాట్‌ఫారాలను కూడా నిర్మించారు. మౌలాలి సీ క్యాబిన్, చర్లపల్లి, ఘట్‌కేసర్ స్టేషన్ల వద్ద నూతనంగా స్టేషన్ భవనాలను కూడా నిర్మించారు.

**ఎంఎంటీఎస్ రైళ్లకు మాత్రం నిరీక్షణ తప్పదు**

ఎంఎంటీఎస్ రైళ్ల కోసం నిర్మించిన ఈ కొత్త డబుల్‌లేన్ మీదుగా రైళ్లు దూసుకెళ్లేందుకు కొంతకాలం నిరీక్షించక తప్పని దుస్థితి నెలకొంది. ఘట్‌కేసర్ నుంచి మౌలాలి వరకు రూపుదిద్దుకున్న కొత్త డబుల్‌లైన్, అక్కడి నుంచి సనత్‌నగర్‌కు మళ్లాల్సి ఉంది. ఆ డైవర్షన్ మౌలాలి హౌసింగ్‌బోర్డు కాలనీ మీదుగా అమ్ముగూడ మార్గంలో ప్రస్తుతం ఉన్న సింగిల్ లైన్‌తో అనుసంధానం కావాల్సి ఉంది. సనత్‌నగర్ మీదుగా సుచిత్ర, రామకృష్ణాపురం, నేరేడ్‌మెట్ మీదుగా ప్రస్తుతం సాగుతున్న ఆ సింగిల్‌లేన్‌ను కేవలం గూడ్సు రైళ్లు నడిపేందుకే పరిమితం చేశారు. దానిని అనుసంధానిస్తూ కొత్తగా డబుల్‌లేన్ రూపొందించాల్సి ఉంది. కానీ మధ్యలో కొంత భాగం రక్షణ శాఖ స్థలాలున్నాయి. వాటిని స్వాధీనం చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. అది ఇంకా పెండింగులోనే ఉంది. ఇక పనులు చేసేందుకు రైల్వే తన వంతు వాటా (ఒక వంతు) నిధులు సిద్ధంగా ఉంచుకుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా (రెండు వంతులు) ఇవ్వటంలో జాప్యం జరుగుతోంది. ఆ రెండు సమస్యలు పరిష్కారమైతే మిగతా పని పూర్తి చేసేందుకు సరిగ్గా సంవత్సరం సమయం పడుతుంది. అది అందుబాటులోకి వస్తే సనత్‌నగర్-ఘట్‌కేసర్ మధ్య ఎంఎంటీఎస్ రైళ్లు పరుగుపెడతాయి.

# పసుపు మార్కెటింగ్ లో కేంద్రం విఫలం

**వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి**



**సాక్షి, హైదరాబాద్:** పసుపు రైతులకు మద్దతు ధర లేదని, ఔషధ లక్షణాలున్న పసుపును ప్రపంచవ్యాప్తం చేయకపోవడం కేంద్ర అసమర్థతకు నిదర్శనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం పసుపు నాణ్యత పెంపు, మార్కెటింగ్, వినియోగం, మద్దతు ధరలపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు దేవాదాయ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ అలెప్పీ పసుపునకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉందని, అదే రకాన్ని ఇక్కడి రైతులకు అందించి సాగులో మెళకువలు అందించామన్నారు. నాణ్యతను పెంచడంతో పాటు, ఎగుమతుల మీద దృష్టి సారించాలన్నారు. అన్ పాలిష్డ్ పసుపుతో రైతులు నష్టపోతున్నారని, పండించిన పంటను ఉడి కించి, ఎండబెట్టి మార్కెట్‌కు తెస్తున్నారన్నారు. ప్రభుత్వమే పసుపును తీసుకుని ప్రాసెసింగ్ చేసే అవకాశాల మీద దృష్టి సారించాలన్నారు. పసుపులో కర్క్యుమెన్ శాతం పెంచితే ఎగుమతులు పెరిగి మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. కలర్స్, ఫార్మా రంగాలలో పసుపు వినియోగం పెంచితే బాగుంటుందన్నారు. 1.33 లక్షల ఎకరాలలో రూ.1,687 కోట్ల విలువైన 2.81 లక్షల మెట్రిక్ టన్నుల పసుపు ఉత్పత్తి అవుతోందని తెలిపారు. పీపీపీ మోడల్ లో పసుపు ప్రాసెసింగ్, మార్కెటింగ్ అంశాలపై దృష్టి సారించాలన్నారు. పతంజలి లాంటి సంస్థలకు వసతులు కల్పించి మన పసుపును పూర్తిగా వారే కొనేలా ప్రయత్నాలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, సంజయ్ కుమార్, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, జీవన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ఉద్యాన శాఖ సంచాలకులు వెంకట్రాం రెడ్డి, మార్క్‌ఫెడ్ ఎండీ భాస్కరాచారి పాల్గొన్నారు.




**● గురుకుల పాఠశాలలు అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని, ప్రభుత్వ బడులను కూడా ఇదే తరహాలో నిర్వహించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌ను కోరింది. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు హరగోపాల్, చక్రధర్ రావు, లక్ష్మీనారాయణ వినోద్‌కుమార్‌కు విన్నవించారు.**




# 'మల్లన్న' నుంచే సింగూరుకు గోదారి!

- గతంలో కాళేశ్వరం నీటిని కొండపోచమ్మ ద్వారా సింగూరుకు తరలించాలన్న ప్రతిపాదన వెనక్కి
- పాత ప్యాకేజీ-17, 18, 19 కొనసాగింపునకు సీఎం నిర్ణయం

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను సింగూరు ప్రాజెక్టుకు తరలించే విషయంలో ఇన్నాళ్లూ ఉన్న సందిగ్ధత తొలగింది. కాళేశ్వరంలో భాగంగా ఉన్న మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచే నీటిని గతంలో ప్రతిపాదించిన మాదిరి సింగూరుకు గోదావరి నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతంలో సింగూరుకు తరలించేలా చేపట్టిన పనులను తిరిగి ఆరంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రాజెక్టు ఇంజనీర్లను ఆదేశించారు. దీంతో గత కొన్నేళ్లుగా ఆగిన ప్యాకేజీ-17, 18, 19 పనులు తిరిగి ఆరంభమయ్యాయి.

**విద్యుత్, భూసేకరణ ఖర్చులు ఆదా..**

మల్లన్న సాగర్ నుంచి గ్రావిటీ పద్ధతిన హల్దీ వాగు ద్వారా సింగూరుకు నీటిని తరలించే ప్రక్రియను గతంలోనే చేపట్టారు. మల్లన్న సాగర్‌లో నీటిని తీసుకునే లెవల్ 557 మీటర్లు ఉండగా, సింగూరు లెవల్ 530 మీటర్లు ఉంది. గ్రావిటీ పద్ధతిన నీటిని కొంతదూరం తీసుకెళ్లి, మధ్యన 32 మీటర్ల లిఫ్టు ద్వారా 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న సింగూరుకు పంపేలా రూ.2,500 కోట్లతో ప్యాకేజీ-17, 18, 19లను చేపట్టారు. ప్యాకేజీ-17లో ఉన్న 18 కి.మీల టన్నెల్ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటం, ఆ పనులు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించాలని ప్రభుత్వం మూడేళ్ల కింద నిర్ణయించింది. 627 మీటర్ల కొండపోచమ్మ లెవల్ నుంచి 530 మీటర్ల లెవల్ ఉన్న సింగూరుకు పూర్తి గ్రావిటీ ద్వారా నీటిని తరలించవచ్చని నిర్ణయించి దీనికి అనుగుణంగా ప్రణాళికలు వేసింది. అయితే కొండపోచమ్మ ద్వారా నీటిని తరలిస్తే, సంగారెడ్డి జిల్లాలోని ఇక్రిశాట్, ఇస్నాపూర్ పారిశ్రామిక ప్రాంతాలతో పాటు ఎన్‌హెచ్-65ని కూడా దాటాల్సి ఉంటుంది. ఈ ప్రాంతంలో ఎకరా భూమి ధర రూ.5 కోట్లకు పైగా ఉండటంతో భూసేకరణ భారం కానుంది. అదీగాక కొండపోచమ్మ సాగర్ నుంచి పైప్‌లైన్ ద్వారా హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం నిర్మిస్తున్న కేశవాపూర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సింగూరుకు, అటు నుంచి నిజాంసాగర్‌కు నీటి తరలింపు అనుకున్న మేర సరఫరా చేయడం సాధ్యం కాదు. దీనికి బదులు మల్లన్న సాగర్ ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటిని హల్దీ వాగు ద్వారా సింగూరుకు, అటు నుంచి నిజాంసాగర్‌కు తరలిస్తే మేలని ప్రభుత్వం ఇటీవల ఇంజనీర్లతో జరిపిన చర్చల సందర్భంగా తేల్చింది.

**విద్యుత్ ఖర్చు రూ.67 కోట్లు..**

మల్లన్న సాగర్ నుంచి సింగూరుకు నీటిని తరలిస్తే విద్యుత్ ఖర్చు కేవలం రూ. 67 కోట్లు మాత్రమే ఉంటుందని, అదే కొండపోచమ్మ ద్వారా అయితే రూ. 352 కోట్లు అవసరం ఉంటుందని రిటైర్డ్ ఇంజనీర్లు సైతం తేల్చి చెప్పారు. దీంతో పాటు ఇప్పటికే సేకరించిన భూమి అవసరాలపై వెచ్చించిన రూ.500 కోట్లు మేర ఆదా ఉంటుందని తెలిపారు. దీంతో ఏకీభవించిన ముఖ్యమంత్రి మల్లన్న సాగర్ ద్వారానే సింగూరుకు నీటిని తరలించాలని సూచించారు. దీంతో ఇప్పుడిప్పుడే మూడు ప్యాకేజీల పనులను ఏజెన్సీలు తిరిగి ఆరంభించాయి.







# దళిత క్రిస్టియన్లకు రిజర్వేషన్లు ఇస్తే తప్పేంటి?

- పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు
- గురుకులాల్లో క్రిస్టియన్లకు 2% రిజర్వేషన్లపై పిల్
- ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం
- విచారణ 4 వారాలకు వాయిదా



**సాక్షి, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం దళిత క్రిస్టియన్లకు గురుకుల పాఠశాలల్లో రెండు శాతం రిజర్వేషన్లు కల్పించడం స్వాగతించదగ్గ అంశమని హైకోర్టు స్పష్టం చేసింది. హిందూ మతం నుంచి క్రిస్టియన్ మతంలోకి మారిన వారికి రెండు శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన పి. శ్రీనివాస్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డిల ధర్మాసనం ఇటీవల విచారించింది. ఆర్థికంగా, సామాజికంగా మార్పు లేనప్పుడు రిజర్వేషన్లు ఇవ్వడంలో తప్పులేదని అభిప్రాయపడింది. దళితుడు మతం మార్చుకుంటే ఒక్కసారిగా అతని స్థాయి ఏమీ మారిపోదని హైకోర్టు వ్యాఖ్యానించింది. నిమ్న వర్గానికి చెందిన వ్యక్తి మతం మార్చుకుంటే ఉన్నత వర్గానికి చెందిన వాడైపోడని, కోటీశ్వరుడు కూడా మారిపోడని పేర్కొంది. మతం మారితే పేరు మారుతుందేగానీ అతని జీవన ప్రమాణాల్లో మార్పులేమీ రాబోవని చెప్పింది. అణగారిన వర్గాలను పైకి తీసుకురావాలని కేంద్రం కూడా ప్రయత్నిస్తోందని, తెలంగాణ సర్కార్ మరో అడుగు ముందుకువేసి దళిత క్రిస్టియన్లకు గురుకులాల్లో రెండు శాతం సీట్లను కేటాయించిందని పేర్కొంది. నేటికీ రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం ఉందంటే వారి జీవన ప్రమాణాల్లో మార్పులు రాలేదని అర్థం అవుతోందని అభిప్రాయపడింది. పిటిషనర్ తరఫు న్యాయవాది హరినాథ్ వాదనలు వినిపిస్తూ, ఎస్సీ వర్గానికి చెందిన వారు క్రిస్టియన్ మతాన్ని స్వీకరిస్తే బీసీ-సీ కేటగిరీలోకి వస్తారని, వారికి దళితులకు లభించే రిజర్వేషన్లు అమలు చేయకూడదని చెప్పారు. గురుకులాల్లో రెండు శాతం సీట్లను మాత్రమే క్రిస్టియన్లకు రిజర్వేషన్లు కల్పించామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్ కుమార్ చెప్పారు. వాదనల అనంతరం ప్రభుత్వ వాదనలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ఆదేశించిన ధర్మాసనం విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.



# భారత్‌లో తొలి మరణం

- బుధవారం కర్నాటకలో మరణించిన వ్యక్తికి కోవిడ్‌–19 నిర్ధారణ
- అంతకముందు హైదరాబాద్‌లో చికిత్స పొందిన బాధితుడు మహ్మద్‌ హుస్సేన్‌ సిద్ధఖీ
- ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో పాజిటివ్‌ కేసు నమోదు

**సాక్షి సిటీబ్యూరో/బెంగళూరు:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌ భారత్‌లో తొలి మరణాన్ని తన ఖాతాలో వేసుకుంది. కర్నాటకలోని కలబుర్గికి చెందిన మహ్మద్‌ హుస్సేన్‌ సిద్ధఖీ(76) కోవిడ్‌ లక్షణాలతో బాధ పడుతూ బుధవారం మరణించారు. ఆయనకు కరోనా సోకినట్లు తాజాగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని గురువారం కర్నాటక ఆరోగ్యశాఖ మంత్రి బీ శ్రీరాములు నిర్ధారించారు. జనవరి చివరి వారంలో సౌదీ అరేబియాకు వెళ్లిన సిద్ధఖీ ఫిబ్రవరి 29న తిరిగి వచ్చారు. దగ్గు, జలుబు, జ్వరం, శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆయనను 4వ తేదీన గుల్బర్గాలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అయినా జ్వరం తగ్గక పోవడంతో మెరుగైన వైద్యం కోసం ఆయనను అంబులెన్స్‌లో సోమవారం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. తొలుత జూబ్లిహిల్స్‌లోని ఓ కార్పొరేట్‌ ఆస్పత్రికి, ఆ తర్వాత బంజారాహిల్స్‌ రోడ్‌ నెంబర్‌ 12లో ఉన్న మరో కార్పొరేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ అడ్మిట్‌ చేసుకోకపోవడంతో చివరకు బంజారాహిల్స్‌ రోడ్‌ నెంబర్‌ ఒకటిలో ఉన్న మరో కార్పొరేట్‌ ఆస్పత్రి అత్యవసర విభాగానికి తీసుకొచ్చారు. వైద్యులు అప్పటికే బాధితుడికి కరోనా సోకినట్లు అనుమానించారు. గాంధీ ఆస్పత్రిలోని ఐసోలేషన్‌ వార్డుకు తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. బంధువులు ఆయన్ను గాంధీకి తీసుకెళ్లకుండా ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో మంగళవారం మళ్లీ గుల్బార్గకు తీసుకెళ్లారు. మంగళవారం గుల్బార్గా ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్స్‌ వైద్యులు బాధితుని నుంచి నమూనాలు సేకరించి, బెంగళూర్‌లోని వైరాలజీ ల్యాబ్‌కు పంపింది. బాధితుడు బుధవారం సాయంత్రం మృతి చెందాడు. బాధితుడికి సంబంధించిన రిపోర్ట్‌లు గురువారం సాయంత్రం వచ్చాయి. ఆ మెడికల్‌ రిపోర్ట్‌ల్లో అతడికి కరోనా వైరస్‌ సోకినట్లు నిర్ధారణ అయింది.

**హైదరాబాద్‌ అలర్ట్‌**

కోవిడ్‌–19తో మృతి చెందిన వ్యక్తి హైదరాబాద్‌లో చికిత్స పొందిన నేపథ్యంలో హైదరాబాద్‌ సహా తెలంగాణాలో ఆందోళన నెలకొంది. ఆయనకు చికిత్స అందించిన బంజారాహిల్స్, జూబ్లిహిల్స్‌లోని మూడు కార్పొరేట్‌ ఆస్పత్రుల్లోని వైద్య సిబ్బందిలో ఆందోళన నెలకొనడంతో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఆయా ఆస్పత్రుల్లోని వైద్య సిబ్బందికి వ్యాధినిర్ధారణ పరీక్షలకు ఆదేశించింది. కాగా, సిద్ధఖీ సంబంధీకులు, ఆయనతో సన్నిహితంగా ఉన్నవారు, చికిత్స అందించినవారు.. అందరి వివరాలను సేకరించి, వారిని వేరుగా ఉంచి, నిర్ధారణ పరీక్షలు జరిపే ప్రక్రియను ప్రారంభించామని కర్నాటక మంత్రి శ్రీరాములు తెలిపారు. సిద్ధిఖీకి ఇప్పటికే రక్తపోటు, మధుమేహం, అస్తమా తదితర ఆరోగ్య సమస్యలున్నాయన్నారు.

వైరస్‌ వ్యాప్తి చెందకుండా సిద్ధఖీ మృతదేహాన్ని అన్ని జాగ్రత్తలతో, భారత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా డిస్పోజ్‌ చేశామని కర్నాటక అంటు వ్యాధుల నిరోధక విభాగం జాయింట్‌ డైరెక్టర్‌ బీజీ ప్రకాశ్‌ తెలిపారు. మృతదేహంపై సూక్ష్మక్రిములను పూర్తిగా నిర్మూలించే ప్రక్రియ జరిపామన్నారు. సిద్ధఖీని కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లిన నేపథ్యంలో.. కోవిడ్‌–19 నిర్ధారణ అయిన విషయాన్ని తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేశామన్నారు.

**వైరస్‌పై ఫోకస్‌**

కరోనా వైరస్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్రమైన మహమ్మారిగా ప్రకటించడంతో భారత్‌ దీనిపై సమరభేరి మోగించింది. కొత్తగా ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరుజిల్లాలో పాజిటివ్‌ కేసు నమోదైంది. మరో 13 తాజా కేసులు వెలుగులోకి రావడంతో మొత్తం కేసుల సంఖ్య 74కి చేరుకుంది. ఈ పరిణామాలతో భారత్‌ తనంతట తానుగా నిర్బంధంలోకి వెళ్లిపోయే దిశగా అడుగులు వేస్తోంది. సరిహద్దులన్నీ మూసి వేసి రాకపోకలపై నిషేధం విధించింది. కరోనాను కట్టడి చేయడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంది. వైరస్‌ విశ్వరూపం చూపిస్తూ ఉండడంతో మంత్రులెవరూ విదేశాలకు ప్రయాణాలు చేయవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. భారీగా హాజరయ్యే కార్యక్రమాలకు ప్రజలందరూ దూరంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు మానుకోవాలని అన్నారు. ఇదే అంశంపై గురువారం ఆయన వరస ట్వీట్లు చేశారు. 'ఆందోళన చెందాల్సిన పనిలేదు. అప్రమత్తంగా ఉంటే సరిపోతుంది' అని ధైర్యం చెప్పారు.



ప్రపంచంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయాల్లో ఒకటైన లండన్‌లోని హీత్రూ ఎయిర్‌పోర్ట్‌ గురువారం దాదాపు నిర్మానుష్యంగా మారిన దృశ్యం

**తగ్గిపోతున్న విదేశీ ప్రయాణికులు**

కరోనా భయంతో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల సంఖ్య రానురానూ తగ్గిపోతోంది. సాధారణ సమయాల్లో రోజూ 70 వేల మంది వచ్చే ప్రయాణికుల సంఖ్య 62 వేలకు పడిపోయిందని కేంద్ర మంత్రి హర్‌దీప్‌ సింగ్‌ పూరి లోక్‌సభలో చెప్పారు. వీసాల రద్దు, ప్రయాణాలు మానుకోవాలన్న కేంద్రం ప్రకటనలతో వారి సంఖ్య 40 వేలకు పడిపోయే అవకాశం ఉందన్నారు.

**విదేశీ ప్రయాణికులపై నిషేధం లేదు**

కరోనా వ్యాప్తిని అడ్డుకోవడానికి విదేశీయులు ఎవరూ రాకుండా పూర్తి స్థాయిలో నిషేధం విధించలేదని విదేశాంగ మంత్రి జైశంకర్‌ గురువారం లోక్‌సభకు చెప్పారు. వారి రాకపోకలపై కొన్ని ఆంక్షలు మాత్రమే విధించామని స్పష్టం చేశారు. చైనా, ఇటలీ, ఇరాన్, దక్షిణకొరియా, ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీలతో పాటు వైరస్‌ ప్రభావం తీవ్రంగా ఉన్న దేశాల నుంచి వచ్చిన వారిని తప్పనిసరిగా విడిగా ఉంచి 14 రోజుల పాటు పర్యవేక్షిస్తామని, మిగిలిన దేశాల నుంచి వచ్చే వారిని అవసరమైతేనే నిర్బంధ కేంద్రాలకు పంపిస్తామన్నారు.

**కరోనాపై సమరభేరి..**

- కరోనా వైరస్‌ ముప్పుతో దేశంలోని పలు రాష్ట్రాలు స్కూళ్లు, కాలేజీలను మూసివేశాయి. ఢిల్లీలో పాఠశాలలు, కళాశాలలు, సినిమా థియేటర్లను మార్చి 31 వరకు మూసివేసినట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్‌ కేజ్రీవాల్‌ ప్రకటించారు. అత్యధిక కేసులు నమోదైన కేరళలో కూడా విద్యాసంస్థలు, థియేటర్లను ఈ నెలాఖరువరకు మూసివేశారు.
- భారీ జనసందోహాలను నివారించడం కోసం రాష్ట్రపతి భవన్‌లోకి శుక్రవారం నుంచి సందర్శకులను అనుమతించరు.
- ఇరాన్, ఇటలీ, కొరియా వంటి దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులకు కరోనా వైరస్‌ సోకలేదని నిర్ధారణ అయ్యాకే వెనక్కి తీసుకువస్తారు.
- ఇతర దేశాల నుంచి తీసుకువచ్చే భారతీయుల్ని ఉంచి పర్యవేక్షించడానికి రక్షణ శాఖ మరో ఏడు ప్రాంతాలు, జైసల్మీర్, సూరత్‌గఢ్, ఝాన్సీ, జోధ్‌పూర్, దేవ్‌లలి, కోల్‌కతా, చెన్నైలో ప్రత్యేక చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయనుంది.

**భారత ప్రధానికి బ్రిటన్‌ పీఎం ఫోన్‌కాల్‌**

**లండన్‌:** బ్రిటన్‌ ప్రధాని బోరిస్‌ జాన్సన్‌ గురువారం భారత ప్రధాని మోదీకి ఫోన్‌ చేశారు. కరోనా వైరస్‌ విస్తృతిని అడ్డుకునేందుకు ప్రపంచదేశాలు కలసికట్టుగా తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. కాగా, కోవిడ్‌కి టీకా కనుగొనేందుకు భారత్‌కు కనీసం రెండు సంవత్సరాలు పడుతుందని కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు పేర్కొన్నారు. ఎంత యుద్ధ ప్రాతిపదికన కృషి చేసినా.. 18 నెలల్లోపు వ్యాక్సిన్‌ను కనుగొనడం అసాధ్యమన్నారు.

## ప్రపంచంపై కరోనా పడగ

- 115 దేశాల్లో 1.25 లక్షల కేసులు; 4600 మరణాలు
- యూరప్‌ దేశాలపై అమెరికా ట్రావెల్‌ బ్యాన్‌



వైరస్‌ను చంపేందుకు షాంఘైలో బస్సుల్లో ఉంచిన అల్ట్రా వయొలెట్‌ కిరణాల మిషన్లు

**జెనీవా/టెహ్రాన్‌:** కరోనా వైరస్‌ ప్రపంచ దేశాలను వణికిస్తోంది. వైరస్‌ వెలుగు చూసిన చైనాలో కొత్త కేసుల సంఖ్య తగ్గుముఖం పడుతుండగా.. ఇరాన్, ఇటలీ, ఫ్రాన్స్, దక్షిణ కొరియా, అమెరికా సహా పలు దేశాల్లో విజృంభిస్తోంది. గురువారానికి ప్రపంచవ్యాప్తంగా 115 దేశాల్లో ఈ వైరస్‌ బాధితుల సంఖ్య 1,25,293గా, మరణాలు 4,600గా తేలిందని ఏఎఫ్‌పీ వార్తాసంస్థ గణించింది. వీటిలో చైనా వెలుపల నమోదైన కేసులు 44,500 కాగా, మరణాల సంఖ్య 1431. మొత్తం కేసులు, గణాంకాలను పరిశీలిస్తే ఆసియాలో వైరస్‌ తీవ్రత అధికంగా ఉంది. ఆసియాలో 90,765 కేసులు నమోదు కాగా, 3,253 మరణాలు సంభవించాయి. యూరప్‌లో 22,969 కేసులు, 947 మరణాలు, మధ్యప్రాచ్యంలో 9,880 కేసులు, 364 మరణాలు, అమెరికా, కెనడాల్లో 1,194 కేసులు, 29 మరణాలు, ఆఫ్రికాలో 130 కేసులు, రెండు మరణాలు చోటు చేసుకున్నాయి. చైనా తరువాత ఎక్కువగా ఇటలీలో 12,462 కేసులు, 827 మరణాలు, ఇరాన్‌లో 10,075 కేసులు, 429 మరణాలు సంభవించాయి. కోవిడ్‌ –19ను 'అదుపు చేయదగ్గ విశ్వవ్యాప్త మహమ్మారి' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.

**5 బిలియన్‌ డాలర్లివ్వండి**

వైరస్‌ వ్యాప్తిని అరికట్టేందుకు, చికిత్స అందించేందుకు 5 బిలియన్‌ డాలర్ల అత్యవసర ఆర్థిక సాయం అందించాలని ఇరాన్‌ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్‌)ను ఆశ్రయించింది. ఐఎంఎఫ్‌ను ఇరాన్‌ సాయం కోరడం 1962 తరువాత ఇదే ప్రథమం. కరోనా భయంతో పాఠశాలలకు శ్రీలంక ప్రభుత్వం సెలవులు ప్రకటించింది.

**యూరప్‌ దేశాలపై ట్రావెల్‌ బ్యాన్‌**

కరోనా కల్లోలం నేపథ్యంలో యూకే మినహా ఇతర యూరప్‌ దేశాల నుంచి అమెరికాలోకి ఎవరూ అడుగుపెట్టవద్దని గురువారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ అసాధారణ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి 30 రోజుల పాటు యూకేయేతర యూరప్‌ దేశాల వారిపై ఈ నిషేధం ఉంటుందన్నారు. వైరస్‌ వ్యాప్తిని అడ్డుకోవడంలో యూరోపియన్‌ యూనియన్‌ విఫలమైందని ఆయన విమర్శించారు. అమెరికా ట్రావెల్‌ బ్యాన్‌పై యూరప్‌ దేశాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మరోవైపు, అమెరికా రక్షణ మంత్రి మార్క్‌ ఎస్పర్‌ భారత పర్యటన కూడా రద్దయింది. మార్చి 15, 16 తేదీల్లో ఆయన భారత్‌లో పర్యటించాల్సి ఉంది.

**ట్రంప్‌ను కలిసిన వ్యక్తికి కోవిడ్‌–19**

**బ్రెజీలియా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌నకు కూడా కోవిడ్‌–19 ముప్పు పొంచి ఉన్నట్లు కనిపిస్తోంది. గతవారం ట్రంప్‌ను కలిసిన బ్రెజిల్‌ కమ్యూనికేషన్స్‌ చీఫ్‌ ఫేబియోకు కరోనా వైరస్‌ సోకినట్లు నిర్ధారణ అయింది. బ్రెజిల్‌ అధ్యక్షుడు జాయిర్‌ బొల్సొనారొ గత వారం ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఫేబియో, ఇతర అధికార బృందం కూడా ఆ భేటీలో పాల్గొన్నది. అనంతరం ఫేబియోకు కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. అయితే, దీనిపై ఆందోళన చెందడం లేదని ట్రంప్‌ వ్యాఖ్యానించారు.

**యూఎస్‌ వర్సిటీలపై కరోనా ఎఫెక్ట్‌**

**వాషింగ్టన్‌:** కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో అమెరికాలోని 100కు పైగా విశ్వవిద్యాలయాల్లో తరగతులను రద్దు చేశారు. ముఖ్యంగా విద్యార్థులు క్లాస్‌లకు ప్రత్యక్షంగా హాజరు కావడాన్ని నిలిపేస్తూ పలు యూనివర్సిటీలు నిర్ణయం తీసుకున్నాయి. ఆన్‌లైన్‌ క్లాస్‌లను ప్రోత్సహిస్తున్నాయి. పలు విద్యాలయాలు తమ క్యాంపస్‌ల్లో క్రీడలు సహా బోధనేతర కార్యక్రమాలను రద్దు చేశాయి.

## నాలుగు హత్యల హంతకునికి ఉరి

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** కన్నతల్లి అనే కనికరం చూపలేదు, కట్టుకున్న ఇల్లాలు అనే ప్రేమలేదు, ఇద్దరు పిల్లలు అనే కడుపుతీపి లేదు. అప్పుల బాధతో నరరూప రాక్షసునిగా మారి అందరినీ ఒకేసారి హతమార్చిన దోషికి కోర్టు ఉరిశిక్ష విధించింది. చెన్నైకి చెందిన దామోదరన్‌(40) దుస్తుల దుకాణం నడిపేవాడు. ఇతనికి భార్య దీప (35), కుమారుడు రోషన్‌ (7), కుమార్తె మీనాక్షి (4), తల్లి సరస్వతి (60) ఉన్నారు. వ్యాపారంలో నష్టం రావడంతో 2017 డిసెంబర్‌ 12న భార్య, తల్లి, ఇద్దరు బిడ్డలను కత్తితో పొడిచి చంపేశాడు. అనంతరం ఆత్మహత్యకు యత్నించినా ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ కేసును విచారించిన చెంగల్పట్టు మహిళా కోర్టు దామోదరన్‌ను ప్రాణాలు వదిలే వరకు ఉరి వేయాల్సిందిగా గురువారం తీర్పు చెప్పింది.

## ఇండియా పోస్ట్‌ 'ఫ్రీ డిజిటల్‌ లాకర్‌'

**కోల్‌కతా:** భారతీయ తపాలా శాఖ దేశంలోనే మొట్టమొదటి సారిగా కోల్‌కతాలో ఫ్రీ డిజిటల్‌ పార్శిల్‌ లాకర్‌ సేవలను గురువారం నుంచి ప్రారంభించింది. దీంతో వినియోగదారులు కొన్ని ప్రత్యేక పోస్టాఫీసుల నుంచి వీలున్న సమయంలో వచ్చి పార్శిల్‌ను పొందవచ్చు. కోల్‌కతాలోని నబడిగంట ఐటీ పోస్టాఫీసు, న్యూటౌన్‌ పోస్టాఫీసుల్లో ప్రస్తుతానికి ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. రిజిస్టర్డు, స్పీడ్‌ పోస్టుల్లో వచ్చిన పార్శిళ్లకు ఇది వర్తిస్తుంది. ఈ పార్శిళ్లను ఎంపిక చేసిన పోస్టాఫీసుల్లోని డిజిటల్‌ పార్శిల్‌ లాకర్లలో ఉంచుతారు. ఈ మేరకు వినియోగదారుకు మెసేజీతోపాటు ఓటీపీ నంబర్‌ వెళతాయి. వారం రోజుల్లోగా వారు తమకు వీలైన వేళల్లో వచ్చి పార్శిళ్లను పొందవచ్చు.

## రూ.60 లక్షలు పెరిగిన శరద్‌పవార్‌ ఆస్తులు

**ముంబై:** ఎన్సీపీ చీఫ్‌ శరద్‌ పవార్‌ ఆస్తులు ఆరేళ్లలో రూ.60 లక్షల మేర పెరిగి రూ.32.73 కోట్లకు చేరాయి. ఈ మేరకు ఆయన బుధవారం దాఖలు చేసిన రాజ్యసభ నామినేషన్‌ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన అన్న కొడుకు అజిత్‌ పవార్‌ భార్య సునేత్రా పవార్, మనవడు పార్థ్‌ పవార్‌ నుంచి వాటాల బదిలీకి అడ్వాన్స్‌గా రూ.కోటి తీసుకున్నట్లు.. ఆ మొత్తాన్ని అప్పుల్లో శరద్‌ పవార్‌ చూపారు. 2014 రాజ్యసభ ఎన్నికల అఫిడవిట్‌లో శరద్‌ పవార్‌ చరాస్తులు రూ.20 కోట్ల 48 లక్షలు.. స్థిరాస్తులు రూ.11 కోట్ల 65 లక్షలుగా.. మొత్తం రూ.32.13 కోట్ల ఆస్తులను చూపారు.

## యూపీ చర్యలను తప్పుపట్టిన సుప్రీం

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారని, ఆస్తుల విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ ఉత్తరప్రదేశ్‌ ప్రభుత్వం కొంతమంది ఫొటోలు, వ్యక్తిగత వివరాలను పోస్టర్ల ద్వారా ప్రకటించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఉత్తరప్రదేశ్‌ ప్రభుత్వం చేసిన పనిని సమర్థించుకునేందుకు ఏ చట్టమూ లేదని స్పష్టం చేసింది. పోస్టర్లను తొలగించాల్సిందిగా అలహాబాద్‌ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. 'ఆందోళన చేశారని చెబుతున్న వారి ప్రాథమిక హక్కులను ప్రభుత్వం కాలరాయవచ్చా? పోస్టర్ల ద్వారా వారిని దండించ వచ్చా'అని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది.

# బ్రిటన్‌ వీసా ఫీజుల పెంపు

- భారం కానున్న ఆరోగ్య సేవలు
- ఆర్థిక మంత్రి ప్రతిపాదనలు




**లండన్‌:** బ్రిటన్‌కు వెళ్లాలనుకుంటున్నారా? అయితే ఇది చేదువార్తే. ఎందుకంటే వీసా ఫీజులతోపాటు తప్పనిసరిగా చెల్లించాల్సిన ఆరోగ్య సేవల సర్‌చార్జి భారీగా పెరగనుంది. ఈ మేరకు బ్రిటన్‌ ఆర్థిక మంత్రి, భారత సంతతికి చెందిన రిషి సునాక్‌ తన బడ్జెట్‌లో ప్రకటించారు. ఇప్పటివరకూ ఈ ఇమ్మిగ్రేషన్‌ హెల్త్‌ సర్‌చార్జి (ఐహెచ్‌ఎస్‌) ఏడాదికి 400 పౌండ్లు (రూ.38 వేలు) మాత్రమే ఉండగా.. తాజా బడ్జెట్‌ ప్రకారం ఇది 624 పౌండ్లు (సుమారు రూ.60 వేలు)కు చేరుకోనుంది. వలసదారులందరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకే రుసుము పెంచుతున్నట్లు రిషి బుధవారం బడ్జెట్‌ ప్రసంగంలో పేర్కొన్నారు. 'సర్‌చార్జి ఇప్పటికే ఉన్నప్పటికీ అది ప్రజలకు అందుతున్న సేవలకు తగ్గట్టుగా లేదు. అందుకే మా మ్యానిఫెస్టోలో సర్‌ ఛార్జిని 624 పౌండ్లకు పెంచుతామని చెప్పాము. బాలబాలికలకు ఇందులో రాయితీ లభిస్తుంది'అని వివరించారు. బడ్జెట్‌ ప్రతిపాదనల ప్రకారం 18 ఏళ్లలోపు వారికి ఇమ్మిగ్రేషన్‌ హెల్త్‌ సర్‌చార్జ్‌ 470 (రూ.45 వేలు) పౌండ్లుగా ఉండనుంది. ఇదే సమయంలో అంతర్జాతీయ విద్యార్థులపై విధించే సర్‌చార్జి కూడా 300 పౌండ్ల నుంచి 470 పౌండ్లకు పెరగనుంది. ఐదేళ్ల క్రితం బ్రిటన్‌ ఈ ఐహెచ్‌ఎస్‌ను ప్రవేశపెట్టింది. 2018లో 200 పౌండ్ల నుంచి 400 పౌండ్లకు పెంచింది. ఆరు నెలల కంటే ఎక్కువ సమయం బ్రిటన్‌లో గడిపే వారందరికీ ఇది వర్తిస్తుంది.

# స్వచ్ఛ రాజకీయాలు కావాలన్నప్పుడు వస్తా!

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** ముఖ్యమంత్రి కావాలని తాను ఎన్నడూ అనుకోలేదని, స్వచ్ఛమైన రాజకీయాలు కావాలని తమిళ ప్రజలు గట్టిగా కోరుకున్న రోజున రాజకీయాల్లోకి ప్రవేశిస్తానని సూపర్‌స్టార్‌ రజనీకాంత్‌ ప్రకటించారు. అవినీతి రహిత, స్వచ్ఛమైన రాజకీయాలను అందించే లక్ష్యంతో ఏర్పాటు చేయబోయే పార్టీ కోసం మూడంచెల ఫార్ములాను అనుసరిస్తున్నట్లు రజనీ చెప్పారు. పార్టీ వ్యవహారాలకు, పాలనకు మధ్య సంబంధం అస్సలు ఉండదని, సమర్థమైన సంస్థాగత వ్యవస్థ ఉంటుందని, యువతకు పెద్దపీట వేస్తామని ఆయన గురువారం చెన్నైలో విలేకరులకు చెప్పారు. ప్రస్తుత రాజకీయాల్లో మార్పు రావాలని ప్రజలు గట్టిగా కోరుకున్న రోజున తాను రాజకీయాల్లోకి వచ్చితీరతానని ఆయన బల్లగుద్ది మరీ చెప్పారు. ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో కూర్చోవాలని కలలో కూడా ఊహించలేదని, తనను భావి ముఖ్యమంత్రిగా చిత్రీకరించడాన్ని ఇప్పటికైనా మీడియా మానుకోవాలని కోరారు. మూడేళ్ల క్రితం అంటే 2017 డిసెంబర్‌ 31న రజనీకాంత్‌ ఒక ప్రకటన చేస్తూ.. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని చెప్పడం గమనార్హం. 'రాజకీయ, ప్రభుత్వ మార్పు ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ కాదు'అని కూడా ఆయన అప్పట్లో వ్యాఖ్యానించారు. ఏఐఏడీఎంకే అధినేత్రి, ముఖ్యమంత్రి జయలలిత, డీఎంకే దిగ్గజ నేత, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధిల మరణం తరువాత తమిళనాడులో రాజకీయ శూన్యం ఏర్పడిన నేపథ్యంలో రజనీ అప్పట్లో చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అవినీతి, కండబలం రాజ్యమేలుతున్న రాజకీయ వాతావరణంలో ప్రజలు, యువత స్వచ్ఛమైన, అవినీతి రహిత రాజకీయాల కోసం ఉద్యమించాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. విద్యావంతులు, నిజాయితీపరులు, ఆత్మస్థైర్యం ఉన్న వారిని తన పార్టీ తరపున ముఖ్యమంత్రిగా నియమిస్తానని అది ఒక మహిళ కూడా కావచ్చునని రజనీకాంత్‌ చెప్పుకొచ్చారు. ఆ వ్యక్తి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే సీఈవోగా పనిచేస్తారని అన్నారు.



# ఆ 22 మందికి నోటీసులు

**మధ్యప్రదేశ్‌ కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలకు నోటీసులిచ్చిన స్పీకర్‌**



భోపాల్‌ బీజేపీ కార్యాలయంలో సింధియాకు స్వాగతం పలుకుతున్న శివరాజ్‌సింగ్‌

**భోపాల్‌/న్యూఢిల్లీ/బెంగళూరు:** మధ్యప్రదేశ్‌ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. రాజీనామా చేసిన 22 మంది కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్‌ ఎన్పీ ప్రజాపతి నోటీసులు జారీ చేశారు. శుక్రవారం కల్లా తన ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించారు. స్వచ్ఛందంగానా లేక.. ఎవరి ఒత్తిడితోనైనా రాజీనామా చేశారా అనే విషయంలో స్పష్టత ఇవ్వాలని వారిని కోరారు. ఆ తర్వాతే సభలో బల పరీక్ష చేపడతామని స్పీకర్‌ తెలిపారు. బల నిరూపణకు సిద్ధమని సీఎం కమల్‌నాథ్‌ ఇంతకుముందే తెలిపారని కాంగ్రెస్‌ నేత దిగ్విజయ్‌ సింగ్‌ స్పష్టం చేశారు. అయితే, పార్టీని వీడిన ఆరుగురు మంత్రులు సహా 22 మంది సభ్యుల రాజీనామాల విషయం తేలాకే బలపరీక్ష ఉంటుందన్నారు. రాజీనామాలు చేసిన వారంతా స్పీకర్‌ను ఎందుకు కలుసుకోలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభానికి బీజేపీయే కారణమన్నారు. గురువారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో భోపాల్‌ చేరుకున్న జ్యోతిరాదిత్య సింధియాకు బీజేపీ కార్యకర్తలు, సింధియా అనుచరులు ఘనస్వాగతం పలికారు. మధ్యప్రదేశ్‌ రాష్ట్ర బీజేపీ కార్యాలయంలోకి ఆయన్ను మాజీ సీఎం శివరాజ్‌సింగ్‌ చౌహాన్‌ సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా సింధియా మీడియాతో మాట్లాడుతూ..బీజేపీలోకి చేర్చుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని, పార్టీ కోసం మనస్ఫూర్తిగా పనిచేస్తానని కార్యకర్తలకు హామీ ఇచ్చారు.

**బెంగళూరులో హైడ్రామా**

బెంగళూరు పోలీసులు తమ మంత్రులను ఇద్దరిని అరెస్టు చేశారని మధ్యప్రదేశ్‌ కాంగ్రెస్‌ ఆరోపించింది. కాంగ్రెస్‌ ఎంపీ, న్యాయవాది అయిన వివేక్‌ తంఖా మాట్లాడుతూ.. 'బెంగళూరు రిసార్టులో ఉన్న ఎమ్మెల్యే మనోజ్‌ చౌదరితో మాట్లాడేందుకు ఆయన తండ్రితో కలిసి మంత్రులు జితు పట్వారీ, లఖన్‌ సింగ్‌ వెళ్లారు. బెంగళూరు పోలీసులు వారిని రిసార్టులోపలికి వెళ్లనివ్వలేదు. వారిపై దాడి చేసి, అరెస్టు చేశారు. మనోజ్‌ తన తండ్రితో కలిసి భోపాల్‌ వచ్చేందుకు సిద్ధంగా ఉన్నా, రానివ్వడం లేదు. దీనిపై మేం సుప్రీంకోర్టుకు వెళతాం' అని ఆయన వెల్లడించారు. కాగా, పట్వారీ అక్కడి పోలీసులతో వాదులాడుతున్నట్లుగా ఉన్న వీడియో వైరల్‌ అవుతోంది. రాజీనామా చేసిన 22 మందిలో 19 మంది బెంగళూరులోనూ మిగతా వారు మధ్యప్రదేశ్‌లోనూ ఉన్నట్లు సమాచారం.

**బల పరీక్షకు బీజేపీ డిమాండ్‌**

ఎమ్మెల్యేల రాజీనామా నేపథ్యంలో అసెంబ్లీలో సర్కారు బలం నిరూపించుకోవాలని బీజేపీ డిమాండ్‌ చేసింది. మధ్యప్రదేశ్‌ బీజేపీ చీఫ్‌ విప్‌ నరోత్తమ్‌ మిశ్రా గురువారం మీడియాతో మాట్లాడుతూ..'కాంగ్రెస్‌ ప్రభుత్వం మైనారిటీలో పడిపోయింది. అందుకే, బడ్జెట్‌ సమావేశాలు ప్రారంభం కానున్న ఈ నెల 16వ తేదీన సభలో బల నిరూపణ జరపాలని స్పీకర్‌ను, గవర్నర్‌ను కోరతాం' అని పేర్కొన్నారు.

### ఆయన భవిష్యత్తు గురించి భయపడ్డారు: రాహుల్‌

తన రాజకీయ భవిష్యత్తు గురించి భయపడుతున్నందునే సింధియా నమ్ముకున్న సిద్ధాంతాలను మర్చిపోయారని కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ వ్యాఖ్యానించారు. 'ఆయన బయటకు చెప్పే దానికి వాస్తవ కారణాలకు చాలా తేడా ఉంది. ఆయన నా చిరకాల మిత్రుడు. కాలేజీ రోజుల నుంచి ఆయన నాకు బాగా తెలుసు. తన రాజకీయ భవిష్యత్తు గురించిన భయం వల్లే సిద్ధాంతాలను పక్కన బెట్టి ఆర్‌ఎస్‌ఎస్‌(బీజేపీ)లోకి వెళ్లారు. అయితే, ఆయనకు అక్కడ గౌరవం లభించదు. ఆ పార్టీలో ఆయన సంతృప్తికరంగా ఉండలేరు' అని అన్నారు.

### రాజ్యసభకు 12 మంది పేర్లను ప్రకటించిన కాంగ్రెస్‌



కేసీ వేణుగోపాల్‌

**న్యూఢిల్లీ:** రాజ్యసభకు 12 మంది అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్‌ పార్టీ ప్రకటించింది. వీరిలో పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, హరియాణా మాజీ సీఎం భూపీందర్‌ సింగ్‌ హుడా కుమారుడు దీపేందర్‌ హుడా, న్యాయవాది కేటీఎస్‌ తుల్సి ఉన్నారు. మధ్యప్రదేశ్‌ నుంచి దిగ్విజయ్‌ సింగ్, ఫూల్‌సింగ్‌ బరైయాలను ప్రకటించింది. ఈ రాష్ట్రంలో ఉన్న మూడు సీట్లకు గాను ఒక సీటుపై బీజేపీ, కాంగ్రెస్‌ మధ్య గట్టిపోటీ నెలకొంది. కాగా, ఈ నెల 26వ తేదీన జరగనున్న ఈ ఎన్నికలకు గాను ఇప్పటికే 9 మంది పేర్లను ప్రకటించిన బీజేపీ గురువారం మరో ఐదుగురి పేర్లను ప్రకటించింది. వీరిలో వెనుకబడిన వర్గానికి చెందిన నేత రామ్‌చంద్ర జంగ్రా, హరియాణాకు చెందిన దళిత నేత, పార్టీ ఉపాధ్యక్షుడు దుష్యంత్‌గౌతమ్, హిమాచల్‌ ప్రదేశ్‌ నుంచి ఇందు గోస్వామి, మహారాష్ట్ర నుంచి భగవత్‌ కరాడ్‌ ఉన్నారు.

# ఎన్పీఆర్‌పై అనుమానాలొద్దు: అమిత్‌ షా

- ఈ ప్రక్రియకు ధ్రువపత్రాలు అవసరం లేదు
- ఢిల్లీ అల్లర్ల వెనుక పెద్ద కుట్ర ఉంది
- రాజ్యసభలో హోంమంత్రి అమిత్‌ షా



**న్యూఢిల్లీ:** జాతీయ జనాభా పట్టిక(నేషనల్‌ పాపులేషన్‌ రిజిస్టర్‌–ఎన్పీఆర్‌)పై ఆందోళన అవసరం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా స్పష్టం చేశారు. ఎన్పీఆర్‌ను అప్‌డేట్‌ చేసే కార్యక్రమంలో ఏ పౌరుడి వివరాలను 'అనుమానాస్పద(డౌట్‌ఫుల్‌– డీ)' కేటగిరీలో చేర్చబోమని తెలిపారు. అలాగే, తమ పౌరసత్వాన్ని నిరూపించుకునే ఏ ధ్రువపత్రాలను కూడా పౌరులు ఇవ్వాల్సిన అవసరం లేదని వివరణ ఇచ్చారు. ఎన్పీఆర్‌ ప్రశ్నావళిలో తల్లిదండ్రుల నివాసానికి సంబంధించిన ప్రశ్నలపై తలెత్తిన అనుమానాలను నివృత్తి చేస్తూ.. పౌరులు తమ వద్ద లేని సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. సీఏఏపై గానీ, ఎన్పీఆర్‌పై కానీ మైనారిటీలు ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దన్నారు. ఎన్పీఆర్‌కు సంబంధించిన అనుమానాల నివృత్తికి విపక్ష నేతల బృందం తనను కలవొచ్చని సూచించారు. పౌరసత్వాన్ని రద్దు చేసే ఏ సెక్షన్‌ కూడా పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)లో లేదని మరోసారి స్పష్టం చేశారు. ఢిల్లీ అల్లర్లపై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చకు హోంమంత్రి సమాధానమిచ్చారు. కులం, మతం, రాజకీయ పార్టీలతో అనుబంధం.. వీటికి సంబంధం లేకుండా ఢిల్లీ అల్లర్ల దోషులను చట్టం ముందు నిలుపుతామని పునరుద్ఘాటించారు. పౌరసత్వ సవరణ చట్టం పార్లమెంటు ఆమోదం పొందిన తరువాత కొందరు ఆ చట్టాన్ని వ్యతిరేకిస్తూ చేసిన విద్వేష ప్రసంగాల కారణంగానే ఢిల్లీ హింసాకాండ చోటు చేసుకుందని షా పేర్కొన్నారు. ప్రభుత్వమే హింసాకాండకు పురిగొల్పిందన్న ఆరోపణలపై స్పందిస్తూ.. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన అమెరికా అధ్యక్షుడు దేశంలో పర్యటిస్తున్న వేళ ఏ ప్రభుత్వమైనా అలా చేస్తుందా? అని ప్రశ్నించారు. ఢిల్లీ హింసాకాండ వెనుక పెద్ద కుట్ర ఉందని, విదేశీ నిధులను దీనికి ఉపయోగించారని ఆరోపించారు. అల్లర్లను అదుపు చేయడంలో పోలీసుల తీరును తప్పుబట్టిన ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్‌ మురళీధర్‌ను బదిలీ చేయడంలో ఎలాంటి కుట్ర లేదని, ఆ బదిలీ అంతకుముందు, సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసుల ఆధారంగానే జరిగిందని వివరణ ఇచ్చారు. 'ఆ ఒక్క న్యాయమూర్తే న్యాయం చేస్తారని ఎందుకు అనుకుంటున్నారు? వేరే జడ్జి న్యాయం చేయరా?' అని ప్రశ్నించారు. కాగా, అంతకుముందు విపక్ష సభ్యులు.. ఢిల్లీ అల్లర్లపై నిష్పక్షపాత దర్యాప్తు జరపాలని డిమాండ్‌ చేశారు. కోవిడ్‌ కన్నా ప్రమాదకరమైన మత వైరస్‌(కమ్యూనల్‌ వైరస్‌)ను బీజేపీ వ్యాప్తి చేస్తోందని, దీని వల్ల ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని చర్చను ప్రారంభిస్తూ కాంగ్రెస్‌ సభ్యుడు కపిల్‌ సిబల్‌ వ్యాఖ్యానించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

శ్రీ బయో ఎస్థెటిక్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌

హైదరాబాద్‌ ప్రధాన కేంద్రంగా గల ప్రముఖ అగ్రి బయోటెక్‌ కంపెనీ వారికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని అన్ని జిల్లాల అగ్రిసెంటర్స్‌లలో పనిచేయుటకు ఈ క్రిందివారు కావలెను.

సేల్స్‌ స్టాఫ్‌

పెస్టిసైడ్స్, సీడ్స్, ఫెర్టిలైజర్స్‌ మరియు బయో సేల్స్‌ నందు కనీసం 3 సం॥ల అనుభవం గలవారు తమ బయోడేటాను 10 రోజులలోగా sribioaesthetics2017@gmail.com కు పంపగలరు.

Plot No.50, Jayabheri Enclave, Saanvi Classic, 1st floor, Gachibowli, Hyderabad-500032. Ph : 6309981055

సాక్షి

శుక్రవారం, మార్చి, 13

# కరోనా మేల్కొలుపు

చైనాలో గత డిసెంబర్ చివరిలో ఉనికి చాటుకుని రెండు నెలలపాటు ఆ దేశాన్ని గడగడలాడించి, చాపకింద నీరులా ఒక్కో దేశానికీ విస్తరించిన కరోనా వైరస్‌ను విశ్వవ్యాప్త మహమ్మారిగా పరిగణిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ బుధవారం ప్రకటించింది. అన్నిటినీ తట్టుకుని నిలకడగా ఖండాంతరాలకు విస్తరిస్తూపోయే వ్యాధిని మహమ్మారి అని చెబుతారు. అలాగని దాన్ని అత్యంత ప్రమాదకరమైనదిగా పరిగణించనవసరం లేదు. పకడ్బందీ చర్యలు అవసరమైన వ్యాధిగా దాన్ని అందరితో గుర్తింపజేయడమే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఉద్దేశం. చాలా దేశాలు ఈ వైరస్ వ్యాప్తిని అరికట్టే విషయంలో నిర్లిప్తంగా వుండటాన్ని గుర్తించాక సంస్థ ఈ ప్రకటన చేసింది. వ్యాధి భిన్న భౌగోళిక ప్రాంతాలకు వ్యాపిస్తున్నదని చెప్పడమే దీని పరమార్థం. మన దేశంలో కరోనా వైరస్ కేసులు 74 వరకూ నమోదు కాగా అందులో వైరస్ చురుగ్గా ఉన్న కేసులు 69గా నిర్ధారించారు. అదృష్టవశాత్తూ మరణాలు లేవు. మొత్తమ్మీద గురువారంనాటికి ప్రపంచవ్యాప్తంగా 1,29,156 మందికి ఈ వ్యాధి సోకగా 80,000కు పైగా కేసులు చైనాలోనే వున్నాయి. అక్కడ ఈ వైరస్ బారినపడి 3,169మంది మరణించారు. ఇప్పుడిప్పుడే అది కట్టడి అవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. వ్యాధిని తీవ్రంగా పరిగణించి చర్యలకు ఉపక్రమిస్తే అదుపు చేయడం కష్టంకాదని చైనా అనుభవాలు నిరూపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వైరస్ చురుగ్గా వున్న కేసులు 55,753 కాగా, మరణాల సంఖ్య 4,749. ఆసియాలో చైనా తర్వాత ఈ వ్యాధితో సతమతమవుతున్నది యూరప్ ఖండమే. అందుకే ప్రస్తుతం యూరప్‌ను 'నవ చైనా' అంటున్నారు. ఆ ఖండంలో దాదాపు అన్ని దేశాల్లోనూ వైరస్ జాడ వున్నా ఇటలీ అధికంగా సమస్యలెదుర్కొంటున్నది. అక్కడ ఇంతవరకూ 827 మంది మరణించారు. పశ్చిమాసియాలో ఇరాన్‌కు ఈ వైరస్ తాకిడి ఎక్కువుంది. అక్కడ 429 మంది మరణించారు. బయటపడిన నాటినుంచీ గమనిస్తే ఈ వైరస్ కేసులు పది రెట్లు పెరగ్గా, బాధిత దేశాల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. కనుకనే దీనిపై అందరినీ హెచ్చరించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ భావించింది. విలేకరుల సమావేశంలో వారి మైక్‌లను చేతులతో తాకి వైరస్‌ను తేలిగ్గా తీసుకున్న అమెరికా బాస్కెట్ బాల్ ఆటగాడు రూడీ గోబర్ట్‌ను 48 గంటల్లో ఆ వ్యాధి పలకరించింది. హాలీవుడ్ నటుడు టామ్ హాంక్స్, ఆయన భార్య కూడా ఆస్ట్రేలియాలో ఈ వ్యాధి బారినపడ్డారు. దేశ జనాభాలో దాదాపు 70శాతంమందికి కరోనా అంటుకునే ప్రమాదం వున్నదని జర్మనీ చాన్సలర్ ఏంజెలా మెర్కెల్ ప్రకటించడమే కాదు... ఇప్పటికైతే దానికి ఎలాంటి చికిత్స లేదు గనుక వ్యాప్తిని అరికట్టడమే తక్షణ కర్తవ్యమని తెలిపారు. లౌక్యం లేకుండా దేన్నయినా నేరుగా చెప్పడం జర్మనీ అలవాటు.

ఈ వ్యాధితో సతమతమవుతున్న దేశాలు, అవి తీసుకుంటున్న చర్యలు గమనిస్తే చాలా గుణపాఠాలు నేర్చుకోవచ్చు. మొదట్లో కాస్తంత నిర్లిప్త ధోరణిని ప్రదర్శించినా, ఒకసారి మేల్కొన్నాక బహుముఖ యుద్ధం ప్రకటించిన చైనా దాదాపు రెండునెలలు గడిచాక దాని వ్యాప్తిని చాలా పరిమితం చేయగలిగింది. ఏకస్వామ్య పాలనవున్న దేశం గనుక అది సాధ్యమైంది. ఆ స్థాయిలో కఠినంగా వ్యవహరించడం అన్నిచోట్లా సాధ్యమయ్యేది కాదు. వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో ఇటలీ నెమ్మదిగా అడుగులేసింది. గుర్తించిన తర్వాత కూడా కరోనా తీవ్రతను ఎదుర్కొనడంలో అవసర మైనంత శ్రద్ధ పెట్టలేదు. కనుకనే ఫిబ్రవరి మొదటివారంలో 600 వరకూ ఉన్న కేసులు కాస్తా నెల్లాళ్ల గడిచేసరికి 10,000 దాటాయి. ఇప్పుడైతే అత్యవసరమనుకున్న పనుల కోసం తప్ప ఎవరూ ఇళ్లూ వాకిళ్లూ దాటొద్దని కట్టడి విధిస్తోంది. రెస్టరెంట్లు, కెఫేలు, దుకాణాలు మూసేయమని హుకుం జారీ చేసింది. దాదాపు బయటపడుతున్న కేసులన్నీ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా వున్న ప్రాంతాలనుంచి బయటకు వెళ్తున్నవారి వల్లనేనని రుజువైంది. కనుక తప్పనిసరైతే విదేశాలకెళ్లాలని చెప్పడం, వేరే దేశాలవారిని రానీయకుండా ఆంక్షలు విధించడం మొదలైంది. అన్ని రకాల క్రీడా పోటీలు నిలిచి పోయాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇవన్నీ అవసరం. మన దేశం వచ్చే నెల 15 వరకూ వీసాల జారీ నిలిపేస్తున్నట్టు చెప్పడం, సభలూ, సమావేశాలు జరపొద్దని సూచించడం, ఢిల్లీలో పాఠశాలలు, కళా శాలలు, సినిమా థియేటర్లు ఈ నెలాఖరు వరకూ మూసివేస్తున్నట్టు చెప్పడం ఈ ముందు జాగ్రత్త చర్యల్లో భాగమే. దేశంలో బయటపడిన 74 కేసుల్లో 17 మన దేశానికొచ్చిన విదేశీ పౌరులవి కావడం, ఇక్కడ వ్యాధి లక్షణాలు బయటపడ్డవారు కూడా వ్యాధి తీవ్రత ఉన్న దేశాలనుంచి రావడం చూస్తే దీని అవసరమేమిటో తెలుస్తుంది. న్యూయార్క్‌లో వ్యాధి విస్తరణ వేగంగా వున్నదని గుర్తించాక అమెరికా సైతం ఈ మాదిరి చర్యలే ప్రకటించింది. యూరప్ దేశాల నుంచి రాకపోకల కారణంగానే న్యూయార్క్‌లో అధికంగా వైరస్ వ్యాపిస్తోందని గమనించడంతో యూరప్‌నుంచి వచ్చేవారిపై ఆంక్షలు విధించింది. ఐక్యరాజ్యసమితి తన ప్రధాన కార్యాలయాన్ని మూసేస్తున్నట్టు, వేరే దేశాలకు ప్రతినిధి బృందాలను పంపడం నిలిపేస్తున్నట్టు ప్రకటించింది. హార్వర్డ్ యూనివర్సిటీ తరగతి గదుల్లో కాక ఆన్‌లైన్‌లో పాఠాలు చెబుతోంది. ఆ దేశంలోని చాలా రాష్ట్రాలు పాఠశాలలకు సెలవులు ప్రకటించాయి. వేయిమందికి మించి పాల్గొనే సభలూ, సమావేశాలను రద్దు చేశారు.

అయితే వ్యాధి వ్యాప్తిని నియంత్రించడానికి తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడం, రోగగ్రస్తులుగా అనుమానం వచ్చినవారిని పరీక్షించేందుకు అవ సరమైన కిట్లు అందుబాటులో వుంచడం ఈ వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో కీలకపాత్ర పోషిస్తాయి. సూక్ష్మంలో మోక్షమన్నట్టు కొన్ని చిట్కాలతో అంతా సర్దుకుంటుందన్న భ్రమల్లోకి ఎవరూ జారకుండా చూడాలి. అదే సమయంలో అనవసర భయాందోళనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.చవితి ప.2.39 వరకు, తదుపరి పంచమి నక్షత్రం స్వాతి రా.7.40 వరకు, తదుపరి విశాఖ, వర్జ్యం రా.12.56 నుంచి 2.28 వరకు, దుర్ముహూర్తం ఉ.8.31 నుంచి 9.21 వరకు తదుపరి ప.12.31 నుంచి 1.21 వరకు, అమృతఘడియలు...ఉ.11.24 నుంచి 12.34 వరకు.

**సూర్యోదయం :** 6.14
**సూర్యాస్తమయం:** 6.05
**రాహుకాలం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

# ఈ సంఘర్షణ ఇంకెంతకాలం?

**భారతదేశంపై దండయాత్రలు చేసి, ఆక్రమించుకున్న ముస్లిం పాలకుల మీద ప్రజల్లో ఉన్న ద్వేష భావాన్ని ప్రస్తుతం ఇక్కడ ఉన్న ముస్లింల మీదికి మళ్లించడం హానికరం. దేశంలో ఉన్న కులాల అంతరాలను ప్రశ్నించకుండా కృత్రిమ ఐక్యతను ప్రదర్శించడం నిష్ప్రయోజనకరం. ముందుగా మనం మన ఇల్లును, మన ప్రజలను ఏకం చేయడానికి పూనుకోకుండా విద్వేషాన్ని ముందుకు తీసుకొస్తే అది ప్రజల మధ్య వైరాలను పెంచే, ఒక ఎడతెగని సంఘర్షణకు దారితీస్తుంది.**



మల్లెపల్లి లక్ష్మయ్య

''దేశ్‌కో గద్దరోంకో గోలీమారో సాలోంకో'' తెల్లని టీషర్టు, తలకు ఆరెంజ్ రిబ్బన్‌లతో నేటితరం, మనమంతా ఆశలు పెట్టుకున్న మన భావితరమైన యువ తరం ఓ ఉన్మాదావస్థలో పెట్టిన వెర్రికేకలవి. రెండు వారాలక్రితం ఢిల్లీలోని రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్‌లో చేసిన ఈ విద్వేషపూరిత నినాదాల వీడియో సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. ఈశాన్య ఢిల్లీలో మతకలహాల పేరుతో జరిగిన మారణహోమం మిగిల్చిన విషాదం అంతం కాకముందే మళ్ళీ అదే ద్వేషం ఈ యువతరంలో కనిపించి, మనసున్న ప్రతివారినీ కలవరపరిచింది. గతంలో దేశ మంతా అనేక చోట్ల మతకలహాలు జరిగినప్పటికీ, ఢిల్లీలో మాత్రం ఇంతవరకు హిందూ ముస్లిం ఘర్షణలు లేవు. కానీ ఈసారి జరిగిన అమానుషమైన దాడులు ఢిల్లీ జనసహనాన్ని కూడా పరీక్షించాయి. ఈ విధ్వంసంలో 42 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. 200 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. అనేక దుకాణాలు, ఇండ్లు, పాఠశా లలు, వాహనాలు ధ్వంసమయ్యాయి. ఒక మసీదు కూడా ఈ విద్వే షాగ్ని జ్వాలలకు కాలిబూడిదైపోయిందని వార్తలొచ్చాయి. వారం రోజుల పాటు ఢిల్లీని ఒక ఉన్మాదంలోకి నడిపించినవారెవ్వరో? అసలా మారణహోమానికి బాధ్యులెవ్వరో తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఎందుకంటే ఏ ప్రాంతంలోనైతే దాడులు జరిగాయో, ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలెవ్వరూ అందులో భాగం కాలేదు. పైగా ఒక వర్గం వారిని మరొక వర్గం రక్షించేందుకు యత్నించారు. వీలున్న ప్రతి ఇంటా మతాతీతంగా ఆశ్రయం పొందారు. ఇరు వర్గాల వారు ఉమ్మ డిగా తమను తాము రక్షించుకోవడానికి పరస్పరం సహకరించు కున్నారు.

ఒక సంఘటన కాదు. అనేకానేక సంఘటనలు ప్రజల మధ్య వైషమ్యాలు లేవన్న విషయాన్ని తేల్చి చెపుతున్నాయి. మానవ సంబంధాలు చెక్కుచెదర్లేదని రుజువుచేస్తున్నాయి. ఢిల్లీలో ఆ రాత్రి ఓ ఇంట్లో ఒంటరిగా మిగిలిపోయిన వృద్ధమాతను రక్షించమని ఆమె బిడ్డలు అమెరికానుంచి ఫోన్‌చేస్తే, ప్రాణాలకు తెగించి ఆమెను రక్షించింది ఎవరో కాదు. ఒక ముస్లిం. అప్పటికే కుదిరిన ఓ హిందువు వివాహాన్ని ముస్లింలంతా అండగా ఉండి జరిపించిన ఘటన స్థానికుల మధ్య సత్సంబంధాలకు ప్రత్యక్ష సాక్ష్యం. మత సామరస్యానికి మంచి ఉదాహరణ. సీలంపూర్‌లోని ముస్లింలను కాపాడడానికి అక్కడి దళి తులు ఆ ప్రాంతంలోకి గూండాలు, రౌడీలు ఎవ్వరూ రాకుండా బ్యారి కేడ్లు కట్టి రక్షణగా నిలిచారు. రమేష్ పార్క్ ప్రాంతంలోని హిందు వులు, సిక్కులు ఆ ప్రాంతంలోని ముస్లిం సోదరుల దగ్గరికి వెళ్లి అండగా ఉండడం మరపురాని జ్ఞాపకం. మంజూపూర్ బజరంగబలి మొహల్లాలో బజరంగబలి దేవాలయంలో ముస్లింలకు ఆశ్రయం కల్పించిన హిందువులు తమ సోదరభావాన్ని చాటుకున్నారు. ఇవి మచ్చుకు మాత్రమే. ఇంకా ఎన్నో చోట్ల, ఎంతోమంది, మతాల కతీతంగా ఒకరికొకరు రక్షణగా ఉండి మానవత్వం ఇంకా మిగిలేవుం దని నిరూపించిన సందర్భాలెన్నో. లేకుంటే ఢిల్లీ మత ఘర్షణల్లో మర ణాల సంఖ్య మరింత పెరిగేదన్నది సత్యం.

మన దేశంలో ఉన్న 20 కోట్ల మంది ముస్లింలు పరాయిదేశం వాళ్ళేననే ప్రచారం ముమ్మరంగా సాగుతున్నది. భారతదేశం మీద దండయాత్రలు చేసి, ఆక్రమించుకున్న ముస్లిం పాలకుల మీద ఉన్న వ్యతిరేకతను, కోపాన్నీ, ద్వేషభావాన్నీ ప్రస్తుతం ఇక్కడ ఉన్న ముస్లింల మీదికి మళ్లిస్తున్నారు. దానితో కొంత మంది రాజకీయ లబ్ధిని పొందాలని చూస్తున్నారు. మరికొంతమంది హిందూ మతంలో ఉన్న కులాల అంతరాలను ప్రశ్నించకుండా ముస్లిం బూచితో కృత్రిమ ఐక్యతను ప్రదర్శిస్తున్నారు.

**కొత్త కోణం**



చరిత్ర క్రమాన్ని పరిశీలిస్తే, ప్రస్తుతం మన దేశంలోనూ మన ఇరుగు పొరుగున ఉన్న ముస్లింలు మన ఆత్మబంధువులేనన్నది సత్యం. భారతదేశంలోని ప్రజలు ఇస్లాంలోకి మారడం మహమ్మద్ ప్రవక్త పుట్టకముందు నుంచే అరబ్బు ప్రాంతంలో మొదలైందని చరిత్ర కారులు చెబుతున్నారు. క్రీస్తు పూర్వం నుంచే భారతదేశానికి అరబ్బు దేశాలతో వ్యాపార, వాణిజ్య సంబంధాలుండేవి. చరిత్రకు అందిన సమాచారం ప్రకారం, మొదటగా ఇస్లాంలోకి మారింది కేరళలోని మప్పిలా సామాజిక వర్గం. మలబార్ ప్రాంతంలో విరివిగా లభించే సుగంధ ద్రవ్యాలు, అంటే మసాలాల వ్యాపారం అరబ్బులను విపరీతంగా ఆకర్షించింది. మహమ్మద్ ప్రవక్త ఇస్లాంకు ఒక దశ, దిశను అందించిన తర్వాత కేరళలో కులవివక్షకు గురవుతున్న అంటరాని కులాలు ఇస్లాంలోకి మారాయి. అందుకే దేశంలో ఎస్సీల సగటు జనాభా 16 శాతం ఉంటే, కేరళలో ఎస్సీల జనాభా కేవలం 9 శాతంగా ఉంది. దానర్థం చాలా మంది ఇస్లాంలోకి, క్రైస్తవంలోకి మారిపో యారు. ఇంకా కర్ణాటక, బెంగాల్ వంటి పలుప్రాంతాల్లోనూ అంట రాని కులాల ప్రజలు అవమానాలనుంచి తప్పించుకోవడానికి ఇస్లాం లోకి మారారు. మన హైదరాబాద్‌లో 1921 నుంచి 1941 మధ్యలో కూడా వేలాది మంది అంటరాని వారు, ముఖ్యంగా మాలలు హైద రాబాద్‌లో ఇస్లాంను స్వీకరించినట్టు జనాభా లెక్కలు తెలియ జేస్తు న్నాయి. 1911లో 11,37,589 మంది ఉన్న మాలలు, మహార్‌లు 1931కి వచ్చేసరికి 10,76,539కి తగ్గిపోయారు. అంటే 61,050 సంఖ్య తక్కువైనట్టు లెక్కలు చెబుతున్నాయి. చెప్పుకుంటూ పోతే ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు.

దీనికన్నా ముందుగా ఒక ముఖ్యమైన విషయాన్ని ప్రస్తావించాలి. భారతదేశం అనే భావన నిజానికి ఆధునికమైంది. కానీ ఒకానొక కాలంలో ముఖ్యంగా మౌర్యుల కాలంలో ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్ నుంచి బర్మా దాకా ఒక రాజ్యం కింద పాలన సాగింది. చక్రవర్తి అనే పదం అప్పుడే వచ్చింది. చంద్రగుప్త మౌర్యుని నుంచి అశోక చక్రవర్తి దాకా ఇది మరింత విస్తరించింది. ఈ రాజ్యంలో ప్రధానంగా బౌద్ధం, జైనం, వేదాలను అనుసరించే సనాతన ధర్మం ఉండేది. దానినే మనం ఇప్పుడు హిందూ మతం అంటున్నాం. అశోకుడి మనవడు బృహద్ర థుడిని చంపి, బ్రాహ్మణ రాజు పుష్యమిత్ర శుంగురుడు పాలన చేపట్టిన తర్వాత బౌద్ధం మీద దాడులు పెరిగాయి. క్రీ.శ.7వ శతాబ్దం తర్వాత మరింతగా బౌద్ధులను ఊచకోత కోశారు. సరిగ్గా ఇదే సమ యంలో ఇస్లాం దండయాత్రలు జరిగాయి. వాళ్ళు కూడా హిందూ దేవాలయాలతో పాటు, బౌద్ధారామాలను ధ్వంసం చేశారు. నలందా విశ్వవిద్యాలయం భస్మీపటలం అందులో భాగమే. ఒకవైపు హిందు వులు, రెండోవైపు ముస్లింల దాడులు బౌద్ధులను నిస్సహాయులను చేశాయి. ఆఫ్ఘనిస్తాన్, నేటి పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు ఆనాడు సంపూర్ణ బౌద్ధ దేశాలు. ముస్లింల దండయాత్రలకు, హిందువుల అవమానా లకు పరిష్కారంగా ఇస్లాంలోకి మారిపోయారు. వివక్షను పాటిస్తున్న, కులవ్యవస్థను అనుసరిస్తున్న హిందూమతం కన్నా, అల్లా ముందు రాజూ పేదా సమానమనే భావనను ప్రచారం చేసిన ఇస్లాంలోకి బౌద్ధులు మారిపోయారు. బౌద్ధానికి ఇస్లాం దగ్గరగా ఉందని ఆనాడు బౌద్ధులు భావించారు. అందుకే ఆనాడు బౌద్ధ దేశా లన్నీ కాశ్మీర్‌తో సహా ఇస్లాం ప్రాంతాలుగా మారిపోయాయి.

ఇంత వివరణ ఎందుకు అవసరమైందంటే ఇక్కడ ప్రస్తుతం ఉన్న ముస్లిం సోదరులందరూ, మన బౌద్ధులు, హిందువుల్లోని అంటరాని కులాలేనన్నది చెప్పడానికే. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను, హిందూ ధర్మాన్ని రక్షించడానికి అనే సాకుతో వీరంతా ముస్లింలుగా ముద్రపడి ఈ రోజు నీకు టెర్రరిస్టులుగా కనపడుతున్నారు. హిందూ మతం ఏనాడూ అక్కున చేర్చుకోకపోగా వేరే మతంలోకి వెళ్ళిన నీ మతస్తులపైనే పగతీర్చుకోవడం వివేకం అనిపించుకోదు. ఇస్లాంలోకి, క్రైస్తవంలోకి మారుతూండడానికి కారణాలు తెలుసుకోకుండా అందుకు కారణమైన కుల వ్యవస్థను నిర్మూలించకుండా, ఇతరులను నిందించినా, ద్వేషించినా ప్రయోజనం శూన్యమే. ఒకవేళ పాకిస్తాన్, బంగ్లాదేశ్ లాగా హిందువులందర్నీ ముస్లింలలాగే మారుస్తున్నట్టు, మనం ముస్లింలను హిందువులుగా మార్చాలని చూస్తే ఎలా సాధ్య మవుతుంది? ఇస్లాం నుంచి హిందూ మతంలోకి వచ్చినవారిని ఏ కులంలో చేరుస్తాం. ఎందుకంటే హిందూమతమంటేనే కులాలు. ఇది ఒక సమూహం మాత్రమే కాదు. అనేక కులాల సంఘటన. ఇది ఐక్య సంఘటన కూడా కాదు. దేనికదే ఒక సంఘటన. ముందుగా మనం మన ఇల్లును, మన ప్రజలను ఏకం చేయడానికి మన దగ్గర ఉన్న ప్రణాళిక ఏమిటో చెప్పాలి. అప్పుడే ఏ మతమైనా, ఏ ధర్మమైనా రక్షిం పబడుతుంది. లేనట్లయితే ఇది ప్రజల మధ్య వైరాలను పెంచే, ఒక ఎడతెగని సంఘర్షణకు దారితీస్తుంది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్ : 81063 22077

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**



## సోషల్ మీడియా

### మహమ్మారి



"ప్రపంచ ఆరోగ్య సంస్థ కరోనాను మహమ్మారిగా ప్రకటించింది. గతంలో భారత్‌లో విస్తరించిన మహమ్మారి ఇన్‌ఫ్లూయెంజా లేదా స్పానిష్ ఫ్లూ సుమారు 1.5 కోట్లమందిని అంటే జనాభాలో 6 శాతం మందిని బలితీసుకున్నట్టు చరిత్ర చెబుతోంది. 1918–19 ప్రాంతంలో వ్యాపించిన దీన్ని మొదట సాధారణ జ్వరంగా భావించారు. నెల రోజుల్లో అది తీవ్రరూపం దాల్చింది. ప్రజలు అప్రమత్తమయ్యేలోపు ఆరు నెలల్లో 60 లక్షలమందిని బలితీసుకున్నట్టు అప్పటి దినపత్రికలను చూస్తే అర్థమవుతుంది"

– చిన్మయ్ తుంబే, రచయిత

### అభినందన



"అభినందించాల్సినవారిని అభినందించాల్సిందే. కరోనా వైరస్ విషయంలో భారత్ దాదాపు అన్ని దేశాలకంటే చురుకుగా, కఠినంగా వ్యవహరిస్తోంది. కరోనాను సరైన రీతిలో, సమర్థవంతంగా ఎదుర్కొంటోంది. ఇతర దేశాల విమానాశ్రయాలతో పోలిస్తే మన విమానాశ్రయాల్లో తగిన సదుపాయాలన్నీ ఉన్నాయి. ప్రధాని నరేంద్ర మోదీకి అభినం దనలు"

– సుహేల్ సేథ్, కాలమిస్టు

### జర్నో



"నువ్వొక జర్నలిస్టువైతే.. కేవలం ట్విట్టర్ జర్నలిస్టు గానో, ట్విట్టర్ జ్ఞానిగానో ఉండిపోకు. ఏదో ఒక పక్షానికి కొమ్ముకాసి, ఒకవైపు వారి తరఫున పోరాడుతూ, అవతలివారినందరినీ తూల నాడకు. అది రాజకీయ నాయకుల పనికానీ, జర్నలిస్టుల పని కాదు. అది కూడా నువ్వొక జర్న లిస్టుననుకుంటేనే ఆలోచించు. నేను ఇది ఎవ రిని ఉద్దేశించి అన్నానో వారికి తెలుస్తుంది"

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

### ఇంటర్నెట్



"మహమ్మారి వ్యాపించినప్పుడు అన్ని వ్యవహారాలు ఆటంకం లేకుండా సాగాలంటే ఇంటర్నెట్ చాలా కీలకం. ఆ సదుపాయం నిరాటంకంగా అందించడానికి సర్వీస్ ప్రొవైడర్లతో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి చర్చలు జరుపుతున్నారు. డిమాండ్‌కు తగినట్టుగా నెట్‌వర్క్ సామర్థ్యాన్ని 30 నుంచి 40శాతం వరకు పెంచగలమని ప్రొవైడర్లు చెబుతున్నారు"

– పినరయి విజయన్, కేరళ సీఎం

### జోక్



"ఫ్రెంచ్ బాస్కెట్ బాల్ ఆటగాడు రూడీ గోబెర్ట్ విలేకరుల సమావే శంలో అన్ని మైకులను ముట్టుకుని, అందరినీ అనారోగ్యంపాలు చేస్తానని జోక్ చేసిన రెండు రోజులకు అతడికి చేసిన పరీక్షల్లో కరోనా వైరస్ సోకినట్లు వెల్లడయ్యింది. దాంతో 2019–20 సీజన్‌ను రద్దు చేస్తున్నట్టు ఎన్‌బిఏ ప్రకటించింది. ఈ ఉపద్రవాన్ని ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. ఇప్పుడు మనం అన్నిటినీ రద్దు చేసుకోవాల్సి వచ్చింది"

– ఆడమ్ గ్రీన్ బెర్గ్ ఫైర్ పీచ్, పర్యావరణ కార్యకర్త

### గుడ్



"ఒకవేళ ప్రియాంక చతుర్వేది కాంగ్రెస్ పార్టీ లోనే ఉండి వుంటే పప్పు సంరక్షకురాలిగా వ్యవహరిస్తూ, ఆయన తప్పులను దిద్దుతూ కూర్చోవాల్సి వచ్చేది. శివసేన ఆమెను రాజ్య సభకు పంపి మంచిపని చేసింది. అభినందనలు"

– షెఫాలీ వైద్య, రచయిత్రి

# మైనార్టీల రక్షణ ముసుగులో దాడులు

విశ్లేషణ



పురిఘళ్ల రఘురాం

దేశ రాజధాని ఢిల్లీలో చెలరేగిన హింస, అల్లర్లలో 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరం. ఈ హింసాత్మక ఘటనల్లో ఒక మతం వారిని, కేంద్ర ప్రభుత్వాన్ని.. ముఖ్యంగా హోం శాఖను అనుమానించేలా చాలామంది మాట్లాడుతున్నారు. వాస్తవానికి ఈ ఘర్ష ణల్లో మూడు మతాలకు చెందినవాళ్లు బాధితులయ్యారు. రెండు వర్గాల మధ్య అపోహలు సృష్టించి, అనుమానాలు రేకెత్తించి, సుహృద్భావ వాతావరణాన్ని చెడగొట్టారు. అల్లర్లకు, ఆస్తి నష్టానికి సంబం ధించి చట్టం తనపని తాను చేస్తుంది. పోలీసులు ఇప్పటికే కొందరు నిందితులను పట్టుకున్నారు. మరికొందరిపై కేసులు నమోదు చేశారు. విచారణ కొనసాగుతోంది. కానీ, అనుమానాలు రేకెత్తించి, అపోహలు సృష్టించిన వారి సంగతి ఏంటి?

గత కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టా నికి వ్యతిరేకంగా, వ్యతిరేక ప్రదర్శనలు చేస్తున్నారు. అసదుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ నాయకులు దేశవ్యాప్తంగా సీఏఏ నిరసన కార్యక్ర మాలకు హాజరై ప్రజల్ని రెచ్చగొడుతున్నారు. ప్రతి ఒక్కరిచేతా జాతీయ జెండా పట్టించి, రాజ్యాంగ పీఠికను చదివిస్తూ, అంబే డ్కర్ ఫొటోలను ప్రదర్శిస్తూ పైకి చాలా పద్ధతిగల వ్యక్తిలాగా కని పించాలని ప్రయత్నించారు. కానీ, ఆయన పార్టీ నాయకుడైన వారిస్ పఠాన్ మాత్రం ఫిబ్రవరి 16వ తేదీన '(సీఏఏ వ్యతిరేక ప్రదర్శనల్లో) మహిళల్ని ముందుపెట్టామని అంటున్నారు. ఆడ సింహాలు బయటికొస్తేనే చెమటలు కక్కుతున్నారు. ఇక మన మంతా బయటికొస్తే ఏం జరుగుతుందో మీరు అర్థం చేసుకోగ లరు. 100 కోట్ల మంది (హిందువుల) కంటే 15 కోట్ల మంది (ముస్లింలు) శక్తివంతులు. దీన్ని గుర్తు పెట్టుకోండి' అని అసదు ద్దీన్ సమక్షంలోనే రెచ్చగొట్టారు.

ఒకప్పుడు మహారాష్ట్ర ఎమ్మెల్యేగా ఉన్న వారిస్ పఠాన్ అసెంబ్లీ సాక్షిగా 'భారత్ మాతాకీ జై' అని నినదించనని చెప్పి సస్పెండ్ అయ్యారు. అంతటి ఘన చరిత్ర కలిగిన ఆయన తన సమక్షంలో బహిరంగ సభలో, మీడియా ముందు హిందువులను రెచ్చగొట్టేలా, ముస్లింలను హింసవైపు ప్రేరేపించేలా మాట్లాడితే అసదుద్దీన్ ఏం చేశారు? దేశానికి వ్యతిరేకంగా, చట్టానికి వ్యతిరే కంగా ఏ ఒక్కరు ప్రవర్తించినా వాళ్ల ముస్లిం వ్యతిరేకులేనని చెప్పిన ఒవైసీ వారిస్, పఠాన్ విషయంలో మౌనంగా ఉన్నారెం దుకు? హిందువుల్ని హీనంగా చిత్రీకరిస్తూ వ్యాఖ్యలు చేయడం ఆ పార్టీ నాయకులకు కొత్తేమీ కాదు. ఇలా ఎదుటివారిని తక్కువ చేయమని ఏ మతమూ చెప్పదు. తన మతం గురించి గొప్పలు చెప్పుకోవడం ఏమాత్రం తప్పు కాదు. కానీ, ఎదుటివారి మతాన్ని కించపర్చడం మాత్రం క్షమార్హం కాదు.

అయితే, వారిస్ పఠాన్ మాత్రం ఒక విషయాన్ని బహిరం గంగా ఒప్పుకున్నారు. అదేంటంటే.. మహిళల్ని ముందుపెట్టి సీఏఏ నిరసన ప్రదర్శనలు చేయడం. దీనిని ఒక వ్యూహంగా దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ఫిబ్రవరి 22వ తేదీన కూడా ఈశాన్య ఢిల్లీలో వందలాది మంది ముస్లిం మహిళలు రోడ్లపైకి వచ్చారు. ఇది కూడా ఒక వ్యూహం ప్రకారమే జరిగింది. ఎందు కంటే మరో రెండు రోజుల్లో అమెరికా అధ్యక్షుడు ఢిల్లీ వస్తున్నా రని, ఆ సందర్భంగా సెక్యూరిటీ ఎక్కువగా ఉంటుందని, పోలీ సులు, కేంద్ర ప్రభుత్వం దృష్టి మొత్తం ఆ పర్యటన సజావుగా జరిగేలా చూడటంపైనే ఉంటుందని అందరికీ తెలుసు. మీడియా కవరేజీ కూడా ఈ విషయాలపైనే ఎక్కువగా ఉంది. దీంతో రోడ్ల పైకి వచ్చిన ఈ ముస్లిం మహిళలంతా జఫ్రాబాద్ మెట్రో స్టేషన్ సమీపంలో ఏకమై సీలంపూర్, మౌజాపూర్, యమునా విహార్ లను కలిపే రోడ్లను దిగ్బంధించారు. సీఏఏను వెనక్కు తీసుకునే వరకూ తాము అక్కడినుంచి కదలబోమని మంకుపట్టుపట్టారు. అదే సమయంలో సీఏఏ అనుకూల ప్రదర్శనకారులపై కూడా రాళ్లదాడులు జరిగాయి. ఆ తర్వాత రాళ్లదాడులు కాస్తా పెట్రోలు బాంబులతో దాడులుగా మారాయి. అసలు అప్పటికప్పుడు వేలా దిమందికి రాళ్లు, పెట్రోలు బాంబులు ఎక్కడినుంచి వచ్చాయి? అన్నది ఇంకా తేలాల్సి ఉంది. అల్లర్లలో ఆమ్ ఆద్మీ పార్టీ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అమ నతుల్లా ఖాన్‌తో తాహిర్ హుస్సేన్ అల్లర్లకు ముందు మూడు రోజులపాటు జరిపిన మంతనాలు, అమనతుల్లా ఖాన్ ఆ మూడు రోజుల్లో ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో జరిపిన 18 ఫోన్ సంభాషణలు, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో జరిపిన 9 ఫోన్ సంభాషణలు ఏంటో కూడా తేలాల్సి ఉంది.

ఇప్పటికే పలుమార్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం శాఖ మంత్రి అమిత్ షా చెప్పినట్లుగా సీఏఏ వల్ల ఒక్కరి పౌరస త్వం కూడా పోదు. పొరుగుదేశాల్లో మతం పేరుతో ఇబ్బందులు పడుతున్న మైనార్టీలకు పౌరసత్వం ఇవ్వడానికే ఈ చట్టం తెచ్చారు తప్ప భారతదేశంలో ఎన్నో దశాబ్దాలుగా నివసిస్తున్న, సమాజంలో అంతర్భాగమైన ముస్లింలను వెళ్లగొట్టేందుకు కాదు. పార్లమెంటులో అన్ని పార్టీలూ సమగ్రమైన చర్చలు జరిపి, సెలక్ట్ కమిటీకి పంపించి, క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాత చేసిన చట్టమే పౌరసత్వ సవరణ చట్టం. ఇందులో ఎలాంటి తప్పులూ లేవు. దీన్ని అడ్డం పెట్టుకుని, అమాయకుల్ని మోసం చేసి రాజకీ యంగా లబ్ధిపొందాలని చూస్తున్న వారిపట్ల జాగ్రత్తగా ఉండండి.

ఎన్నో దశాబ్దాలుగా భారతదేశంలో నివసిస్తూ, సమాజంలో అంతర్భాగమైన ముస్లింలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి నష్టమూ జరగదు. కానీ, ముస్లింల పేరుతో దేశంలోకి చొరబడాలని చూసే అసాంఘిక శక్తు లకు, ముస్లింలను అడ్డుపెట్టుకుని రాజకీయాలను చేయాలను కునే పార్టీలకు, మైనార్టీల జపం చేసే సూడో సెక్యులరిస్టులకు మాత్రం మోదీ అంటే ఏమాత్రం గిట్టదు. అందుకే వాళ్ల అమాయ కులైన ప్రజల్ని రెచ్చగొట్టి, తమ పబ్బం గడుపుకుంటున్నారు. కానీ, అలాంటి వారు కూడా చట్టం ముందు చేతులుకట్టుకుని నిల బడే రోజు తప్పకుండా వస్తుంది.

వ్యాసకర్త బీజేపీ సమన్వయకర్త, అధికార ప్రతినిధి
ఈ–మెయిల్ : raghuram.bjp@gmail.com

# మైత్రీపురి పొత్తూరి

సందర్భం



మాడభూషి శ్రీధర్

ఆయన పేరు పొత్తూరి. మైత్రీపురి అని తన ఈమెయిల్ పేరు పెట్టుకు న్నారు. 86 సంవత్సరాల జీవన సంఘర్షణ తరువాత ప్రశాంతంగా మృత్యువు ఒడిలోకి ఒరిగి పోయారు. ఆధ్యాత్మిక జీవనం, తత్వం, భక్తి, వేదాంతం అలవ రుచుకుంటున్న రోజులలో ఆయ నను అన్యాయంగా క్యాన్సర్ రక్కసి ఆవరించింది. ఆ రాకాసితో ఓపికగా పోరాడి, ఆస్పత్రినుంచి విడుదలై నిజనివాసంలో స్వేచ్ఛావాయు వులు పీల్చుకుంటూ దోసపండువలె రాలిపోయారు. సమాజం కోసం పోరాడుతున్న నక్సలైట్లను ప్రధాన జీవనస్రవంతివైపు మళ్లించాలన్న తపన. వారికీ, ప్రభుత్వానికీ మధ్య సయోధ్య సాధించడానికి అకుంఠిత దీక్షతో కృషి చేశారు. ఇవన్నీ ఆయన వ్యక్తిత్వ లక్షణాలు.



1983–84లో ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వరంగల్ విలేకరిగా ఉన్నప్పుడు నాకు పొత్తూరితో సన్నిహిత పరిచయం. వరంగ ల్లులో సమాచార భారతి విలేకరిగా ఉన్న ప్పుడు నేను రాసిన వార్తలు, పరిశోధనా వ్యాసాలు ఆంధ్రప్రభలో వచ్చేవి. సంచలనం కలిగించే వార్తలు అనేకం వచ్చాయి. అవి కొన్ని సమస్యలు కూడా తెచ్చిపెట్టాయి. వాటిని చాలా హుందాగా ఎదుర్కొన్నారు. పొత్తూరి ఉదయం పత్రిక సంపాదకులుగా రావడంతో మళ్లీ ఆయనతో మాకు సన్ని హిత సంబంధాలు ఏర్పడ్డాయి. పత్రికా సంపాదకుడుగా, విమర్శకుడుగా, రచయితగా పొత్తూరి ఎప్పుడూ సంచల నాలను నమ్ముకోలేదు. జాగ్రత్తగా ఎవరినీ నొప్పించ కుండా రాయడం, నిర్మాణాత్మకమైన విమర్శలను చేయ డం, సున్నితంగా మందలించడమే గానీ పరుష పదజాలం వాడడం అవసరం లేదనే సౌమ్యుడైన పత్రికా రచయిత. ఒకసారి నేను, సాయిబాబా రాసిన పరిశోధనా వార్తను ఆయన చర్చించి ఆమోదించి ప్రచురించారు. తొలి ఎడిషన్ ప్రతులు జిల్లాల కోసం ట్రక్కులు ఎక్కించాక, రాత్రికి రాత్రి వాటిని వెనక్కు రప్పించి, ఆ వ్యాసం తొలగించి కొత్త పత్రి కలు ముద్రించి పంపారు. ఆ వార్త ఆగిపోవడం వెనుక కథ పొత్తూరికి తెలుసు. ఎవరితో ఘర్షణ పడకుండా మౌనంగా రాజీనామా చేశారు. ఇప్పటికీ ఆయన రాజీనామాకు మేమే పరోక్షంగా కారణమని బాధపడుతూనే ఉంటాం. పొత్తూరి వినియోగదారుల ఫోరంలో సామాజిక ప్రతినిధిగా, న్యాయమూర్తిగా హైకోర్టులో న్యాయపీఠం పైన కూర్చున్నారు. నన్నొకరోజు సహజ న్యాయ సూత్రాల గురించి అడిగారు. నేను చదివిం ది, నేను తరగతి గదిలో చెప్పేది నాకు తెలి సింది చెప్పాను. ఆయన నాకు చిన్న పరీక్ష పెట్టారనీ నేను అందులో ఉత్తీర్ణుడినైనాననీ నాకు ఆ తరువాత తెలిసింది.

పొత్తూరి ప్రెస్ అకాడమీ చైర్మన్ అయిన తరువాత పిలిచి, పత్రికా రచన, కోర్టు ధిక్కారం, పరువు నష్టంపైన పుస్తకం రాయమన్నారు. తను స్వయంగా చదివి న్యాయధిక్కారం అనే మాటపై విశ్లేషణ చేశారు. మా నాన్నగారు ఎంఎస్ ఆచార్య స్మారక ప్రసంగం 2017లో పొత్తూరి ఇచ్చారు. పొత్తూరి లేని లోటు తీరదు. తెలంగాణ తన శ్రేయోభిలాషిని, తెలుగు రాష్ట్రాలు ఉత్తమ పాత్రికేయుడిని, ఒక చింతనాపరుడిని కోల్పోయాయి.

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సంకల్పం

# లైసెన్స్ కోసం పోరాటం



● జిలిమోల్ మారియట్ థామస్

ఇరవై ఎనిమిదేళ్ల జిలిమోల్ మారియట్ థామస్.. కారు డ్రైవింగ్ లైసెన్సు కోసం వచ్చినప్పుడు ఆర్టీయే అధికారులు ''నీకు లైసెన్స్ ఇవ్వలేమమ్మా''అన్నారు.

''నాకు డ్రైవింగ్ వచ్చు సార్, కావాలంటే మీ కళ్ల ముందే కారు నడిపి చూపిస్తాను'' అంది జలిమోల్. చక్కగా డ్రైవ్ చేస్తే ఎవరికైనా లైసెన్స్ ఇచ్చి తీరవలసిందే కానీ, ఆమెకు ఇవ్వడానికి మాత్రం అధికారులు నిరాకరించారు. కారణం.. ఆమె చేతులతో కాకుండా కాళ్లతో కారు నడిపింది.

జిలిమోల్‌కు పుట్టుకతోనే రెండు చేతులు లేవు. చేతులు లేవన్నది అధికారుల అభ్యంతరం. ఇవ్వడానికి చట్టం ఒప్పుకోదు. ఏం చేయాలో తోచక ఆమె లైసెన్స్ విషయాన్ని అలా ఫైళ్లలో ఉంచేశారు.

థలిడోమైడ్ సిండ్రోమ్ అనే జన్యు అపసవ్యత కారణంగా రెండు చేతులూ లేకుండా పుట్టింది జిలిమోల్. తన పనులైనా తను చేసుకోలేదు. కానీ కాస్త వయసు రాగానే జిలిమోల్ సొంతంగా పనులు చేసుకోవడం నేర్చుకుంది. ఎవరిపైనా దేనికీ ఆధార పడకూడదు అని మనసులో గట్టిగా సంకల్పించుకున్నాక.. తనకు చేతులు లేవన్న భావను తుడిచిపెట్టేసింది. చురుగ్గా ఉండటం, చదువుల్లో రాణించడం ఆమెకు కష్టం కాలేదు కానీ.. ఆమెకు ఉన్న ఒక కోరిక తీరడానికి మాత్రం ఇంట్లోవాళ్లను ఆమె సంసిద్ధులను చెయ్యాల్సి వచ్చింది.

''కార్ డ్రైవింగ్ నేర్చుకుంటాను నాన్నా'' అంది ఓ రోజు. ఆ మాటకు తల్లిదండ్రులిద్దరూ సంశయంలో పడ్డారు. నాన్న థామస్ రైతు. అమ్మ అన్నాకుట్టి గృహిణి. ఆ వంశంలో డ్రైవింగ్ తెలిసినవాళ్లే లేరు. 'అది కాదు తల్లీ..' అనబోయారు కానీ, కూతురి పట్టుదల తెలిసి ఆమె ముచ్చట తీర్చారు. మారుతి సెలరో–ఆటోమేటిక్‌కి తనకు అనుకూలంగా మార్పులు చేయించుకుని (ఒక ఆర్టీయే అధికారి సూచనలతో) కాళ్లతో డ్రైవింగ్ నేర్చుకుంది జిలిమోల్. చాలా త్వరగా డ్రైవింగ్ వచ్చేసింది! అమ్మానాన్న, చుట్టుపక్కల వాళ్లు



● కారు నడుపుతున్న జిలిమోల్

ఆశ్చర్యపోయారు. ఎర్నాకులంలో వాళ్లుంటున్న నివాసం పక్కన వైఎంసిఎ కాంపౌండ్‌లో డ్రైవింగ్ నేర్చుకుంది జిలిమోల్. కాళ్లతో కారు డ్రైవ్ చేసుకుంటూ ధైర్యంగా ఎర్నాకులం రోడ్లన్నీ తిరిగేస్తోంది కూడా. కానీ, ఆమెకు లైసెన్స్ ఇచ్చే చొరవనే అధికారులు చూపించలేకపోతున్నారు. తనకు లైసెన్స్ ఇప్పించమని జిలిమోల్ 2018లో హైకోర్టుకు కూడా వెళ్లింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఓకే అంది. రాష్ట్ర ప్రభుత్వమే వెనకాడుతోంది. జిలిమోల్ మాత్రం లైసెన్స్ సాధించి తీరుతాను అంటోంది.

సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ

శుక్రవారం ॥ 13-3-2020



# ఈశాన్య దిక్కున విషగాలి పుట్టేను

**కరోనా ఎంత వేగంగా ప్రబలుతోందో కరోనాపై సోషల్ మీడియాలో పుట్టుకొస్తున్న 'కలుపు' అంతకన్నా వేగంగా పెరిగిపోతోంది. దాంతో.. నమ్మకమైన వార్తల కోసం ప్రపంచం ఇప్పుడు 'సోషల్'ని పక్కన పెట్టి తిరిగి సంప్రదాయ మీడియాను ఆశ్రయిస్తోంది.**

ఈశాన్య దిక్కున విష గాలి పుట్టేను
లక్షలాది ప్రజలు సచ్చేరయ
కోరంకియను జబ్బు కోటిమందికి తగిలి
కోడిలాగా తూగి సచ్చేరయ

బ్రహ్మంగారికి 'కాలజ్ఞానం' లోని 114వ పద్యం ఇది. ఈశాన్య దిక్కున అంటే చైనా! కోరంకి అంటే కరోనా!! మూడొందల ఏళ్ల క్రితమే కరోనా గురించి చెప్పిన బ్రహ్మంగారు, ఐదువేల ఏళ్ల వరకు మానవ జాతకం ఎలా ఉండబోతోందో కూడా అప్పుడే అంచనా వేసి చెప్పారు. ఆ చెప్పినవి 'మ్యాచ్' అయినప్పుడు ఆశ్చర్యంగానే ఉంటుంది.



● విజయ రాజే సింధియా (పాత ఫొటో)

కరోనా డిసెంబర్‌లో మొదలైంది. అప్పట్నుంచీ ఈ పద్యం సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంది. పద్యంలో బ్రహ్మంగారు వాడిన రెండు మాటలు 'ఈశాన్యం', 'కోరంకి' కరోనా వైరస్‌కు సరిగ్గా సరిపోయాయి. పద్యంలోనే 'కోటి మందికి తగిలి' అని మరో మాట ఉంది. కాలజ్ఞానాన్ని నమ్మేవారిని కలవరపెట్టే మాట ఇది. ఇప్పటికే లక్ష మందికి పైగా సోకిన కరోనా.. కోటికి చేరుకోదు కదా! ఆ కోటి మందిలో మనమో, మనవాళ్లో ఉండరు కదా! అదీ అనుమానం.

సోషల్ మీడియాను టైమ్‌పాస్‌కు తప్ప వేరే దేనికీ నమ్మని వాళ్లు బ్రహ్మంగారి పద్యాన్ని కూడా నమ్మరు. బ్రహ్మంగారిపై నమ్మకం లేకపోవడం కాదది. సోషల్ మీడియాను నమ్మలేకపోవడం. 'బ్రహ్మంగారు ఆనాడే చెప్పారు' అని పేపర్‌లు రాస్తే ఉండే నమ్మకం.. అదే వార్త సోషల్ మీడియాలో వస్తే ఉండదు. ఎవరికి ఇష్టం వచ్చింది వాళ్లు పెట్టేయడానికి అనువుగా 'నెట్' ఉండటంతో ఫేక్ న్యూస్‌లు ఎక్కువైపోయి క్రమంగా విశ్వసనీయతను కోల్పోతోంది సోషల్ మీడియా. అందుకే.. 'ఈశాన్యదిక్కున విష గాలి పుట్టేను..' అని వైరల్ అవుతున్న పద్యాన్ని చూడగానే.. నిజంగానే బ్రహ్మంగారు రాశారా, ఎవరైనా రాసి, పాతకాలపు అక్షరాల్లో చెక్కి బ్రహ్మంగారు పేరు పెట్టేశారా' అనే సందేహం వచ్చేస్తుంది.

●●●

కరోనా బయటి ప్రపంచంలో ఎంతగా ప్రబలుతోందో, సోషల్ మీడియా లోకంలో అంతకు మించి వ్యాప్తి చెందుతోంది. ఉదయాన్నే పేపర్‌లు చూసేవరకు ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని అయోమయ స్థితిలోకి వచ్చేశాం. ఫేస్‌బుక్‌లో, ట్విట్టర్‌లో, వాట్సాప్‌లో.. ప్రతిచోటా కరోనా చుట్టూ రకరకాల కథనాలు! కరోనా వైరస్‌ను చైనాలోని ఒక ల్యాబ్‌లో రహస్యంగా సృష్టించి ప్రపంచం మీదికి వదిలారని ఒక స్టోరీ! కరోనా వస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ ముందే ఊహించినా బయట పెట్టలేదని ఇంకో స్టోరీ! చైనాలో భాగం అయిన తైవాన్‌లో ఇప్పటికే లక్షల మంది కరోనా వైరస్‌తో చనిపోయారని (తైవాన్ జనాభా రెండున్నర కోట్లు), ఆ సంగతిని చైనా దాచి ఉంచిందని మరో స్టోరీ. కరోనా మహమ్మారిని నిద్ర లేపినందుకు చైనాకు వ్యతిరేకంగా ఇటలీ పౌరులంతా వీధుల్లోకి వచ్చి పెద్ద 'మార్చింగ్' చేశారని ఇంకో స్టోరీ. ఇవేవీ నిజం కాదు.

చైనా ఎందుకు కరోనాను సృష్టిస్తుంది? ప్రపంచంపై ఆధిపత్యానికట! బయో వెపన్స్ తయారు చేయబోయి, ఆ ప్రయోగం వికటించి కరోనా పుట్టుకొచ్చిందట! మరి కరోనా వ్యాప్తి వెనుక బిల్ గేట్స్ హస్తం ఎందుకు ఉంటుంది? మూడు నెలల క్రితమే కరోనా కాష్మోరాను పసిగట్టిన బిల్ గేట్స్ ఫౌండేషన్.. కరోనా వాక్సిన్‌ను కనిపెట్టడానికి ఒక సంస్థకు నిధులు ఇచ్చిందట. కరోనా వల్ల 6 కోట్ల 50 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉందని కూడా ఊహించిన ఫౌండేషన్ వాక్సిన్ పేటెంట్ తీసుకునే కంపెనీలకు లాభం కూర్చేందుకు వైపరీత్యాన్ని గోప్యంగా ఉంచిందట. అయితే, తైవాన్ ఎందుకు వైరస్ మరణాలను దాచి ఉంచుతుంది? చైనాకు తెలిస్తే మరణాలను తగ్గించే పేరుతో తైవాన్‌ను మొత్తం తన పరిధిలోకి తీసుకుంటుందట!

అర్థమే లేని ఈ చెత్తనంతా ఒకవైపు సోషల్ మీడియా సంస్థలు ఎప్పటికప్పుడు ఏరి పారేస్తూనే ఉన్నా, ఇంకో వైపు కొత్త చెత్త గుట్టలు గుట్టలు పేరుకుంటూనే ఉంది. ఈ గుట్టల్లో కరానోకు మెడిసిన్ కూడా ఉంటోంది! కరోనా సోకుండా వ్యాధి నిరోధకతను పెంచే లేహ్యాలు, ద్రవాలు, చూర్ణాలు సమాచారం వచ్చిపడుతోంది. 'మామూలు జలుబు, దగ్గులకే మాస్క్ చుట్టించి, కరోనా అని పేరు పెట్టించి ఔషధ ఉత్పత్తిదారులు బిజినెస్ చేస్తున్నారనే పోస్టులూ కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో కరోనా మొదలైనప్పటి నుంచి ఇంత వరకు 'కరోనా', 'కోవిడ్' అనే పేర్లతో 4 వేలకు పైగా వెబ్‌సైట్‌లు వెలసినట్లు గమనించిన 'చెక్ పాయింట్' అనే సైబర్ సెక్యూరిటీ సంస్థ.. వీటిల్లో మూడు శాతం సైట్‌లు తప్పుడు సమాచారంతో, ఐదు శాతం సైట్‌లు అనుమానించ దగిన విశేషాలతో ఉన్నట్లు కనిపెట్టింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా కరోనా ఎపిడెమిక్ (అంటువ్యాధి) తో సమాంతరంగా ఈ కరోనా 'ఇన్ఫోడెమిక్'ని తుద ముట్టించే చర్యలు చేపడుతోంది. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్ తదితర సంస్థలు ఎంత అప్రమత్తంగా ఉన్నప్పటికీ వీడియోలు, ఫొటోలు, పోస్ట్‌ల రూపంలోని ఈ అబద్ధపు సమాచారం దొంగ చాటుగా చొరబడుతూనే ఉన్న సంగతి 'న్యూయార్క్ టైమ్స్' పరిశోధనలో వెల్లడైంది. ఒక్క ఇంగ్లిష్ భాషలోనే కాదు, హిందీ, హీబ్రూ, ఫార్సీ భాషల్లోనూ అవాస్తవాల కరోనా ప్రపంచమంతటా ప్రబలుతోంది.

●●●

క్రిమి కన్నా వేగంగా వ్యాప్తి చెందుతుంది 'ఫేక్' క్రిమి. కాస్త భయం కల్పిస్తే, అనుమానం రేకెత్తిస్తే చాలు జనం నమ్మేస్తారు. విషయం వైరల్ అయిపోతుంది. మనిషి నుంచి మనిషికి అంటుకోడానికి క్రిమి కొంత సమయం తీసుకుంటుంది. ఫేక్ క్రిమికి అంత సమయం అక్కర్లేదు. పోస్ట్‌లుగా, షేర్‌లుగా, లైకులుగా, రీపోస్టులుగా క్షణాల్లో వ్యాపించేస్తుంది! 2018 ఆగస్టులో కేరళను ముంచేసిన వరదలనే చూడండి. ఎన్ని నకిలీ వార్తలు! 'ఒక వ్యక్తి లైఫ్ జాకెట్ వేసుకోవడానికి నిరాకరించాడు. దీనికి కారణం అది కాషాయ రంగులో ఉండడమే. కాషాయం హిందుత్వకు చిహ్నం కావడంతో బాధితుడు వేసుకోనని తేల్చి చెప్పాడు. చివరికి ప్రాణాలే పోగొట్టుకున్నాడు' అంటూ ఆనాటి వరదల్లో ఒక పోస్టు వైరల్ అయింది. ఆ ఘటనతో ముఖ్యమంత్రి పి.విజయన్ లైఫ్ జాకెట్లను కాషాయం రంగుకి బదులుగా ఆకుపచ్చ రంగులో తయారు చేయాలంటూ ఆదేశాలు కూడా జారీ చేశారని కూడా ఆ వార్తకు రంగు అద్దారు. జాతీయ మీడియా కూడా దానిని ప్రచురించింది. కానీ చివరికి అదీ తప్పుడు ప్రచారమే అని తేలింది.

ఇలాంటిదే మరొకటి. 'మరి కాసేపట్లో ముల్ల పెరియార్ డ్యామ్ కూలిపోతుంది. ఇప్పటికే ఆనకట్ట లీక్ అవుతోంది. డ్యామ్ కూలిపోవడం ఖాయం. ఎర్నాకుళం మునిగిపోతుంది. పీఎంవోలోని ఒక స్నేహితుడు నాకు ఈ విషయం స్వయంగా చెప్పాడు. ఆ డ్యామ్ పరిసర ప్రాంతాల్లో ఉన్నవారంతా సురక్షిత స్థావరాలకు వెళ్లిపోండి' అంటూ ఒక ఆడియో క్లిప్ వైరల్‌గా మారి ప్రజల్లో భయభ్రాంతుల్ని సృష్టించింది. చివరికి అది ఫేక్ అని, అలాంటి ప్రమాదమేమీ లేదని ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సి వచ్చింది.

●●●

వరదల్లాంటివి ఒక ప్రదేశానికో, ఒక దేశానికో పరిమితమైనవి. కరోనా ప్రపంచమంతటిదీ. ఐక్యరాజ్య సమితి కూడా చూసి చూసి ఇక తప్పదని మొన్ననే దీనినొక విశ్వ విపత్తుగా ప్రకటించింది. అంటే అలక్ష్యం చెయ్యొద్దని. ఎన్ని విశ్వ విపత్తులైనా ఎదుర్కొనే శక్తి మనిషికి ఉంది. మనిషి సృష్టిస్తున్న మాయలమారి ప్రచారాల అంటువ్యాధికి మందూ లేదు, దాన్ని తట్టుకునే శక్తి మానవాళికీ ఉండదు. పంటలోని కలుపులా ఎప్పటికప్పుడు 'ఫేక్' ఏరిపారేయడం ఒక్కటే ఇప్పటికైతే దారి.



## నా చేతుల్ని మిస్ అవుతున్నా



డొనాల్డ్ ట్రంప్ దేనినీ సీరియస్‌గా తీసుకోరు. కొరియా అధ్యక్షుడు కిమ్ అయినా ఒకటే, చైనా నుంచి వచ్చిన కరోనా అయినా ఒకటే ఆయనకు. స్వయంగా కరోనానే వచ్చి ఆయన ఎదురుగా నిల్చున్నా.. 'కొద్ది రోజులుగా నేను నా ముఖాన్ని చేతులతో తాకడం లేదు కదా. మరి నువ్వెందుకు వచ్చావ్. నేను నా చేతుల్ని ఎంత మిస్ అవుతున్నానో తెలుసా?' అనేస్తారు. ఈ మధ్య వైట్ హౌస్ సమావేశంలో కరోనా వైరస్ వైట్ హౌస్ కోఆర్డినేట్ మాట్లాడుతూ, తరచు చేతులు కడుక్కుంటూ ఉండాలనీ, చేతులతో ముఖాన్ని తాక కూడదనీ చెప్పినప్పుడు ట్రంప్ ఇదే మాట అన్నారు.. తన చేతుల్ని మిస్ అవుతున్నానని! కరోనా ప్రపంచమంతా తిరుగుతూ యు.ఎస్.లోకి అడుగుపెట్టినప్పుడు కూడా ట్రంప్ ఇలాగే అన్నారు. 'ఇదేం పెద్ద వ్యాధి కాదు. సీజనల్‌గా వచ్చిపోతుండే జబులు లాంటిదే'' అని. ప్రస్తుతం రెండోటర్మ్‌కి అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఉన్నారు ట్రంప్. ఈ టైమ్‌లో కరోనా వచ్చింది. నాయకుడు ఎవరైనా ప్రజలకు ధైర్యమే చెబుతాడు. అలాగే ట్రంప్ కూడా ప్రజలకు ధైర్యం చెప్పారు.. కరోనాకు భయపడే అవసరమే లేదని. దానిని పట్టుకుని ట్రంప్ మాటలకు వేరే పిక్చర్ ఇవ్వడం మొదలు పెట్టింది సోషల్ మీడియా. ట్రంప్‌ను మళ్లీ ఇంకోసారి గెలవనివ్వకుండా ఉండడం కోసం.. 'కరోనాపై ట్రంప్ ఏమాత్రం బాధ్యతలేకుండా ఉన్నాడు' అనే ఫేక్ న్యూస్‌ని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయిస్తున్నారు ఆయన ప్రత్యర్థులు.

తిరుగుబాటు

# నేడు మనవడు నాడు నానమ్మ

గ్వాలియర్ రాజ వంశ వారసుడు జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చి, బీజేపీలో చేరడంతో మధ్యప్రదేశ్ ప్రభుత్వం నేడు పడనా, రేపు పడనా అనే స్థితికి చేరుకుంది. 53 ఏళ్ల క్రితం 1967లో జ్యోతిరాదిత్య నానమ్మ విజయ రాజే సింధియా కూడా ఇలాగే కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చి, అప్పటి ప్రభుత్వాన్ని కూల్చేశారు. ఆ సందర్భం ఇప్పుడు మళ్లీ వార్తల్లోకి వచ్చింది. ఇప్పుడు జ్యోతిరాదిత్య పార్టీ నుంచి వెళ్లిపోవడంతో ప్రభుత్వం పడిపోయే దశకు చేరుకుంటే.. అప్పుడు విజయ రాజే.. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకే పార్టీ నుంచి వెళ్లిపోయారు. ఆమె వెళ్లగానే ఆమెతో పాటు 36 మంది ఎమ్మెల్యేలు బయటికి వచ్చేశారు. దాంతో ముఖ్యమంత్రి డి.పి. మిశ్రా ప్రభుత్వం కుప్పకూలిపోయింది. యువకుడైన జ్యోతిరాదిత్యను పక్కన పెట్టి వృద్ధ నేత కమలనాథ్‌ని సీఎంను చేసిన తప్పుకు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించుకోబోతోంది. అయితే విజయ రాజే సింధియా ఆనాడు పదవుల్ని ఆశించి పార్టీ నుంచి బయటికి వెళ్లిపోలేదు. ముఖ్యమంత్రి మిశ్రా తనను అతడి క్యాబిన్ బయట రెండు గంటల పాటు వేచి ఉండేలా చేయడంతో ఆమె తీవ్రమైన ఆగ్రహానికి గురయ్యారు. కేవలం ఆ ఒక్క కారణంగానే పార్టీని వీడి, మిశ్రా దురహంకారానికి తగిన శాస్తి చేశారు. బీజేపీ సహ వ్యవస్థాపకులలో ఒకరైన విజయ రాజే 2001లో తన 81 యేట ఢిల్లీలో కన్నుమూశారు.





● విజయ రాజే, జ్యోతిరాదిత్య సింధియా

అధ్యక్షురాలు

# ఎప్పటికీ కాలేరా!

మయన్మార్ నాయకురాలు, ప్రస్తుత స్టేట్ కౌన్సెలర్ (ప్రధాని పదవికి సమానమైన హోదా) ఆంగ్‌సాన్ సూకీని ఏనాటికీ దేశాధ్యక్షురాలు కానివ్వకుండా అక్కడి విపక్షాలు జాగ్రత్త పడుతున్నాయి. ఆమెకు దేశాధ్యక్షురాలు అయ్యే అవకాశాన్ని కల్పించడానికి ఉద్దేశించిన బుధవారం నాటి తాజా రాజ్యాంగ సవరణ బిల్లుకు సైతం మయన్మార్ పార్లమెంటులోని మెజారిటీ సభ్యుల ఆమోదం లభించలేదు.

మయన్మార్ స్వేచ్ఛకోసం బందీ అయిన యోధురాలు ఆంగ్ సాన్‌సూకీ. 1989 జూలై 20 నుంచి 2010 నవంబర్ 13 వరకు ఇరవయ్యొక్కేళ్ల కాలంలో మధ్య మధ్య స్వల్ప విరామాలతో దాదాపు 15 ఏళ్ల పాటు బర్మా సైనిక పాలకుల నిర్బంధంలో గడిపారు. నిర్బంధం నుంచి సూకీ విడుదలయ్యాక మయన్మార్‌లో జరిగిన ఒక కీలక పరిణామం... ఉప ఎన్నికలు. సూకీ విడుదలవడానికి సరిగ్గా ఆరు రోజుల ముందు 2010లో ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో తర్వాత్తర్వాత ఏర్పడ్డ ఖాళీల భర్తీకి ఈ ఉపఎన్నికలు అవసరమయ్యాయి. అప్పటి సార్వత్రిక ఎన్నికల్లో సూకీ పార్టీ 'నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ' (ఎన్.ఎల్.డి.) పాల్గొనేందుకు వీలు లేకపోవడంతో



● ఆంగ్ సాన్ సూకీ (74)

ఉప ఎన్నికలకు ఎన్.ఎల్.డి. సిద్ధమైంది. పార్టీ ప్రధాన కార్యదర్శి అయిన సూకీ... కాము టౌన్‌షిప్ నియోజకవర్గం నుంచి దిగువసభకు పోటీ చేశారు. అధికార 'యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ అభ్యర్థిపై మంచి మెజారిటీతో గెలిచారు. ఈ ఒక్క సీటే కాదు, ఖాళీ అయిన అన్ని సీట్లను దాదాపుగా ఎన్.ఎల్.డి.నే గెలుచుకుంది. ఉప ఎన్నికల ప్రచారంలో సూకీ ప్రధానంగా అవినీతి, నిరుద్యోగ నిర్మూలన అనే అంశాలపైనే దృష్టి సారించారు. అలాగే '2008 రాజ్యాంగం' లోని లోపాలను సవరించి, సంస్కరించడం ద్వారా మయన్మార్‌లో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు, స్వయం ప్రతిపత్తి గల న్యాయవ్యవస్థ ఏర్పాటుకు ఎన్.ఎల్.డి. కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. పర్యవసానమే సూకీ ఘన విజయం. ఫలితాలు వెల్లడవగానే ఐరోపా, ఆస్ట్రేలియా, ఉత్తరమెరికా, దక్షిణ మెరికా, ఇజ్రాయిల్, జపాన్, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియాల నుంచి సూకీకి అభినందలను వెల్లువెత్తాయి. ''మయన్మార్‌కి మంచి భవిష్యత్తు ఉంది. అది మీ వల్లే సాధ్యమౌతుంది'' కొందరు దేశాధినేతలు సూకీకి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. తిరిగి 2015 ఎన్నికల్లోనూ సూకీ ఘన విజయం సాధించారు. ఈ ఏడాది మళ్లీ ఎన్నికలు ఉన్నాయి. అయితే ఆంగ్‌సాన్ సూకీ ఎప్పటికీ అధ్యక్షురాలు కాకుండా ఉండడం కోసం 2008లో మయన్మార్ మిలటరీ ప్రభుత్వం ఒక రాజ్యాంగ సవరణ చేసింది. దాని ప్రకారం.. జీవిత భాగస్వామి గానీ, పిల్లలు గానీ విదేశీ పౌరులై ఉంటే ఆ వ్యక్తి మయన్మార్ అధ్యక్షులు అయ్యేందుకు లేదు. సూకీ ఇప్పుడు అధ్యక్షురాలు అవాలంటే ఆ క్లాజును రద్దు చేస్తూ రాజ్యాంగ సవరణ తేవాలి. ఆ సవరణ తెచ్చేందుకే బుధవారం పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెడితే.. రెండింట మూడొంతుల మద్దతు లభించక అదే ఆమోదం పొందలేదు. సూకీ భర్త, ఇద్దరు కొడుకులు బ్రిటన్ జాతీయులు. ఆమె భర్త 1999లో చనిపోయారు.

చెట్టు నీడ

# కాల ప్రవాహం

జాలరి చేపలు పట్టడానికని పడవ సిద్ధం చేశాడు. తను కూడా వేటకు వస్తానని పట్టణంలో చదువుతున్న జాలరి పెద్ద కొడుకు పడవెక్కాడు. నదిలో పడవ వేగంగా వెళ్తోంది.

కొద్ది దూరం వెళ్ళాక కొడుకు ''అన్నిటికన్నా విలువైనది ఏది నాన్నా'' అని అడిగాడు. జాలరి చిన్నగా నవ్వి తన జేబులోని చిన్న కాగితాన్ని ఇచ్చి కాగితం పడవ చేసి నదిలో వదలమన్నాడు. పడవ నదీప్రవాహంలో అటూ ఇటూ ఊగుతూ కొట్టుకుపోతూ వుంది. వెళ్తున్న పడవను చూపిస్తూ జాలరి, ''జీవితం కాగితం పడవ లాంటిది. కాలం నదీప్రవాహం లాంటిది. ప్రవాహం ఎలా వెళితే పడవ కూడా అలాగే వెళుతుంది. పడవ ప్రయాణం నీటి ప్రవాహం మీద ఆధార పడి వుంది. జీవితం కూడా అంతే. పుట్టినప్పుడు గాలి పీల్చడం ప్రారంభించి మరణించేటప్పుడు గాలి వదిలే మధ్య కాలమే కదా జీవితం. కాలం ఎలా నడిపిస్తుందో జీవితం కూడా అలాగే నడుస్తుంది. అప్పుడప్పుడూ పడవ ఎగిరెగిరి పడుతోంది చూశావా, కాలం కలిసి వస్తే అంతా మన ప్రతిభ వల్లే జరిగిందని ఊరేగుతాం. పడవ ఎగిరేది నీటి ప్రవాహం వల్లనే అని పడవ గుర్తించదు. తన గొప్పవల్లనే ఇది సాధ్యమవుతోందని భావిస్తుంది. అన్నీ అనుకూలంగా వున్నప్పుడు మనం కూడా కాల ప్రవాహన్ని మరుస్తాం'' అని చెబుతూ ఒక పుల్లను నదిలోకి విసిరాడు. పుల్ల కూడా నీటి అలలకు ఎగిరెగిరి పడుతూ కొట్టుకుపోతోంది. పుల్లను చూపిస్తూ ''నదీప్రవాహానికి పడవ అయినా ఒకటే, పుల్ల అయినా ఒకటే. నీటిపైన తేలియాడుతున్నంత సేపే పడవ వయ్యారం. నీరు లేకపోతే పడవ లేదు. ఎప్పటికైనా పడవ నీటిలో కలిసిపోయేదే. మనం కాల ప్రవాహంలో కొట్టుకుపోయే వాళ్లమే. కాబట్టి ఈ సృష్టిలో కాలానికి మించిన విలువైనదేదీ లేదు. కాలం అమూల్యమైనదని తెలుసుకో.'' అని హితవు చెప్పాడు తండ్రి. చదువురాని తండ్రి చెప్పిన జీవిత పాఠానికి కొడుకు ఆశ్చర్యపోయాడు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
శుక్రవారం ॥ 13-3-2020

# అల్లుడు అదుర్స్


• సాయి శ్రీనివాస్

'అల్లుడు శీను'తో కెరీర్ ప్రారంభించిన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన ఎనిమిదో సినిమా టైటిల్‌ను 'అల్లుడు అదుర్స్'గా ఖరారు చేశారు. నభా నటేశ్, అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'కందిరీగ', 'రభస' చిత్రాల దర్శకుడు సంతోష్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సుబ్రహ్మణ్యం గొర్రెల నిర్మిస్తున్నారు. గురువారం ఈ చిత్రం టైటిల్‌ని ప్రకటించి, సాయి శ్రీనివాస్ లుక్‌ని రిలీజ్ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ''వేసవిలో ప్రేక్షకులను అలరించే ఆహ్లాదకరమైన సినిమా ఇది'' అని చిత్రబృందం తెలిపింది. ఏప్రిల్ 30న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: చోటా.కె. నాయుడు.


• కాజల్ అగర్వాల్

# కొత్త సినిమా ప్రస్థానం


• నివేదా, సాయితేజ్

'చిత్రలహరి', 'ప్రతిరోజూ పండగే' చిత్రాలతో వరుస విజయాలను అందుకున్నారు సాయి తేజ్. ప్రస్తుతం 'ప్రస్థానం' చిత్రదర్శకుడు దేవ కట్టా దర్శకత్వంలో తన నూతన చిత్రాన్ని గురువారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. నివేదా పేతురాజ్ హీరోయిన్. జగపతిబాబు పవర్‌ఫుల్ రోల్ చేయనున్నారు. జె.భగవాన్, జె. పుల్లారావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవ వేడుకలో నిర్మాత అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేసి, స్క్రిప్ట్ అందించగా, నటుడు పవన్ కల్యాణ్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు వంశీ పైడిపల్లి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దేవ కట్టా మాట్లాడుతూ– ''ఎగ్జయిట్‌మెంట్ కలిగించే అద్భుతమైన కథతో ఈ సినిమా చేస్తున్నాం. ఏప్రిల్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: శ్యామ్ దత్.

# ఇక్కడైతే బతికిపోయేవాడు

హాలీవుడ్ మూవీ మొఘల్, నిర్మాణ దిగ్గజం హార్వీ వెయిన్‌స్టీన్‌కి 23 ఏళ్ల జైలు శిక్ష విధించింది కోర్టు. లైంగిక వేధింపులు, అత్యాచారం చేసిన నేరానికి జైలు పాలయ్యారు హార్వీ. పలువురు నటీమణులను ఇబ్బంది పెట్టిన కారణంగా ఆయన లైంగిక వేధింపుల ఆరోపణలకు గురయ్యారు. ఆ తర్వాతే 'మీటూ ఉద్యమం' ఊపందుకుంది. ఇటీవల జరిగిన కేసు విచారణలో హార్వీకు 23 ఏళ్లు కారాగార శిక్ష విధిస్తున్నట్టు కోర్టు ప్రకటించింది. కోర్టు నిర్ణయంపై పలువురు హాలీవుడ్ హీరోయిన్లు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హార్వీ వయసు 67 ఏళ్లు. ఇదిలా ఉంటే... ఇండియన్ ఇండస్ట్రీలో 'మీటూ' ఉద్యమం బాగా ఊపందుకోవడానికి కారణం బాలీవుడ్‌లో నటి తనుశ్రీ దత్తా, సౌత్‌లో సింగర్ చిన్మయి. ప్రముఖ రచయిత వైరముత్తుపై ఆరోపణలు చేశారు చిన్మయి. ఇప్పుడు హార్వీకి శిక్ష పడిన విషయాన్ని ఉద్దేశించి ''ఇండియాలో పుట్టి ఉండాల్సింది అని హార్వీ అనుకునే వాడేమో. ముఖ్యంగా తమిళనాడులో. ఇక్కడ ఉండి ఉంటే పార్టీలు చేసుకునేవాడు. తనకి పొలిటికల్ పార్టీలు సపోర్ట్ చేసుండేవి'' అని ఇక్కడైతే హార్వీ బతికిపోయేవాడనే అర్థం వచ్చేట్లు చిన్మయి ట్వీట్ చేశారు.


• చిన్మయి


• హార్వీ

## కాన్స్ ఫెస్టివల్ క్యాన్సిల్ ?

ప్రతీ ఏడాది వేసవిలో ఫ్రాన్స్ దేశం మరింత కళకళలాడుతుంది. దానికి కారణం కాన్స్ చలన చిత్రోత్సవాలు. ఈసారి కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ క్యాన్సిల్ అయ్యే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది క్యాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ మే 12 న మొదలు కావాలి. అయితే కరోనా వైరస్ కారణంగా ఈ చిత్రోత్సవాలు జరుగుతాయో లేదోననే సందేహాలు ఏర్పడ్డాయి. ''మార్చి నెలాఖరులోగా కరోనా తీవ్రత తగ్గుతుందనే ఆశతో ఉన్నాం. ఒకవేళ పరిస్థితులు అనుకూలంగా లేకపోతే ఫెస్టివల్‌ను క్యాన్సిల్ చేసే చాన్స్ ఉంది'' అన్నారు కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రెసిడెంట్ పీర్రీ లీస్క్యూర్.

## ఒకే ఒక్క పాత్రతో...


• జయప్రకాష్ రెడ్డి

విలన్‌గా, కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పలు తెలుగు చిత్రాల్లో నటించిన జయప్రకాష్ రెడ్డి ఏకపాత్రాభినయం చేసి, నిర్మించిన సినిమా 'అలెగ్జాండర్'. ధవళ సత్యం దర్శకుడు. జయప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ– ''రంగస్థల నటుడిగా నాకు నాటకాలంటే ప్రాణం. అదే నన్ను సినిమా నటుణ్ణి చేసింది. వన్ మ్యాన్ షో చేద్దామని రచయిత పూసలకు చెబితే ఆయన అద్భుతమైన స్క్రిప్ట్ ఇచ్చారు. వంద నిమిషాల నిడివితో ఉండే కథతో రెండు తెలుగు రాష్ట్రాల్లో 66 ప్రదర్శనలు ఇచ్చాను. ఆ కథనే సినిమాగా తీద్దామని ధవళ సత్యం దర్శకత్వంలో నటించాను. ఒక క్యారెక్టర్ ఆర్టిస్ట్ నటించింది ప్రేక్షకులకు చేరువకావడం కష్టం. ఆ క్రమంలోనే ఓటీటీ ప్లాట్‌ఫామ్ ద్వారా ఈ సినిమాను ఎవరైనా విడుదల చేయడానికి సిద్ధంగా ఉంటారేమోనని చూస్తున్నాం. రిటైర్డ్ మేజర్ ఒక హెల్ప్‌లైన్ ద్వారా కొందరి సమస్యలను తీర్చడం కథలో కనిపిస్తుంది'' అన్నారు. ''ఈ చిత్రంలో జయప్రకాష్ రెడ్డి ఒక్కడే పాత్రధారి కావడం విశేషం. అయితే వెనక నుంచి వచ్చే కొందరు నటుల మాటలు ఆకట్టుకునేలా ఉంటాయి'' అన్నారు ధవళ సత్యం.


• శ్రీవాస్, పూరి జగన్నాథ్, వైవీయస్ చౌదరి, రాఘవేంద్రరావు, అనుష్క, చార్మి, హేమంత్, విశ్వప్రసాద్, కోన వెంకట్, శ్యాంప్రసాద్ రెడ్డి

# టాప్ హీరోయిన్ అవుతావన్నాను

- కె.రాఘవేంద్రరావు

''స్వీటీ (అనుష్క)ని ఫస్ట్ టైమ్ చూసినప్పుడే సౌత్‌లో టాప్ హీరోయిన్ అవుతావన్నాను. ఒక్కో మెట్టు ఎక్కుతూ తను ఈ స్థాయికి వచ్చినందుకు గర్వంగా ఉంది. ప్రయత్నిస్తే సినిమాలు దొరుకుతాయి. కానీ, పాత్రలన్నీ నిన్ను (అనుష్క) వెతుక్కుంటూ వచ్చాయి.. ఏ హీరోయిన్‌కీ ఆ అవకాశం దక్కలేదు'' అన్నారు డైరెక్టర్ కె. రాఘవేంద్ర రావు. అనుష్క లీడ్ రోల్‌లో హేమంత్ మధుకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నిశ్శబ్దం'. క్రితి ప్రసాద్ సమర్పణలో టీజీ విశ్వప్రసాద్, కోన వెంకట్ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 2న విడుదలవుతోంది. 'సూపర్' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన అనుష్క ఫిల్మ్ ఇండస్ట్రీలో 15ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సెలబ్రేటింగ్ 15 ఇయర్స్ ఆఫ్ అనుష్క' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో **డైరెక్టర్ రాజమౌళి మాట్లాడుతూ–** ''నా సినిమాల్లో హీరోయిన్లకు పెద్ద ప్రాధాన్యత ఉండదు. కానీ, దేవసేన పాత్ర ఇచ్చినందుకు గర్వపడుతున్నా. 'నిశ్శబ్దం' టీజర్, ట్రైలర్ బాగున్నాయి.. ఏప్రిల్ 2న సినిమా కోసం ఎదురు చూస్తున్నా'' అన్నారు. ''హీరోయిన్లలో అనుష్కలాంటి మంచి అమ్మాయి ఉండటం అరుదు'' అన్నారు **డి. సురేశ్ బాబు. నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ–** ''ఐదారు నెలల క్రితం జార్జియాకి వెళ్లాను. అక్కడ కారు డ్రైవర్, కేర్ టేకర్ గాజా 'మీకు స్వీటీ (అనుష్క) తెలుసా?' అన్నాడు. సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది. ఓ తమిళ సినిమా షూటింగ్ కోసం అనుష్క జార్జియాలో ఉన్నప్పుడు గాజానే కారు డ్రైవర్, కేర్ టేకర్‌గా ఉండేవాడు. తన కారుని ఫైనాన్స్ వాళ్లు తీసుకెళ్లిపోతే అనుష్క కొత్త కారు కొనిచ్చిందట. అంత మంచి అమ్మాయి. మంచి టీమ్‌తో తను చేసిన 'నిశ్శబ్దం' పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు.

''స్వీటీ.. నీ కెరీర్‌లో మరో పదేళ్లలో సిల్వర్ జూబ్లీ జరుపుకుంటావని కచ్చితంగా చెబుతున్నా'' అన్నారు **నిర్మాత పీవీపీ.** ''సూపర్' సినిమా హీరోయిన్ కోసం ముంబై వెళ్లా. అక్కడ అనుష్క వచ్చింది. ఏం చేస్తుంటావని అడిగితే యోగా టీచర్ అంది. నాగార్జునగారికి చూపించి, ఆడిషన్స్ చేద్దామన్నాను.. చాలా బాగుంది.. ఏం పర్లేదు ఆడిషన్స్ వద్దన్నారాయన. వినోద్ బాల వద్ద నటన నేర్చుకుంది. 'నిశ్శబ్దం' బాగుంది. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి'' అన్నారు **డైరెక్టర్ పూరి జగన్నాథ్.**

**అనుష్క మాట్లాడుతూ–** ''సూపర్' నుంచి 'నిశ్శబ్దం' వరకూ ఎందరో డైరెక్టర్లు, నటీనటులు, సాంకేతిక నిపుణుల నుంచి ఎంతో నేర్చుకున్నా. ఈ పదిహేనేళ్లలో మంచీ, చెడులు తెలిశాయి'' అన్నారు. ''అనుష్కగారితో 'నిశ్శబ్దం' సినిమా చేయడం సంతోషంగా ఉంది'' అన్నారు **టీజీ విశ్వప్రసాద్** ''అనుష్క కెరీర్‌లో ఈ సినిమా ఓ మైలురాయిలా నిలుస్తుంది'' అన్నారు **హేమంత్ మధుకర్.** ''అనుష్క నిజంగానే 'లేడీ సూపర్‌స్టార్'. తన మంచి లక్షణాలతో ఓ పుస్తకం రాయొచ్చు'' అన్నారు **కోన వెంకట్.** ఈ కార్యక్రమంలో నిర్మాతలు కిరణ్, శోభు యార్లగడ్డ, చార్మీ, ప్రశాంతి, అభిషేక్ అగర్వాల్, వివేక్ కూచిబొట్ల, డైరెక్టర్లు శ్రీవాస్, దశరథ్, వైవీఎస్ చౌదరి, వీరూ పోట్ల, హీరోయిన్ అంజలి పాల్గొన్నారు.

# హే సినామికా

సీనియర్ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ బృందా దర్శకురాలిగా మారారు. ఆమె దర్శకత్వం వహించనున్న సినిమా ముహూర్తం గురువారం జరిగింది. దుల్కర్ సల్మాన్, కాజల్ అగర్వాల్, అదితీరావ్ హైదరీ ముఖ్య పాత్రల్లో బృందా దర్శకత్వంలో తెరకెక్కనున్న తమిళ చిత్రం 'హే సినామికా'. రొమాంటిక్ కామెడీ జానర్‌లో ఈ సినిమా తెరకెక్కనుంది. సింగిల్ షెడ్యూల్‌లో ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేయాలనుకుంటున్నారు. ఈ సినిమా ద్వారా జియో స్టూడియోస్ సంస్థ కోలీవుడ్‌లో అడుగుపెడుతోంది. 'హే సినామికా' టైటిల్‌ను మణిరత్నం – దుల్కర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఓకే కన్మణి' (ఓకే బంగారం)లో 'హే సినామికా...' పాట నుంచి తీసుకున్నారట.


• అదితీ రావ్


• దుల్కర్

# రెండున్నర గంటలు నవ్వులే

- రాజ్ తరుణ్


• రాధామోహన్, రాజ్ తరుణ్, మాళవికా నాయర్, కొండా విజయ్‌కుమార్

''ఒరేయ్ బుజ్జిగా' కంప్లీట్ ఎంటర్‌టైనర్. థియేటర్‌లో రెండున్నర గంటలు నవ్వుతూనే ఉంటారు. కుటుంబ సభ్యులంతా వచ్చి సంతోషంగా నవ్వుకుని వెళ్లే సినిమా'' అన్నారు రాజ్ తరుణ్. కొండా విజయ్‌కుమార్ దర్శకత్వంలో రాజ్ తరుణ్, మాళవికా నాయర్ జంటగా నటించిన చిత్రం 'ఒరేయ్ బుజ్జిగా'. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కె.కె.రాధామోహన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. కొండా విజయ్ కుమార్ మాట్లాడుతూ– ''ప్రేక్షకులందరూ నవ్వుకునే సినిమా చేయాలని 'ఒరేయ్ బుజ్జిగా' చేశా. ఉగాది పచ్చడిలో షడ్రుచులు ఉన్నట్లే మా సినిమాలో అన్ని అంశాలు ఉంటాయి'' అన్నారు. రాధామోహన్ మాట్లాడుతూ– ''యువతకి, కుటుంబ సభ్యులకి నచ్చే అన్ని రకాల వాణిజ్య అంశాలున్న సినిమా ఇది. ఈ నెల 14న కరీంనగర్‌లో, 19న తిరుపతిలో, 21న హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకలు చేస్తాం'' అన్నారు. మాళవికా నాయర్, నటుడు మధు నందన్, సినిమాటోగ్రాఫర్ ఐ ఆండ్రూ, కో– డైరెక్టర్ వేణు మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్.












epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
ఫ్యాషన్
నల్లగొండ
శుక్రవారం ॥ 13-3-2020

# లూజ్ & లుక్స్

బొద్దుగా ఉన్నవాళ్లు.. లావుగా ఉన్నవాళ్లు..
ఓవర్ వెయిట్ ఉన్నవాళ్లు...
వీళ్లు ఎక్సెల్, డబుల్ ఎక్సెల్ డ్రెస్సులను ఎంచుకుంటుంటారు.
కానీ, ఇటీవల సన్నగా.. స్లిమ్‌గా.. జీరో సైజ్ ఉన్నవాళ్లు సైతం
డబుల్ ఎక్సెల్ డ్రెస్సులను ఎంచుకుంటున్నారు.
అదేదో సరదాకోసం కాదు.
డబుల్ ఎక్స్‌ఎల్ డ్రెస్సులే ఇప్పటి ట్రెండ్.
హాలీవుడ్ టు బాలీవుడ్ అటు నుంచి టాలీవుడ్..
శరీరానికి అతుక్కుపోయినట్టుగా ఉన్న డ్రెస్సులు
రూపు మార్చుకుంటున్నాయి.
స్లిమ్ ఫిట్, స్కిన్ ఫిట్, టైట్‌ఫిట్..
ఇప్పుడీ డ్రెస్సులు
కొంత వెనకబడి
డబుల్ ఎక్స్‌ఎల్‌కు
సెల్యూట్
చేస్తున్నాయి.



● బాలీవుడ్ నటి కంగనా రనౌత్ లోటస్ మేకప్ ఇండియన్ ఫ్యాషన్ వీక్–2020లో నలుపు రంగు టుటు స్కర్ట్, ఓవర్ సైజ్డ్ బటన్ డౌన్ షర్ట్ ధరించి బోహో స్టైల్‌లో ర్యాప్ వాక్ చేశారు.

● ఈ ఓవర్‌సైజ్డ్ అంటే డబుల్ ఎక్స్‌ఎల్ స్టైల్ అన్ని శరీరాకృతులకు సరిపోక పోవచ్చు. కానీ, అన్నింటికన్నా సౌకర్యానికే మా ప్రాధాన్యత అనే కాన్ఫిడెంట్ ఉంటే ఇలాంటి డ్రెస్‌లో మీరూ మెరవచ్చు.

● 80ల కాలం డ్రెస్సింగ్ స్టైల్ ఇప్పుడు కొత్తగా ఆకట్టుకుంటోంది. దీనికా పలువురు సినీ కథానాయికలే రుజువు. డెనిమ్ వైల్డ్ బ్యాగీ పాయింట్, ఓవర్‌సైజ్డ్ షర్ట్‌కి, బెల్ట్‌తో జత చేసి పైన బ్లాక్ బ్లేజర్ లేదా జాకెట్‌ను కూడా జత చేసుకోవచ్చు.





కేశాలంకరణలోనూ పెద్దగా ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. లూజ్ హెయిర్ లేదా, ముడి, ఫిష్‌టెయిల్ హెయిర్‌స్టైల్స్ ఈ డ్రెసింగ్‌కి బాగా నప్పుతాయి.





ఇది రెట్రో స్టైల్ నుంచి వచ్చింది. దాదాపు 70ల కాలంలో ఉండే ఫ్రాక్స్, బెల్ ప్యాంట్స్ బెల్ స్లీవ్స్ అలా అలా కొద్దిగా మార్పులు చేసుకుంటూ వదులైన డ్రెస్‌గా రూపాంతరం చెందాయి.



**కృతికా గుప్త,** డిజైనర్,
ఐడిఎఫ్ ఫ్యాషన్ ఇన్సిట్యూట్, హైదరాబాద్

● లాంగ్ అనార్కలీ, మ్యాక్సీ గౌనులు ఓవర్ సైజ్‌లో వెలిగిపోవడం ఇప్పుడు ట్రెండ్‌లో ఉంది. చాలా సాదా సీదాగా అనిపిస్తున్నట్టుగా ఉండే ఈ స్టైల్ సౌకర్యానికే పెద్ద పీట. 'లూజ్ డ్రెస్సులు ధరించడం' ఈ స్టైల్‌కి ప్రధానం కాబట్టి ఇత రత్రా ఆభరణాల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం లేదు. ఆభరణాలు కావాలనుకునేవారు ఫ్యాషన్ జ్యువెలరీని అదీ చాలా తక్కువ అంటే చెవులకు లాంగ్ హ్యాంగింగ్స్, మెడలో సన్నని చైన్ అలంక రించుకుంటే చాలు.

● సౌకర్యంగా ఉండే స్టైల్ కాబట్టి హీల్స్ జోలికి వెళ్లకుండా స్నీకర్స్, బూట్లు, ఫ్లాట్స్.. పాదరక్ష లను ఎంచుకుంటే మేలు.



**'ఓవర్ సైజ్ స్టైల్'కి దీపిక రాణి:** తెల్లటి క్లోజ్ నెక్ టాప్‌కి లూజ్‌గా ఉండే స్లీవ్స్, నీలిరంగు బ్యాగీ వైడ్ లెగ్డ్ జీన్స్‌తో ఇటీవల మెరిసింది బాలీవుడ్ దీపిక పదుకోన్ మెరిసింది. దాని మీదకు ఫ్యాషన్ జ్యువెలరీ, స్నీకర్స్, పోనీటైల్‌తో రూపాన్ని వైవిధ్యంగా మార్చింది.







నిర్వహణ
**నిర్మలారెడ్డి**

## కరోనా అయినా కంగారు లేదు



● టామ్ హ్యాంక్స్, రీటా

**హా**లీవుడ్ సీనియర్ నటుడు టామ్ హ్యాంక్స్‌కి కరోనా వైరస్ సోకింది. ఆయనకు, ఆయన భార్య రీటా విల్సన్‌కు కరోనా టెస్టుల్లో పాజిటివ్ వచ్చిందన్న విషయాన్ని తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా స్పష్టం చేశారు హ్యాంక్స్. షూటింగ్ నిమిత్తం ఆస్ట్రేలియా వెళ్లారు హ్యాంక్స్. ఆరోగ్యం బాలేదని టెస్ట్ చేయించుకుంటే కరోనా అని తేలింది. 'ఫారెస్ట్ గంప్, గ్రీన్ మైల్, క్యాస్ట్ ఎవే' వంటి సినిమాల్లో విలక్షణ నటనతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు హ్యాంక్స్. ''మేం ఇద్దరం డాక్టర్లు చెప్పినవన్నీ పాటిస్తాం. అంతేకానీ కరోనా సోకిందని కంగారు పడటంలేదు'' అని ఈ కపుల్ పేర్కొన్నారు.

సినిమా

## తేజగారి దర్శకత్వంలో నటించాలనుంది



● జీపీయస్

''**చి**రంజీవిగారికి వీరాభిమానిని. చిన్నప్పటినుంచి ఆయన సినిమాలు చూస్తున్నాను. అలా సినిమాలపై ఆసక్తి ఎక్కువైంది'' అన్నారు జీపీఎస్. మురళీ రామస్వామి దర్శకత్వంలో జీపీఎస్ హీరోగా రూపొందిన చిత్రం 'ప్రేమ పిపాసి'. పియస్ రామకృష్ణ, రాహుల్ పండిట్, యుగంధర్, వైజాగ్ మురళి నిర్మించిన ఈ సినిమా నేడు విడుద లవుతోంది. జీపీయస్ మాట్లాడుతూ– ''తేజగారు కొత్తవారికి అవకాశాలు ఇస్తున్న సమయంలో నా చదువు పూర్తయ్యాక హైదరాబాద్‌కి వచ్చాను. తేజగారి దగ్గర ప్రయత్నించా కానీ కుదరలేదు. ఎప్పటికైనా ఆయన డైరెక్షన్‌లో సినిమా చేయాలన్నది నా కల. అప్పట్లో ఒక హీరో ఇంటర్వ్యూ చదివి ఆ స్ఫూర్తితో దర్శకత్వ శాఖలో కొంతకాలం పనిచేశా. రైటర్ కులశేఖర్‌గారి వద్ద కూడా చేశా. అలా సినిమా వాళ్లతో పరిచయాలు పెరిగాయి. ఫస్ట్ 'నేనొస్తా' అనే సినిమాలో నెగిటివ్ పాత్ర చేశా. ఆ తర్వాత చాలా అవకాశాలు వచ్చాయి కానీ హీరో అవ్వాలన్నదే నా లక్ష్యం. నేను, మురళీ రామస్వామి మంచి మిత్రులం. నన్ను, డైరెక్టర్‌ని, మా కసిని నమ్మి 'ప్రేమ పిపాసి' నిర్మాతలు అవకాశం ఇచ్చారు. మా టీమ్ అంతా కలిసి మరో సినిమా ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.

తిరిగొచ్చిన స్టైల్





## జత కలిసే.. జత కలిసే...

**కొంతమందికి హ్యాండ్‌బ్యాగ్ కలెక్షన్ ఉంటుంది. మరికొందరికి షూస్ కలెక్షన్ ఉంటుంది. ఈ రెంటినీ ఏదో విధంగా మ్యాచ్ చేసే సందర్భాలూ ఉంటాయి. లేదంటే డ్రెస్సు కలర్ కాంబినేషన్ బట్టి కూడా బ్యాగ్ లేదా షూస్ మ్యాచింగ్ చూసుకుంటారు.**

**కొ**న్ని స్టైల్స్ కొత్తగా ఏమీ అనిపించవు. ఎందుకంటే అవి ఎప్పుడో అప్పుడు వెలుగు చూసినవే అయి ఉంటాయి. అలాంటివాటిలో చెప్పుకోదగిన ట్రెండ్ బ్యాగ్–షూ మ్యాచ్ అయ్యేలా ధరించడం. లేదంటే వేసుకున్న డ్రెస్సులో ఏదో ఒకటి కాంబినేషన్ కలర్, డిజైన్ కలిసి వచ్చేలా షూ–బ్యాగ్‌ని ధరించడం. అలంకరణలో ఎక్కువ హంగామా లేకుండా కొన్ని చిన్న చిన్న మార్పులు చేసుకుంటే లుక్‌లో చాలా వైవిధ్యం చూపించవచ్చు. కితాబులు అందుకోవచ్చు.

- మ్యాచింగ్ హ్యాండ్ బ్యాగ్, షూస్ మీ దుస్తుల ప్రాధాన్యత పెంచేలా ఉండాలి.
- మీరు ధరించే హ్యాండ్ బ్యాగ్ ఎదుటివారికి మీ జీవనశైలిని చూపుతుంది. అందుకే మీరు ఎంచుకునే పర్స్ లేదా బ్యాగ్ మీ శైలికి, మీ వ్యక్తిత్వానికి సరిపోయేలా ఉండాలి.





● విరివిగా వచ్చే ప్రకటనల మూలంగా అన్నింటా మ్యాచింగ్ అనేది ప్రధాన కేంద్రంగా మారింది. ఇప్పుడు కొన్ని స్టోర్స్‌లో మ్యాచింగ్ హ్యాండ్ బ్యాగులు, షూ.. పక్కపక్కనే ఉంచడం ప్రారంభించాయి. కొంతమంది మహిళలు పాత కాలం నాటి ఫ్యాషన్‌కు సంబంధించిన నియమాలనే ఫాలో అవడానికి ఇష్టపడతారు. ఆ విధంగానూ ఈ ట్రెండ్ రిపీట్ అవుతూనే ఉంది.

● చాలా వరకు ప్రపంచంలో అన్నిరకాల లగ్జరీ బ్రాండ్స్ మ్యాచింగ్ బ్యాగ్స్‌ను తీసుకువస్తున్నాయి. ఆ రంగు, డిజైన్‌లోనే ఉండే షూస్ వస్తున్నాయి. దీనిని బట్టి చూస్తే మ్యాచింగ్ అంటే మగువలు బాగా ఇష్టపడతారనే వ్యాపార ధోరణి కూడా ఇందులో కనిపిస్తుంది.





## తొలి సినిమా స్పెషాల్టీ అదే – నాగ్ అశ్విన్



● త్రిష్నా, శ్రీవిద్య, లక్ష్మి మంచు, నాగ్ అశ్విన్

**రా**హుల్, త్రిష్నా ముఖర్జీ జంటగా నటించిన చిత్రం 'మధ'. ఇందిరా బసవ నిర్మించిన ఈ చిత్రానికి శ్రీవిద్య బసవ దర్శకురాలు. నేడు విడుదలవుతున్న ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– ''తొలి సినిమాను ఎవరైనా లెక్కలేసుకోకుండా తీస్తాం. మొదటి సినిమా స్పెషాల్టీ అది. సినిమా తీసిన తర్వాత రిలీజ్ చేయటం మామూలు విషయం కాదు. శ్రీవిద్యకు, ఇందిరగారికి అభినందనలు'' అన్నారు. లక్ష్మీ మంచు మాట్లాడుతూ– ''26 ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ అవార్డులు గెలుచుకున్న 'మధ' చిత్రం ఎప్పుడో విన్నర్. శ్రీవిద్య వర్క్ చూసి స్టన్ అయ్యాను. శ్రీవిద్యకు ఆమె అమ్మగారు ఇచ్చిన సపోర్ట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. మంచి స్క్రిప్ట్‌తో వస్తే తనతో సినిమా చేయటానికి నేను రెడీ'' అన్నారు. హరీశ్ శంకర్ మాట్లాడుతూ– ''ఎప్పుడూ పాటలు, ఫైట్స్ ఉన్న సినిమాలే కాదు. అప్పుడప్పుడు ఇలాంటి సినిమాలు కూడా రావాలి'' అన్నారు. ''మూడేళ్ల నుండి మా అమ్మతో పాటు నా టీమ్ అందరూ సపోర్ట్ చేశారు. అనీష్‌గారు నాకు గైడ్‌లా సపోర్ట్ చేశారు'' అన్నారు శ్రీవిద్య.

## కాలేజీలో థ్రిల్



● ప్రశాంత్, సయ్యద్

''**యు**రేక' ట్రైలర్ బాగుంది. థ్రిల్లర్ నేపథ్యంలో నిర్మించారని తెలుస్తోంది. కథ బాగుంటే ప్రేక్షకులు చిన్న సినిమాలైనా ఆదరిస్తారు. 'మత్తు వదలరా' లాంటి సినిమా సక్సెస్ అయింది. అదే తరహాలో 'యురేక' చిత్రం కూడా విజయం సాధించాలి'' అన్నారు నిర్మాత రాజ్ కందుకూరి. కార్తీక్ ఆనంద్, సయ్యద్ సోహైల్ రియాన్, డింపుల్ హయతి, షాలినీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యురేక'. కార్తీక్ ఆనంద్ దర్శకత్వంలో ప్రశాంత్ తాత నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ప్రశాంత్ తాత మాట్లాడుతూ– ''ఒక మంచి సినిమా తీశామని నమ్ముతున్నాం. మాకు సహకరించిన నిర్మాతలు రాజ్ కందుకూరి, మధురా శ్రీధర్, బెక్కం వేణుగోపాల్‌గార్లకు ధన్యవాదాలు. కార్తీక్ ఆనంద్ సినిమాను బాగా తీశాడు'' అన్నారు. ''నేను అనుకున్న దానికంటే 'యురేక' సినిమా బాగా తీశాను. కాలేజ్ నేపథ్యంలో వస్తోన్న మా చిత్రంలోని థ్రిల్లింగ్ అంశాలు అందర్నీ అలరిస్తాయని భావిస్తున్నా'' అన్నారు కార్తీక్ ఆనంద్. ఈ చిత్రానికి సహ నిర్మాత: లలిత కుమారి బొడ్డుచర్ల, లైన్ ప్రొడ్యూసర్: బి.ఆర్.ఎస్.టి. సాయి.

## అది కరెక్ట్ కాదు



● సమంత

''**ఇం**డస్ట్రీలో హీరోలతో సమానంగానే హీరోయిన్లు కష్టపడతాం. కానీ పారితోషికం విషయంలో తేడా ఎందుకు చూపిస్తారో అర్థం కాదు'' అన్నారు సమంత. వరుస సూపర్ హిట్స్‌తో కెరీర్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్నారు సమంత. కానీ ఇటీవల సమంత నటించిన 'జాను' సినిమా అనుకున్న స్థాయిలో ఆడలేదు. ఓ హిందీ వెబ్‌సైట్ సమంతను 'ఫ్లాప్ హీరోయిన్' అని రాసుకొచ్చింది. ఈ విషయం గురించి సమంత ఓ ఇంటర్వ్యూలో స్పందిస్తూ – ''సినిమా హిట్‌ను హీరో ఖాతాలో వేసి, ఫ్లాప్‌ని హీరోయిన్‌కి ఇచ్చేస్తారు. అది కరెక్ట్ కాదు. హిట్‌ని హీరోకి, ఫ్లాప్‌ని మాత్రం హీరోయిన్ ఖాతాలో వేయడమెందుకు? స్టార్ హీరోలకి వరుసగా మూడు ఫ్లాపులు వచ్చినా నాలుగో సినిమాకు ఆడియన్స్ వెళ్తారు. ఎందుకంటే వాళ్లకు తమ ఫేవరెట్ హీరోను స్క్రీన్ మీద చూస్తే చాలు. అలాగే లేడీ ఓరియంటెడ్ సినిమాలకు ఆదరణ ఇంకా పెరగాలి. 'ఓ బేబి' హిట్ అయిందని నేను మరో లేడీ ఓరియంటెడ్ సినిమా అంగీకరించలేను. ఎందుకంటే వరుసగా ఫిమేల్ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తే చూస్తారో? లేదో?'' అన్నారు సమంత.

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
శుక్రవారం
13-3-2020

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## అడ్మిషన్స్

### ఏఐఐఎస్‌హెచ్‌లో ప్రవేశాలు

మానసిక దివ్యాంగులకు విద్యాబోధన చేసేందుకు ప్రత్యేక శిక్షణ అవసరం. ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్(ఏఐఐఎస్‌హెచ్), మైసూర్.. డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ తదితర స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులను అందిస్తోంది.



ఇందులో కొన్ని కోర్సులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుండగా.. మరికొన్నింటిలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అడ్మిషన్స్ కల్పిస్తారు. బి.ఏఎస్‌ఎల్‌పీ /ఎమ్మెస్సీ/ఎంఈడీ/ పీహెచ్‌డీ కోర్సులకు మాత్రమే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్-హెచ్ఐ, పీజీ డిప్లొమా కోర్సులకు ఎలాంటి ఎంట్రెన్స్ లేదు. 2020-21 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.

#### కోర్సులు

» డిప్లొమా ఇన్ హియరింగ్ ఎయిడ్ అండ్ ఇయర్ మౌల్డ్ టెక్నాలజీ(డీహెచ్ఏ అండ్ ఈటీ).
» డిప్లొమా ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్(హియరింగ్ ఇంపెయిర్‌మెంట్).
» డిప్లొమా ఇన్ హియరింగ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్(డీహెచ్ఎల్ఎస్).
» బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ(బి.ఏఎస్ఎల్‌పీ).
» బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఎడ్యుకేషన్-హియరింగ్ ఇంపెయిర్‌మెంట్ (బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్-హెచ్ఐ).
» పీజీ డిప్లొమా ఇన్ ఆగ్మెంటేటివ్ అండ్ ఆల్టర్నేటివ్ కమ్యూనికేషన్(పీజీడీఏఏసీ).
» పీజీ డిప్లొమా ఇన్ క్లినికల్ లింగ్విస్టిక్స్ ఫర్ స్పీచ్-లాంగ్వేజ్ పాథాలజీ(పీజీ డీసీఎల్-ఎస్ఎల్‌పీ).
» పీజీ డిప్లొమా ఇన్ ఫోరెన్సిక్ స్పీచ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(పీజీడీఎఫ్ఎస్ఎస్‌టీ).
» పీజీ డిప్లొమా ఇన్ న్యూరో-ఆడియోలజీ( పీజీడీఎన్ఏ).
» ఎమ్మెస్సీ-స్పీచ్-లాంగ్వేజ్ పథాలజీ/ ఆడియాలజీ.
» ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్(హియరింగ్ ఇంపెయిర్‌మెంట్).
» పీహెచ్‌డీ(స్పీచ్-లాంగ్వేజ్ పథాలజీ/ఆడియోలజీ/స్పీచ్ అండ్ హియరింగ్/స్పెషల్ ఎడ్యుకేషన్/ లింగ్విస్టిక్స్.
» పోస్ట్ డాక్టొరల్ ఫెలోషిప్.

#### ముఖ్యమైన తేదీలు

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 29 ఏప్రిల్,2020
» **ప్రవేశ పరీక్ష తేది:** 16 మే 2020
» **వెబ్‌సైట్:** **https://aiishmysore.in**

### ఏపీపీఈసెట్-2020

ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2020 నోటిఫికేషన్ విడుదలైంది. దీనిద్వారా రెండేళ్ల కాల పరిమితి గల బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బి-పీఈడీ), డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్(డి-పీఈడీ) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది.

#### బీపీఈడీకి అర్హతలు

» అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారై ఉండాలి. 2020 జూలై 01 నాటికి 19 ఏళ్లు నిండటంతోపాటు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేయాలి.
» **డీపీఈడీ అర్హతలు:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్మీడియెట్/ తత్సమానమైన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు. వయసు 16 ఏళ్లు నిండి ఉండాలి.
» **దరఖాస్తు ఫీజు:** జనరల్/బీసీ: రూ.850, ఎస్సీ/ఎస్టీ: రూ.650

#### ముఖ్యమైన తేదీలు

» **దరఖాస్తులకు చివరి తేది:** 10 ఏప్రిల్2020
» **రూ.500 ఆలస్య రుసుంతో:** 24 ఏప్రిల్ 2020
» **పరీక్ష తేదీలు:** మే 05 నుంచి ప్రారంభం
» **వెబ్‌సైట్:** **www.apsche.org, www.appecet.org.in https://sche.ap.gov.in/pecet**

టెట్/డీఎస్సీ
స్టడీ మెటీరియల్
బిట్‌బ్యాంక్ జీకే
ఆన్‌లైన్ టెస్టులు
మోడల్ పేపర్స్
కరెంట్ అఫైర్స్
ప్రీవియస్ పేపర్స్
వీడియో గైడెన్స్ మొదలైనవి.
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
MATHEMATICS

## కెరీర్ గైడెన్స్

# బంగారు కొలువు

బంగారం.. రత్నాలు.. వజ్రాలు.. ఇవంటే ప్రతి ఒక్కరికీ ఆసక్తి! భవిష్యత్ కోసం ఎంతో కొంత బంగారం, ఆభరణాలు కొనుగోలు చేద్దామనే భావన!! మన దేశంలోనే కాదు..ప్రపంచవ్యాప్తంగా బంగారం అంటే ఇష్టం లేని వారిని వేళ్లపై లెక్క పెట్టొచ్చు. అందుకే జెమ్స్, జ్యుయలరీకి తరగని డిమాండ్. ఎగుమతులు, దిగుమతుల పరంగా భారత జెమ్స్, జ్యుయలరీ విభాగం ముందువరుసలో నిలుస్తోంది. ఇదే ఇప్పుడు యువతకు బంగారం లాంటి ఉద్యోగాలకు వేదికగా మారుతోంది. ఈ నేపథ్యంలో.. జెమ్స్, జ్యుయలరీ విభాగంలో అందుబాటులో ఉన్న కొలువులు, అవసరమైన అర్హతలు, నైపుణ్యాలు, కోర్సుల గురించి తెలుసుకుందాం..



- జెమ్స్, జ్యుయలరీ విభాగంలో విలక్షణమైన కొలువులు
- ఆర్థిక ఒడిదుడుకుల్లోనూ డిమాండ్ తగ్గని రంగం
- ఇంటర్‌తోనే సంబంధిత కోర్సుల్లో చేరే అవకాశం

గతేడాది దాదాపు అన్ని రంగాలు ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కోవడం తెలిసిందే. కానీ.. జెమ్స్, జ్యుయలరీ విభాగం మాత్రం వృద్ధి బాటలో పయనించింది. ముఖ్యంగా షేర్ మార్కెట్స్, రియల్ ఎస్టేట్ రంగాల్లో పెట్టుబడులు పెట్టే వారు.. ఒడిదుడుకుల కారణంగా తమ పెట్టుబడులను బులియన్ మార్కెట్‌లోకి మళ్లించారు. దీంతో ఈ రంగం జీడీపీలో ఏడు శాతం వాటా నమోదు చేసుకుంది. రోజురోజుకూ ఆభరణాల రంగంలో డిమాండ్ పెరుగుతున్నదే కాని తగ్గడం లేదు.

### రానున్న రెండేళ్లలో రెట్టింపు

జెమ్స్, జ్యుయలరీ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ గణాంకాల ప్రకారం-ఈ రంగంలో జాతీయ స్థాయిలో 4.6 మిలియన్ల మందికి ఉపాధి లభిస్తోంది. ప్రస్తుత మార్కెట్ పనితీరు, దేశంలో బంగారం, ఆభరణాల ఎగుమతి దిగుమతులను పరిశీలిస్తే.. రానున్న రోజుల్లో ఈ రంగం మరింతగా విస్తరించే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో రానున్న రెండేళ్లలో ఆభరణాల రంగంలో ఉపాధి అవకాశాలు రెట్టింపు కానున్నాయి. భవిష్యత్‌లో సంఘటిత, అసంఘటిత విభాగాల్లో లక్షల సంఖ్యలోనే ఉపాధి లభించనుందని అంచనా.

### గోల్డ్ స్మిత్.. టు డిజైనర్స్

ప్రస్తుతం జెమ్స్,జ్యుయలరీ రంగం కార్పొరేట్ రూపు సంతరించుకుంటోంది. పలు సంస్థలు రిటైల్ చైన్ స్టోర్లను నెలకొల్పుతున్నాయి. దాంతో వీటిల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గోల్డ్‌స్మిత్ మొదలు ఆభరణాల రూపకల్పనలో డిజైనర్ల వరకూ.. ఒక్కో సంస్థకు పదులు, వందల సంఖ్యలో సంబంధిత మానవ వనరుల అవసరం ఏర్పడుతోంది. ఆభరణాన్ని వినియోగదారులు కొనుగోలు చేయాలంటే.. దాన్ని చూడగానే ఆకట్టుకునే విధంగా రూపొందించాలి. అందుకే ఆభరణాల డిజైనర్లకు డిమాండ్ నెలకొంది.

### సర్టిఫికెట్ టు డిగ్రీ కోర్సులు

జెమ్స్, జ్యుయలరీ విభాగంలో కొలువులు సొంతం చేసుకునేందుకు విద్యార్హతల తోపాటు సంబంధిత నైపుణ్యాలు చాలా అవసరం. ఆ దిశగా పలు ఇన్‌స్టిట్యూట్‌లు సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ కోర్సులను అందిస్తున్నాయి. ప్రధానంగా ఫ్యాషన్ అనగానే గుర్తొచ్చే విద్యా సంస్థ.. నిఫ్ట్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ)లో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆర్నమెంట్ డిజైన్‌లో శిక్షణ ఇస్తున్నారు. దీన్ని పూర్తిచేసిన వారికి ఆభరణాల తయారీలో తొలిదశగా పేర్కొనే డిజైన్ విభాగంలో కొలువులు లభిస్తాయి. జెమలాజికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కూడా సర్టిఫికెట్, డిప్లొమా స్థాయిలో స్వల్పకాలిక కోర్సులను అందిస్తోంది. వీటిని పూర్తి చేసుకున్న వారు ముఖ్యంగా ఫ్యాషన్ జ్యుయలరీ, డైమండ్స్, జెమ్స్ విభాగాల్లో ఉపాధి అవకాశాలు అందుకోవచ్చు.

### ఎంఎస్ఎంఈ

దేశంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ కోసం ఏర్పాటుచేసిన సంస్థ.. ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్). ఇది జ్యుయలరీలో పలు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు అందిస్తోంది. అదే విధంగా దేశవ్యాప్తంగా ఉన్న అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్.. గోల్డ్ స్మిత్, డైమండ్ కటింగ్, గ్రేడింగ్, టెస్టింగ్ తదితర అంశాల్లో స్వల్పకాలిక కోర్సులు నిర్వహిస్తున్నాయి. ఎన్ఎస్‌డీసీలోనూ.. సెక్టార్‌స్కిల్ కౌన్సిల్స్ ఆధ్వర్యంలో గోల్డ్ స్మిత్, ప్రాసెసింగ్, రిటెయిలింగ్, ట్రేడింగ్ వంటి అంశాల్లో శిక్షణ లభిస్తోంది. దీంతోపాటు ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన స్కీమ్ పరిధిలో.. డైమండ్ సెట్ జ్యుయలరీ విభాగంలో.. క్యాడ్ ఆపరేటర్, హ్యాండ్ స్కెచ్ డిజైనర్ కోర్సుల్లో శిక్షణ సదుపాయం అందుబాటులో ఉంది.

### ఫ్యాషన్ జ్యుయలరీ

జెమ్స్, జ్యుయలరీ రంగంలో.. ఫ్యాషన్ జ్యుయలరీ విభాగం వేగంగా వృద్ధి చెందుతోంది. ఫలితంగా.. చైన్ కటింగ్, క్యాస్టింగ్, స్టోన్ ఫిట్టింగ్ తదితర విభాగాల్లో కొలువుల సంఖ్య పెరుగుతోంది. ఏటా రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్ల టర్నోవర్ ఉన్న సంస్థలు తామే సొంతంగా అభ్యర్థులను నియమించుకుని కొంతకాలం శిక్షణనిచ్చి ఆర్టిసన్‌లుగా కొలువులు ఖరారు చేస్తున్నాయి. వేతనాలు కూడా ఆకర్షణీయంగానే ఉంటున్నాయి. కాంట్రాక్ట్ విధానంలో చేరిన అభ్యర్థులకు నెలకు 15వేలు; శాశ్వత ప్రాతిపదికగా నియమించుకున్న వారికి నెలకు రూ.20వేల వరకు వేతనం లభిస్తోంది.

### జెమ్స్, జ్యుయలరీ రంగం.. ముఖ్యాంశాలు..

- 2019లో బంగారం వినియోగంలో ప్రపంచంలోనే రెండో పెద్ద దేశంగా భారత్.
- ప్రస్తుతం జాతీయ స్థాయిలో దాదాపు మూడు లక్షలకుపైగా విక్రయదారులు
- 2022 నాటికి సంఘటిత, అసంఘటిత రంగాల్లో మిలియన్ల మందికి ఉపాధికి అవకాశం
- గోల్డ్ స్మిత్ నుంచి డిజైనర్ వరకు పలు రకాల ఉద్యోగాలు
- నెలకు రూ. 25 వేల నుంచి రూ. లక్ష వరకు వేతనం
- నిఫ్ట్, సీడ్‌లతోపాటు పలు ఇన్‌స్టిట్యూట్‌లలో కోర్సులు

### ఉపాధి వేదికలు

జెమ్స్, జ్యుయలరీ విభాగంలో.. ఉపాధి అవకాశాలు విస్తృతం అవుతున్నాయి. ఈ రంగంలో అసంఘటిత కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. నైపుణ్యం సొంతం చేసుకున్న అభ్యర్థులు స్వయంగా సంస్థలను సంప్రదించడం మేలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా » మైనింగ్ » జ్యుయలరీ మేకింగ్ అండ్ డిజైనింగ్ యూనిట్స్ » జెమ్స్ ఎక్స్‌పోర్టింగ్ ఆర్గనైజేషన్స్ » జెమ్ ఎవాల్యుయేషన్ అండ్ టెస్టింగ్ లేబొరేటరీస్ » జ్యుయలరీ స్టోర్స్ ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి.





### కొలువులు-విధులు

#### జ్యుయలరీ డిజైనర్

నిర్దిష్టంగా ఒక ఆభరణానికి సంబంధించి డిజైన్‌లు సిద్ధం చేయడం జ్యుయలరీ డిజైనర్ బాధ్యత. నిఫ్ట్, సీడ్, ఎన్ఐడీ వంటి సంస్థల నుంచి డిజైన్ కోర్సుల్లో డిగ్రీ పొందిన వారికి జ్యుయలరీ డిజైనర్‌గా అవకాశం లభిస్తోంది. నైపుణ్యాన్ని బట్టి వీరు రూ.40 వేల వరకు వేతనం అందుకునే వీలుంది.

#### గోల్డ్‌స్మిత్ (స్వర్ణకారులు)

ఒక ఆభరణం డిజైన్‌పై స్పష్టత వచ్చాక.. ముడి బంగారాన్ని డిజైన్‌కు అనుగుణంగా తీర్చిదిద్దడం గోల్డ్‌స్మిత్ చేసే పని. వీరికి జ్యుయలరీ విభాగంలో నెలకు రూ.20 వేల వరకు; జెమ్స్, డైమండ్స్, ఫ్యాషన్ జ్యుయలరీ విభాగంలో రూ.15 వేల వరకు వేతనం లభిస్తుంది.

#### ల్యాబ్ జెమాలజిస్ట్

డైమండ్స్, రత్నాలు వంటి జెమ్స్‌కు సంబంధించి జెమాలజిస్ట్‌లు లేబొరేటరీల్లో నాణ్యతను పరిశీలించాల్సి ఉంటుంది. వీరికి ప్రారంభంలో రూ.40వేల వరకు వేతనం అందే అవకాశం ఉంది.

#### జెమ్ స్టోన్ అప్రైజర్

జెమ్స్ నాణ్యతను పరిశీలించడం, దాని ఆధారంగా వాటి విలువను అంచనా వేయడం జెమ్ స్టోన్ అప్రైజర్ బాధ్యత. ప్రస్తుతం వీరికి డిమాండ్ అధికంగా ఉంది.

#### డైమండ్ గ్రేడర్

జెమాలజీకి సంబంధించి మంచి ఆదాయం లభించే మరో కొలువు.. డైమండ్ గ్రేడర్. డైమండ్ నాణ్యతను బట్టి గ్రేడింగ్ చేయాల్సి ఉంటుంది.

#### రిటైల్ ట్రేడింగ్

జెమ్స్, జ్యుయలరీ రంగంలో.. రిటైల్ ట్రేడింగ్‌లోనూ పలు అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. కమ్యూనికేషన్ స్కిల్స్, బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్, ఫ్లోర్ మేనేజర్, షోరూమ్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. వీరు నెలకు రూ.12 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనం అందుకోవచ్చు.

### జెమాలజీ ఇన్‌స్టిట్యూట్స్

- జెమ్ అండ్ జ్యుయలరీ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా.
- వెబ్‌సైట్: **www.gjsci.org**
- జెమలాజికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా.
- వెబ్‌సైట్: **https://giionline.com**
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెమాలజీ.
- వెబ్‌సైట్: **www.iigdelhi.com**
- ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన.
- వెబ్‌సైట్: **pmkvyofficial.org**
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెమ్స్ అండ్ జ్యుయలరీ (జైపూర్)
- వెబ్‌సైట్: **iigjjaipur.com**
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జ్యుయలరీ
- వెబ్‌సైట్: **www.dsiidc.org/nij/**

# 2020 టేలర్ ప్రైజ్ సొంతం చేసుకున్న భారత పర్యావరణ వేత్త ఎవరు?

## పోటీ పరీక్షల ప్రత్యేకం
## కరెంట్ అఫైర్స్

➠ **2020 సంవత్సరానికి ప్రతిష్టాత్మక ప్రిట్జ్‌కర్ ప్రైజ్‌ను ఎవరికి ప్రకటించారు?**
1. గోర్డన్ బన్‌షాఫ్ట్, ఆస్కార్ నీమెర్
2. జాక్వెస్ హెర్జాగ్, పియరీ డి మ్యూరోన్
3. ఈవాన్ ఫారెల్, షెల్లీ మెక్‌నమారా
4. కజుయో సెజిమ,ర్యూ నిషిజావా
**సమాధానం: 3**

- ప్రిట్జ్‌కర్ ప్రైజ్‌ను ఆర్కిటెక్చర్‌లో నోబెల్ బహుమతిగా పేర్కొంటారు. 1979లో తొలిసారి ప్రదానం చేశారు. లక్ష డాలర్ల నగదు బహుమతిని అందజేస్తారు. 2018లో ఈ బహుమతిని గెలుచుకున్న తొలి భారతీయుడు బాలకృష్ణ దోషి. 2020 ప్రిట్జ్‌కర్ ప్రైజ్‌ను మార్చి3న ఐర్లాండ్‌కు చెందిన ఇద్దరు మహిళా ఆర్కిటెక్ట్‌లకు ప్రకటించారు. వారు.. ఈవాన్ ఫారెల్, షెల్లీ మెక్‌నమారా. వీరిద్దరూ ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో గ్రాఫ్టన్ ఆర్కిటెక్ట్స్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఐర్లాండ్ దేశవ్యాప్తంగా అనేక నివాస, వాణిజ్య భవనాలను నిర్మించారు. వీరు పెరూ రాజధాని లిమాలో నిర్మించిన 'ద యూనివర్సిటీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' భవనం అద్భుతమైన కట్టడంగా ప్రఖ్యాతి చెందింది.

➠ **ప్రపంచంలోనే ఉచిత ప్రజా రవాణాను అందుబాటులోకి తెచ్చిన తొలిదేశం?**
1. బెల్జియం 2. లక్సెంబర్గ్
3. మొనాకో 4. ఇటలీ
**సమాధానం: 2**

- ఆ దేశ ప్రజలే కాకుండా.. టూరిస్టులు కూడా ఉచితంగా ప్రయాణం చేసేలా ఉచిత ప్రజా రవాణాను ప్రవేశపెట్టిన తొలిదేశం ఐరోపాలోని లక్సెంబర్గ్ అనే ఒక చిన్న దేశం. కాలుష్యాన్ని, కార్ల ద్వారా ఏర్పడుతున్న రద్దీని అరికట్టడానికి లక్సెంబర్గ్ తీసుకున్న ఈ నిర్ణయం 2020 ఫిబ్రవరి 29 నుంచి అమల్లోకి వచ్చింది. లక్సెంబర్గ్ జనాభా దాదాపు 6లక్షలు. ప్రతి వెయ్యి మందిలో 662 మందికి కార్లు ఉన్నాయి. దీంతో వ్యక్తిగత వాహనాలు భారీ సంఖ్యలో రహదార్లపైకి రావడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. వీటిని అధిగమించేందుకు వీలుగా.. బస్సులు, రైళ్ల వంటి ప్రజా రవాణా వ్యవస్థ ద్వారా ప్రజలు ప్రయాణించేలా ప్రోత్సహించేందుకు ఆ దేశ ప్రభుత్వం ఉచిత ప్రజా రవాణా వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీల నుంచి లక్షలాది మంది ప్రతి రోజూ ఉద్యోగాలు చేసేందుకు లక్సెంబర్గ్‌కు కార్లలో వస్తుంటారు. ఈ సమస్యను పరిష్కరించేలా ఉచిత ప్రజా రవాణాను ప్రవేశపెట్టారు.

➠ **ప్రముఖ బహుళ జాతి కంపెనీ ఐబీఎంకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా 2020 జనవరి 31న ఎవరు నియమితులయ్యారు?**
1. రాజీవ్ సూరి 2. అజయ్ బంగా
3. అరవింద్ కృష్ణ 4. నికేశ్ అరోరా
**సమాధానం: 3**

- అమెరికాకు చెందిన టెక్ దిగ్గజ కంపెనీ ఇంటర్నేషనల్ బిజినెస్ మెషీన్స్(ఐబీఎం) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో)గా భారత్‌కు చెందిన అరవింద్ కృష్ణ జనవరి 31న నియమితులయ్యారు. ప్రస్తుత సీఈవో గిన్నీ రోమెట్టి స్థానంలో ఆయన ఏప్రిల్ 6న బాధ్యతలు స్వీకరిస్తారు. అరవింద్ కృష్ణ ప్రస్తుతం ఐబీఎం క్లౌడ్, కాగ్నిటివ్ సాఫ్ట్‌వేర్ విభాగానికి అధిపతిగా ఉన్నారు. ఆయన ఐఐటీ కాన్పూర్‌లో డిగ్రీ చదివి,అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1990లో ఐబీఎంలో చేరి.. 30 ఏళ్లుగా అదే సంస్థలో పనిచేస్తున్నారు. అమెరికాలోని పలు అతిపెద్ద బహుళజాతి కంపెనీలకు ఇప్పుడు భారతీయులే సీఈవోలు. మైక్రోసాఫ్ట్‌కు సత్యనాదెళ్ల, గూగుల్‌కు సుందర్‌పిచాయ్, అడోబ్ సిస్టమ్‌కు శంతను నారాయణ్, మాస్టర్ కార్డ్‌కు అజయ్ బంగా సారథ్యం వహిస్తున్నారు.

➠ **2020 టేలర్ ప్రైజ్ ఏ భారత పర్యావరణ వేత్తకు దక్కింది?**
1. చండీ ప్రసాద్ భట్ 2. వందనా శివ
3. ప్రదీప్ క్రిషన్ 4. పవన్ సుఖ్‌దేవ్
**సమాధానం: 4**

- ప్రముఖ భారతీయ పర్యావరణ ఆర్థికవేత్త పవన్ సుఖ్‌దేవ్‌కు ప్రతిష్టాత్మక టేలర్ ప్రైజ్ లభించింది. ఆయన ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం(యూఎన్ఈపీ) సంస్థకు ప్రచారకర్త. టేలర్ ప్రైజ్‌ను పర్యావరణానికి సంబంధించి నోబెల్ బహుమతిగా పరిగణిస్తారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు హరిత ఆర్థిక వ్యవస్థ(గ్రీన్ ఎకానమీ)ను ప్రతిపాదించినందుకుగాను ఈ పురస్కారం లభించింది. పర్యావరణం దెబ్బతింటుండటంవల్ల ఆర్థిక వ్యవస్థపై ఏర్పడుతున్న దుష్ప్రభావాలను కార్పొరేట్ సంస్థల అధిపతులు, రాజకీయ విధాన నిర్ణేతల దృష్టికి తీసుకెళ్లేలా పవన్ సుఖ్‌దేవ్ కృషిచేశారు. అమెరికాకు చెందిన జీవ శాస్త్రవేత్త గ్రెచెన్ డైలీతో కలిసి ఆయన 2020 మే1న టేలర్ ప్రైజ్‌ను అందుకోనున్నారు. ఈ బహుమతి కింద లభించే రెండు లక్షల డాలర్లను ఇద్దరూ పంచుకుంటారు. టేలర్ ప్రైజ్‌ను పర్యావరణ రంగంలో నోబెల్ బహుమతిగా పరిగణిస్తారు.



➠ **2020 ఫిబ్రవరిలో బ్రిటన్ ఆర్థిక మంత్రిగా ఎవరు నియమితులయ్యారు?**
1. అలోక్ శర్మ 2. ప్రీతి పటేల్
3. రిషి సునక్ 4. ప్రీత్ కౌర్ గిల్
**సమాధానం: 3**

- యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్ 2020 ఫిబ్రవరి13న భారత సంతతికి చెందిన రిషి సునక్‌ను ఛాన్సలర్ ఆఫ్ ద ఎక్స్‌చెకర్(ఆర్థిక మంత్రి)గా నియమించారు. 39ఏళ్ల రిషి సునక్ ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడైన నారాయణ మూర్తి అల్లుడు. తొలిసారిగా ఆయన 2015లో బ్రిటన్ పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగాలన్న బోరిస్ జాన్సన్ నిర్ణయాన్ని రిషి గట్టిగా సమర్థించారు. 2019 డిసెంబర్ ఎన్నికల్లో మరోసారి విజయం సాధించారు. రిషి సునక్‌తోపాటు మరో ముగ్గురు భారత సంతతికి చెందిన పార్లమెంట్ సభ్యులకు బ్రిటన్ మంత్రి వర్గంలో చోటు దక్కింది. వారు.. హోంమంత్రి ప్రీతి పటేల్, వాణిజ్య, ఇంధన, పరిశ్రమల శాఖ మంత్రి అలోక్ శర్మ, అటార్నీ జనరల్ సుయేలా బ్రేవర్‌మన్.

➠ **ప్రపంచ ఆర్థిక వేదిక 50వ వార్షిక సదస్సును ఎక్కడ నిర్వహించారు?**
1. జెనీవా 2. బేసల్
3. దావోస్ 4. ఫ్రాంక్‌ఫర్ట్
**సమాధానం: 3**

- ప్రపంచ ఆర్థిక వేదిక(వరల్డ్ ఎకనమిక్ ఫోరం-డబ్ల్యుఈఎఫ్) ఒక లాభాపేక్షలేని సంస్థ. దీన్ని 1971లో జర్మనీకి చెందిన క్లాస్ ష్వాబ్ స్థాపించాడు. వ్యాపార సంస్థలు కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా... సామాజిక బాధ్యతతో మెలగాల్సిన అవసరం ఉందనే ఉద్దేశంతో డబ్ల్యుఈఎఫ్ ఏర్పడింది. ఈ సంస్థ వార్షిక సదస్సులు ప్రతి ఏటా జనవరిలో స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వత శ్రేణిలోని దావోస్ నగరంలో జరుగుతాయి. 50వ వార్షిక సదస్సు 2020 జనవరి 21 నుంచి 24 వరకు దావోస్‌లో జరిగింది. మూడు వేల మంది ప్రపంచ దేశాల నాయకులు, విధానకర్తలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆర్థిక నిపుణులతోపాటు వివిధ రంగాల్లోని ప్రముఖులు దావోస్ సదస్సుకు హాజరయ్యారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్, పాకిస్థాన్ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. భారత్ నుంచి వాణిజ్య మంత్రి పియూష్ గోయల్, తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు.

➠ **2020 ఫిబ్రవరిలో అలన్ బోర్డర్ పతకాన్ని అందుకున్న ఆస్ట్రేలియా క్రికెటర్ ఎవరు?**
1. స్టీవ్ స్మిత్ 2. డేవిడ్ వార్నర్
3. ప్యాట్ కమ్మిన్స్ 4. ఆరోన్ ఫంచ్
**సమాధానం: 2**

- 2020 సంవత్సరానికి గాను ఆస్ట్రేలియా క్రికెట్‌లో అత్యుత్తమ అవార్డు అయిన అలన్ బోర్డర్ మెడల్‌ను ఆ జట్టు ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ డేవిడ్ వార్నర్ అందుకున్నాడు. ఈ ప్రతిష్టాత్మక పురస్కారం వార్నర్‌కు గతంలో రెండుసార్లు 2016,2017లో కూడా దక్కింది. ఉత్తమ మహిళా క్రికెటర్ అవార్డు ఆల్ రౌండర్ ఎలిసీ పెర్రీకి లభించింది. ఆమెకు బెలిందా క్లార్క్ అవార్డును అందజేశారు. ఈ అవార్డును ఎలిసీ పెర్రీ గెలుచుకోవడం ఇది మూడోసారి.

➠ **అండర్ -19 ప్రపంచ కప్ క్రికెట్ గెలుచుకున్న బంగ్లాదేశ్ జట్టు కెప్టెన్ ఎవరు?**
1. తన్‌జీద్ హసన్ 2. షహదత్ హుస్సేన్
3. మహ్మదుల్ హసన్ జాయ్ 4. అక్బర్ అలీ
**సమాధానం: 4**

- 13వ అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను 2020 జనవరి17 నుంచి ఫిబ్రవరి 9 వరకూ దక్షిణాఫ్రికాలో నిర్వహించారు. ఇందులో 16 జట్లు పాల్గొన్నాయి. ఫిబ్రవరి 9న పోచెఫ్‌స్ట్రూమ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు మూడు వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించి తొలిసారి ప్రపంచకప్‌ను గెలుచుకుంది. ఫైనల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా బంగ్లాదేశ్ కెప్టెన్ అక్బర్ అలీని ప్రకటించారు. భారత బ్యాట్స్‌మెన్ యశస్వీ జైస్వాల్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును సొంతం చేసుకున్నాడు. యశస్వీ 6 మ్యాచ్‌ల్లో 400 పరుగులు చేసి.. టోర్నీలో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్ రవి బిష్ణోయ్ అత్యధిక వికెట్లు(17) తీసుకున్నాడు. భారత జట్టుకు ప్రియమ్ గార్గ్ సారథ్యం వహించాడు. అత్యధికసార్లు(4) అండర్-19 ప్రపంచ కప్‌ను గెలుచుకున్న ఘనత భారత్‌దే. 2000, 2008, 2012, 2018 టోర్నీల్లో భారత్ విజేతగా నిలిచింది.



ఎన్.విజయేందర్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ



# ‘నో ఎంట్రీ’



ధోని... ధోని... ధోని...
అనే అరుపులుండవ్!
కోహ్లి... కోహ్లి... కోహ్లి...
అనే వారే కనిపించరు!
హిట్... రోహిత్... రోహిత్...
అనే జోష్ కూడా ఉండదు!
‘యూ ఆర్ ద కింగ్స్... బట్ వుయ్ ఆర్ ద సూపర్ కింగ్స్’
అనే ప్లకార్డులు ఇకపై ఉండవు
మెక్సికన్ వేవ్స్‌కు ఛాన్సే లేదు
అభిమాన ఫ్రాంచైజీల టీ షర్ట్స్ కూడా ప్రేక్షకుల గ్యాలరీలో కనువిందు చేయవు
శివమణి డ్రమ్స్ వాయించడు
చీర్ లీడర్స్ సందడీ ఉండదు
చప్పట్లు... చడీచప్పుడు లేకుండానే గప్‌చుప్‌గా ఈ సీజన్ ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతాయి. లేదంటే లేదు. అంతే మరి!
మీకర్థమవుతోందా!
ఇదంతా కరోనా వైరస్ కాటేనని!

## ఖాళీ స్టేడియాల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు!

### ప్రేక్షకులకు ప్రవేశం లేదు

### జనం మధ్య ఆట కుదరదన్న క్రీడల మంత్రి

### రేపు పాలకమండలి భేటీలో తుది నిర్ణయం

**న్యూఢిల్లీ:** ‘కరోనా’ ఎంత పని చేసింది. 2019 ఏడాది ముగింపులో వచ్చిన ఈ వైరస్... వచ్చి రాగానే మనుషుల్ని మింగేస్తోంది. అంతటితో ఆగకుండా ఒక్కో రంగాన్ని ముంచేస్తూ వచ్చింది. ‘కోవిడ్19’ దెబ్బకు పర్యాటక, వర్తక, వాణిజ్య, ఆర్థిక రంగాలే కాదు... క్రీడల రంగం కూడా కునారిల్లుతోంది. ఇప్పుడు ఈ వైరస్ సెగ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు తగిలింది. ఇన్నేళ్లుగా ప్రతీ వేసవిని ధనాధన్ మెరుపులతో అలరించిన ఈ లీగ్ ఇప్పుడైతే అటు స్పాన్సర్లని, ఫ్రాంచైజీలనే కాదు... ఇటు పాలకమండలినీ దడదడలాడిస్తోంది. మొత్తం మీద ఆట సాగినా... మునుపటిలా జరగనే జరుగదు. కళ తప్పిన ‘షో’గా ఇంకా చెప్పాలంటే గేట్లన్నీ మూసేసి గుట్టుగా... గప్‌చుప్‌గా జరుగుతుంది.

### ఆటకు మాత్రమే అనుమతి: క్రీడాశాఖ

ప్రాణాంతక వైరస్ ‘కోవిడ్19’ చూస్తుండగానే ‘గ్లోబ్’ను చుట్టేసింది. చైనాలో పుట్టి ప్రపంచమంతా పాకింది. వేల మందిని చంపేసింది. లక్ష మందికిపైగా సోకింది. కొన్ని దేశాలైతే ప్రజల్ని బయటికే రాకుండా గృహనిర్బంధంలో ఉంచుతున్నాయి. కరోనా దెబ్బకు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో ప్రతిష్టాత్మక క్రీడా ఈవెంట్లు వాయిదా పడ్డాయి. కొన్నయితే ఈ ఏడాదికి రద్దయిపోయాయి కూడా! విదేశీ రాకపోకలతో ఈ మధ్యే భారత్‌కు వచ్చింది. దీని ప్రభావం తెలిసిన భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. అందుకే ఐపీఎల్‌పై నాన్చకుండానే తేల్చేసింది. ఆటను ఆపం... కానీ ప్రేక్షక సమూహాన్ని మాత్రం అనుమతించబోమని స్పష్టం చేసింది. ‘జన సమూహం మధ్య ఎలాంటి క్రీడల ఈవెంట్లకు అనుమతి లేదు. అయితే ఏ క్రీడను, లీగ్‌ను అడ్డుకోం. ప్రేక్షకుల్లేకుండా పోటీలను నిర్వహించుకోవచ్చు’ అని కేంద్ర క్రీడాశాఖ వెల్లడించింది. ఈ శాఖ కార్యదర్శి రాధేశ్యామ్ మాట్లాడుతూ ‘జాతీయ ఆరోగ్య మిషన్, ఆరోగ్య శాఖ మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సహా జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్) లన్నింటికీ స్పష్టంగా తెలియజేశాం. ప్రేక్షకుల మధ్య లీగ్, పోటీల నిర్వహణ కుదరదని చెప్పాం’ అని అన్నారు.

### జోష్ ఉండదు బాసూ...

క్రీడాశాఖ ఉత్తర్వుల నేపథ్యంలో ఈ సీజన్ ఐపీఎల్ జన సమూహం మధ్య జరిగే అవకాశం కనిపించడం లేదు. అభిమాన ఫ్రాంచైజీ కలర్లను తమ చెక్కిళ్లపై అందంగా వేయించుకుని స్టేడియంలోకి ప్రవేశించే మార్గం ఇప్పుడు మూతపడింది. అభిమాన క్రికెటర్లను దగ్గర నుంచి చూసే భాగ్యం ఇప్పుడు దూరమవుతుంది. బ్యాటింగ్‌లో మెరుపులు కనిపించినా... అరుపులు వినిపించవు. వరుస బౌండరీలు బాదినా చప్పట్లు కరవు! చుక్కల్ని తాకేలా సిక్సర్లు వెళ్లినా స్టేడియం దద్దరిల్లదు. ఇలా ఏం చేసినా... ఏం చూసినా బుల్లితెరపైనో లేదంటే స్మార్ట్‌ఫోన్‌లోనే చూడాలి. ఒళ్లంతా కళ్లు చేసుకునే అవసరమే ఉండదు. ఆసక్తిగొలిపే ‘ప్రత్యక్ష వీక్షణ’ అనుభూతే అసలు ఉండదు. ఇంకా చెప్పాలంటే ఆ జోషే ఉండదు. ఏదో సరిపెట్టుకోవడం తప్పా!

### పాలకమండలి చేసేదేమీ లేదు

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇప్పటికిప్పుడు ఏ నిర్ణయం తీసుకోకపోయినా... ఇంతకుమించి చేసేదేమీ లేదు కూడా! ఈ నెల 14న జరిగే ఐపీఎల్ పాలకమండలి సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించినప్పటికీ... బిజీ షెడ్యూలు వల్ల అటు వాయిదా వేయలేదు. ఇటు వేరే దేశంలో నిర్వహించనూ లేరు. ఎన్నికల సందర్భంగా 2009, 2014లలో విదేశాల్లో నిర్వహించింది. కానీ ఇప్పుడున్న ‘కరోనా మహమ్మారి’ దృష్ట్యా ఏ దేశం నిర్వహణకు సిద్ధంగా లేదు. కాబట్టి ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకోవాల్సిందే. ప్రేక్షకుల్లేకుండానే ఈ సీజన్ ధనాధన్ కాస్త చప్పగా సాగే అవకాశముంది.

### కరోనా బాధితుడు మ్యాచ్ చూశాడు

మహిళా దినోత్సవం రోజు భారత్, ఆస్ట్రేలియా అమ్మాయిల జట్ల మధ్య జరిగిన ప్రపంచకప్ టి20 ఫైనల్ మ్యాచ్‌ను ఓ కరోనా బాధితుడు చూసినట్లు తేలడంతో కలకలం రేగింది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరిగిన మ్యాచ్‌లో నార్తర్న్ స్టాండ్‌లోని లెవెల్–2లో నుంచి మ్యాచ్‌ను తిలకించిన వ్యక్తికి కరోనా నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ రిపోర్ట్ వచ్చిందని స్టేడియం వర్గాలు తెలిపాయి. దీనిపై ఆస్ట్రేలియా ఆరోగ్య శాఖ (డీహెచ్‌హెచ్ఎస్) సమీక్షిస్తోంది.

### వాళ్లు ఆడాలంటే... ఆగాల్సిందే!

ఐపీఎల్ 13వ సీజన్ ఈ నెల 29న ప్రారంభమవుతుంది. అయితే రెండు వారాలపాటు జరిగే మ్యాచ్‌లు పూర్తిగా భారత ఆటగాళ్లతోనే జరుగనున్నాయి. ఎందుకంటే కరోనా భయాందోళనల వల్ల విదేశీయులకు మంజూరు చేసే వీసాలపై ఆంక్షలు విధించారు. కరోనా లేదని సర్టిఫికెట్ జతచేస్తేనే వీసాలిచ్చే అంశాల్ని భారత ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది. దీంతో ఏప్రిల్ 15 తర్వాతే విదేశీ ఆటగాళ్లు భారత్‌లో అడుగుపెట్టే అవకాశముంది.

## ఖేల్ ఖతమ్...

### ‘కరోనా’ కారణంగా కుదేలవుతున్న క్రీడా సంబరాల జాబితా చూస్తే...




- భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఈ నెల 15, 18 తేదీల్లో రెండో, మూడో వన్డే జరగాల్సి ఉంది. లక్నో, కోల్‌కతాలో జరిగే ఈ మ్యాచ్‌లకు స్టేడియంలో ప్రేక్షకులను అనుమతించరాదని బీసీసీఐ నిర్ణయించింది. టికెట్ల అమ్మకాలు నిలిపివేశారు.
- ముంబైలో సచిన్, లారా తదితర మాజీ క్రికెటర్లతో జరుగుతున్న రోడ్ సేఫ్టీ వరల్డ్ సిరీస్ టోర్నీ కూడా రద్దయింది. ముందుగా ప్రేక్షకులు లేకుండా ఆడించాలని భావించినా...చివరకు నిర్వాహకులు రద్దుకే మొగ్గు చూపారు.
- రాజ్‌కోట్‌లో బెంగాల్, సౌరాష్ట్ర మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ చివరి రోజైన నేడు మైదానంలో ప్రేక్షకులకు ప్రవేశం లేదు.
- ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీని ప్రేక్షకులు లేకుండా నిర్వహిస్తామని భారత్ బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) బుధవారం ప్రకటించినా... కేంద్ర ప్రభుత్వ తాజా వీసా నిబంధనలతో విదేశీ ఆటగాళ్లు వచ్చే అవకాశం కనిపించడం లేదు. దాంతో టోర్నీ నిర్వహణ కూడా సందేహమే.
- ప్రపంచంలోనే అతి పెద్ద, అమెరికాలోని ప్రతిష్టాత్మక నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లీగ్ ఈ సీజన్‌కు సంబంధించి మ్యాచ్‌లన్నీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం అతి పెద్ద నిర్ణయం.
- ప్రతిష్టాత్మక ఫార్ములా 1 సీజన్‌లో భాగంగా మెల్‌బోర్న్‌లో జరగాల్సిన తొలి గ్రాండ్‌ప్రి రద్దయింది. ముందుగా మెక్లారెన్ జట్టు సభ్యుడొకరు కరోనా బారిన పడటంతో ఆ జట్టు మాత్రమే తప్పుకునేందుకు సిద్ధమైనా... ఇతర జట్ల ఒత్తిడితో నిర్వాహకులు మొత్తంగా రద్దు చేసేశారు.
- చెన్నై, కోల్‌కతా జట్ల మధ్య ఈ శనివారం గోవాలో జరగాల్సిన ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫైనల్ మ్యాచ్‌కు కూడా ప్రేక్షకులను అనుమతించడం లేదు.
- భారత దేశవాళీ ఫుట్‌బాల్ టోర్నీ ఐ లీగ్‌లో జరగాల్సిన 28 మ్యాచ్‌లను ఖాళీ స్టేడియాల్లో నిర్వహిస్తారు.
- ప్రఖ్యాత స్పానిష్ లీగ్ ‘లా లిగా’ మ్యాచ్‌లు రద్దయ్యాయి. దాంతో రియల్ మాడ్రిడ్ ఫుట్‌బాల్ జట్టు సభ్యులు బయటకు రాకుండా స్వచ్ఛందంగా ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలోకి వెళ్లిపోయారు. రియల్ మాడ్రిడ్‌కే చెందిన బాస్కెట్ బాల్ జట్టు ఆటగాడు ఒకరికి కరోనా ఉన్నట్లు తేలింది. ఈ రెండు జట్లకు ఒకే చోట వసతి ఏర్పాట్లు ఉన్నాయి.
- ఖతార్‌లో మార్చి 26నుంచి జరగాల్సిన యూరో 2020 వార్మప్ టోర్నీ రద్దయింది. కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో ఖతార్‌లోనే త్వరలో నిర్వహించాల్సిన వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లను వాయిదా వేయాలని దక్షిణ అమెరికా ఫుట్‌బాల్ గవర్నింగ్ బాడీ (కాన్‌మెబాల్) ‘ఫిఫా’కు విజ్ఞప్తి చేసింది.
- జోర్డాన్‌లో ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఆడి భారత్‌కు తిరిగి వస్తున్న మన బాక్సర్లందరూ తమ ఇళ్లకే పరిమితం కావాలని, బయటకు వెళ్లరాదని భారత బాక్సింగ్ సమాఖ్య ఆదేశించింది.
- కరోనా కారణంగానే ఈనెల 16 నుంచి జరగాల్సిన టాలెంట్ సిరీస్, చాంపియన్‌షిప్ సిరీస్, సూపర్ సిరీస్, నేషనల్ సిరీస్, ‘ఐటా’ పురుషుల, మహిళల ఈవెంట్‌లను రద్దు చేస్తున్నట్లు అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) ప్రకటించింది.



# వర్షార్పణం

- భారత్, దక్షిణాఫ్రికా తొలి వన్డే రద్దు
- రోజంతా తెరిపినివ్వని వాన
- రెండో వన్డే ఆదివారం

**ధర్మశాల:** ఊహించినట్లే జరిగింది... భారత్, దక్షిణాఫ్రికా పోరుకు వరుణుడు సహకరించలేదు. గురువారం ఇక్కడి హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘం (హెచ్‌పీసీఏ) స్టేడియంలో జరగాల్సిన తొలి వన్డే మ్యాచ్ భారీ వర్షం కారణంగా రద్దయింది. మ్యాచ్‌లో ఒక్క బంతి కాదు కదా కనీసం టాస్ వేసే అవకాశం కూడా లేకుండానే ఆట ముగిసిపోయింది. ఉదయంనుంచి నిరంతరాయంగా కురిసిన వాన ఏ దశలోనూ తెరిపినివ్వలేదు. కనీసం వర్షం ఆగితే పిచ్‌ను పరిశీలించాలని అంపైర్లు భావించగా...అదీ సాధ్యం కాలేదు. నిర్ణీత సమయంకంటే అదనంగా దాదాపు నాలుగు గంటల పాటు వేచి చూసిన అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు తమ నిర్ణయాన్ని ప్రకటించారు.

ధర్మశాల అభిమానులకు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ తీవ్ర నిరాశ ఎదురైంది. గత సెప్టెంబరులో మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇక్కడే భారత్, దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్ జరగాల్సింది. అప్పుడు కూడా భారీ వర్షంతో మ్యాచ్ రద్దయింది. ఇప్పుడు కూడా అదే పునరావృతం కావడంతో వారంతా నిరాశగా వెనుదిరిగారు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే ఆదివారం లక్నోలో జరుగుతుంది. అయితే కరోనా కారణంగా ఎలాగూ ఈ మ్యాచ్‌ను అభిమానులు ప్రత్యక్షంగా చూసే అవకాశమే లేదు.

# బెంగాల్‌కు 72 పరుగులు... సౌరాష్ట్రకు 4 వికెట్లు!


అనుస్తుప్

- రసకందాయంలో రంజీ ట్రోఫీ ఫైనల్
- టైటిల్ కోసం ఇరు జట్ల పోరాటం
- నేడు ఆటకు చివరి రోజు

**రాజ్‌కోట్:** సౌరాష్ట్ర, బెంగాల్ మధ్య జరుగుతోన్న రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్ రసకందాయంలో పడింది. ఇప్పటికే నాలుగు రోజులు గడవడంతో మ్యాచ్‌లో విజేత తేలే పరిస్థితి లేదు... అయితే తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన జట్టుకే రంజీ ట్రోఫీ దక్కనుండటంతో ఇరు జట్లు కూడా కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంపై దృష్టి పెట్టాయి. ఈ క్రమంలో బెంగాల్‌కు 72 పరుగుల కావాల్సి ఉండగా... సౌరాష్ట్రకు 4 వికెట్లు అవసరం. నేడు ఆటకు చివరి రోజు. 291 పరుగులు వెనుకబడి... 134/3 స్కోరుతో గురువారం ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్ ఆట ముగిసే సమయానికి 147 ఓవర్లలో 6 వికెట్లకు 354 పరుగులు చేసింది. ప్రస్తుతం అనుస్తుప్ మజుందార్ (58 బ్యాటింగ్; 8 ఫోర్లు), అర్నబ్ నంది (28 బ్యాటింగ్; 3 ఫోర్లు, సిక్స్) క్రీజులో ఉన్నారు.

### ఆదుకున్న సుదీప్, సాహా

అంతకుముందు నాలుగో రోజు ఆటను ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ సుదీప్ చటర్జీ (81; 7 ఫోర్లు), వృద్ధిమాన్ సాహా (64; 10 ఫోర్లు, సిక్స్) నిలకడగా ఆరంభించారు. ఈ రంజీ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న సాహాకు గురువారం ఆటలో అదృష్టం బాగా కలిసొచ్చింది. రెండు సార్లు ఎల్బీడబ్ల్యూ అప్పీల్ నుంచి తప్పించుకున్న అతడికి... సౌరాష్ట్ర ఫీల్డర్ల నుంచి రనౌట్, క్యాచ్ రూపాల్లో రెండు లైఫ్‌లు లభించాయి. దీనిని ఆసరాగా చేసుకున్న సాహా... సుదీప్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 101 పరుగులు జోడించాడు. అయితే స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ పెవిలియన్‌కు చేరడంతో పాటు షహబాజ్ అహ్మద్ (16; 2 ఫోర్లు) అవుట్ అవడంతో... మ్యాచ్ మరోసారి సౌరాష్ట్ర వైపుకు మళ్లింది. ఈ దశలో జత కట్టిన అనుస్తుప్, అర్నబ్ మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. 10 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద తాను ఇచ్చిన క్యాచ్‌ను మొదటి స్లిప్‌లో ఉన్న హార్విక్ దేశాయ్ నేలపాలు చేయడంతో బతికి బయటపడ్డ అనుస్తుప్... ఆ తర్వాత కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతడు అర్నబ్‌తో కలిసి ఏడో వికెట్‌కు అభేద్యంగా 91 పరుగులు జోడించాడు. నేడు జరిగే ఆఖరి రోజు ఆటలో బెంగాల్ 72 పరుగులు సాధిస్తే... 30 ఏళ్ల తర్వాత తొలిసారి రంజీ ట్రోఫీ విజేతగా నిలుస్తుంది. చివరిసారిగా 1989–90 సీజన్‌లో బెంగాల్ టైటిల్ సాధించింది. అయితే పిచ్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉండటం... చేతిలో నాలుగు వికెట్లు మాత్రమే ఉండటం బెంగాల్ చారిత్రక విజయానికి ప్రతికూల అంశాలుగా ఉన్నాయి.

# క్వార్టర్స్‌లో సింధు



- లక్ష్యసేన్ ఓటమి
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ

**బర్మింగ్‌హామ్:** ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్, ప్రపంచ చాంపియన్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టింది. గురువారం జరిగిన మహిళల ప్రిక్వార్టర్స్ పోరులో సింధు 21–19, 21–15తో సుంగ్ జి హ్యూన్ (దక్షిణ కొరియా)పై వరుస గేముల్లో విజయం సాధించింది. తొలి గేమ్‌లో సింధుకు ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైంది. 19–19తో సమానంగా ఉన్న సమయంలో వరుసగా రెండు పాయింట్లు సాధించిన సింధు గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన సింధు ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా గేమ్‌తో పాటు మ్యాచ్‌నూ గెలుచుకుంది. పురుషుల విభాగంలో భారత షట్లర్ లక్ష్యసేన్‌కు ప్రిక్వార్టర్స్‌లో చుక్కెదురైంది. అతడు 17–21, 18–21తో రెండో సీడ్ విక్టర్ అక్సెల్సన్ (డెన్మార్క్) చేతిలో ఓడాడు. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో అశ్విని పొన్నప్ప–సిక్కిరెడ్డి (భారత్) ద్వయం 13–21, 14–21తో మిసాకి మత్సుటోమో–అయాక తకహాషి (జపాన్) చేతిలో ఓడింది.

### సైనా అవుట్

భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సైనా 11–21, 8–21తో మూడో సీడ్ అకానె యామగుచి (జపాన్) చేతిలో ఓడింది. యామగుచి దూకుడు ముందు నిలువలేకపోయిన సైనా... మ్యాచ్‌ను 23 నిమిషాల్లోనే ప్రత్యర్థికి అప్పగించేసి టోర్నీ నుంచి నిష్క్రమించింది. పురుషుల విభాగంలో భారత షట్లర్లు భమిడిపాటి సాయిప్రణీత్, పారుపల్లి కశ్యప్‌లకు కూడా నిరాశే ఎదురైంది. సాయిప్రణీత్ 12–21, 13–21తో జావో జున్‌పెంగ్ (చైనా) చేతిలో ఓడగా... రుస్తావిటో (ఇండోనేసియా)తో జరిగిన మ్యాచ్‌లో కశ్యప్ గాయంతో ఆరంభంలోనే వెనుదిరిగాడు. కేవలం నిమిషం పాటు సాగిన ఈ మ్యాచ్‌లో కశ్యప్ 0–3తో వెనుకబడిన సమయంలో మ్యాచ్ నుంచి వైదొలిగాడు.

# ఒలింపిక్ జ్యోతి వెలిగింది



**ఒలింపియా (గ్రీస్):** కరోనా దెబ్బకు ప్రపంచ వ్యాప్తంగా జరగాల్సిన స్పోర్ట్స్ ఈవెంట్స్ వాయిదా పడుతుండటంతో ఒలింపిక్స్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయా అనే సందేహాల మధ్య ఒలింపిక్స్ తొలి ఘట్టాన్ని నిర్వహించారు. ఒలింపిక్స్ పుట్టినిల్లు ఒలింపియా నుంచి టోక్యో ఒలింపిక్ జ్యోతి తన ప్రయాణాన్ని మొదలు పెట్టింది. ఈ మేరకు జ్యోతి వెలిగించే కార్యక్రమం గురువారం జరిగింది. కరోనా నేపథ్యంలో ఈ కార్యక్రమానికి ప్రేక్షకులను అనుమతించలేదు. గ్రీస్ ఒలింపిక్ షూటింగ్ చాంపియన్ అన్నా కొరాక ఈ కార్యక్రమంలో పాల్గొంది. ఈ తరహాలో ఒక మహిళను జ్యోతి వెలిగించే కార్యక్రమంలో భాగం చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ జ్యోతి వారం రోజుల పాటు గ్రీసు దేశంలోని 37 నగరాలు, 15 చారిత్రక ప్రదేశాల మీదుగా... దాదాపు 3,500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. అనంతరం ఈ నెల 19న జపాన్‌లోని ఫుకుషిమాకు చేరుతుంది. అక్కడి నుంచి ఒలింపిక్స్ జరిగే టోక్యోకు చేరుతుంది.

**Andhra Pradesh State FiberNet Limited**
**Vijayawada**
APSFL
Proposals are invited from interested agencies for Rate contract for UPS Batteries. Details may be downloaded from the website: www.apsfl.in or e-procurement platform. All other details will be uploaded only on the website of APFL or e-procurement platform. For any quires Email: apsfl@ap.gov.in
Sd/- Managing Director
DIPR Ro.No.441-PP/CL/ADVT/1/1/2019-20, Dt:12.03.2020

**సమగ్ర శిక్షా**
**స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీస్**
KBC బాయ్స్ హైస్కూల్ క్యాంపస్, రైతు బజార్ ఎదురుగా, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్
**ఇ–ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**
No. SSA-16021/4/2019-MIS SEC-SSA, తేది: 12-03-2020
**ప్రతిపాదన కోసం అభ్యర్థన**
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ వారు 2020–21 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ/ MPP/ ZPP/మున్సిపల్/KGBVలు/ మోడల్ స్కూల్స్/ రెసిడెన్షియల్/ ఎయిడెడ్ స్కూల్స్‌లో I నుండి X తరగతులు చదివే విద్యార్థులు (సుమారుగా 40 లక్షల మంది) అందరికీ “జగనన్న విద్యా కానుక” పథకం క్రింద (1) ఒక సెట్ నోట్ బుక్స్ (2) ఒక జత షూ మరియు రెండు జతల సాక్సులు (3) బెల్ట్ మరియు (4) స్కూల్ బ్యాగ్ సేకరణ మరియు సరఫరా కోసం ప్రతిపాదనలను కోరుతున్నారు. వివరాల కోసం 14-3-2020 నుండి **https://tender.apeprocurement.gov.in** చూడవలెను. టెండరు/ RFP ఫారాన్ని వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. అర్హతగల సంస్థలు పైన తెలిపిన సైట్‌లో ఇచ్చిన షెడ్యూల్స్ ప్రకారం నిర్ణీత నమూనాల్లో తమ ప్రతిపాదనలను అప్‌లోడ్ చేయవచ్చును. ఏదైనా తదుపరి సమాచారం కోసం 0866-2428599 నంబరును సంప్రదించవలెను.
సం/– వాడ్రేవు చినవీరభద్రుడు, IAS,
స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
DIPR RO No. 440pp/CL/Advt/1/1/2019-20 Dt: 12-03-2020

**SPORTS AUTHORITY OF ANDHRA PRADESH**
**IGMC STADIUM, LABBIPET, BANDAR ROAD, VIJAYAWADA**
**Short Tender Notice (1st Recall)**
Tender are hereby invited from reputed and experienced companies for the following tenders.

| S No | Tender ID | Name of the work | Bid Starting Date | Bid End Date | Bid Opening Date |
|---|---|---|---|---|---|
| 1 | 322868 | Procurement of Sports Kits for conduct of AP Legislators Sports Meet for the Year 2019-20 in the state for Sports Authority of Andhra Pradesh | 13.03.2020 | 20.03.2020 | 20.03.2020 |

Tender documents are available on e-procurement platform tender.**ape-procurement.gov.in** Tenders will be opened in the presence of company representatives who attend the evaluation For further details contact: 0866-2499699.
Sd/- Vice Chairman and Managing Director
DIPR Ro No.439PP/CL/Advt/1/1/2019-20, Dt:12.03.2020

సాక్షి బిజినెస్
శుక్రవారం
13-3-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|---|
| | 2,919 ▼ | 868 ▼ |
| | 32,778 | 9,590 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

| సూచీ | ముగింపు | నష్టం |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,437 | ▼ 520 |
| డోజోన్స్ | 21,905 | ▼ 1,647 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 5,237 | ▼ 639 |
| డాక్స్ | 9,161 | ▼ 1,278 |
| షాంఘై | 2,923 | ▼ 45 |
| నికాయ్ | 18,560 | ▼ 856 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 73.43 | 75.08 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 93.62 | 96.85 |
| € | యూరో | ఎస్‌బీఐ | 82.50 | 85.48 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 70.51 | 73.18 |
| AUS$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.00 | 49.14 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 52.21 | 53.98 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.75 | 20.61 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.88 | 21.11 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.47 | 11.24 |



# మహమ్మారి ముంచేసింది!

## సెన్సెక్స్, నిఫ్టీ మహా పతనం

- కరోనా వైరస్‌ను మహమ్మారిగా ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
- యూరప్ ప్రయాణాలపై అమెరికా ఆంక్షలు • మాంద్యంలోకి ఎకానమీ!
- బేర్ దశలోకి అమెరికా మార్కెట్ • భారీగా పతనమైన ప్రపంచ మార్కెట్లు
- 56 పైసలు క్షీణించిన రూపాయి • ఇంట్రాడేలో సెన్సెక్స్ 3,204 పాయింట్లు డౌన్
- 2,919 పాయింట్లు పతనమై 32,778 వద్ద ముగింపు
- 9,600 కిందకు నిఫ్టీ • 868 పాయింట్ల నష్టంతో 9,590 వద్ద క్లోజ్

కోవిడ్–19 (కరోనా) వైరస్‌ను మహమ్మారి వ్యాధిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించడంతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు అల్లకల్లోలమయ్యాయి. ఇక ఈ వైరస్ వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగంగా యూరప్ నుంచి ప్రయాణాలను నెల రోజుల పాటు అమెరికా రద్దు చేయడంతో ఆర్థిక మందగమన భయాలు ఉవ్వెత్తున ఎగిశాయి. దీంతో అమెరికా స్టాక్ మార్కెట్ బుధవారం బేర్ దశలోకి చేరింది. ఫలితం...గురువారం మన మార్కెట్ కనీవినీ ఎరుగని స్థాయిలో నష్టపోయింది. మన మార్కెట్ కూడా బేర్ దశలోకి జారిపోయింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 33,000 పాయింట్లు, నిఫ్టీ 9,600 పాయింట్ల దిగువకు పడిపోయాయి. ఇంట్రాడేలో 3,204 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ చివరకు 2,919 పాయింట్ల నష్టంతో 32,778 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 868 పాయింట్లు క్షీణించి 9,590 పాయింట్లకు పడిపోయింది. స్టాక్ మార్కెట్ చరిత్రలోనే సెన్సెక్స్, నిఫ్టీలు అత్యధిక పాయింట్లు నష్టపోయాయి. ఇన్వెస్టర్ల సంపద రూ.11 లక్షల కోట్ల మేర హరించుకుపోయింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో 82 పైసలు క్షీణించి 74.50కు పడిపోవడం, ముడి చమురు ధరలు 8 శాతం పతనం కావడం కూడా ప్రతికూల ప్రభావం చూపాయి. వివరాలు...

**ఏడాది కనిష్టానికి అన్ని సూచీలు....**

శాతం పరంగా చూస్తే, సెన్సెక్స్ 8.2 శాతం, నిఫ్టీ 8.3 శాతం చొప్పున నష్టపోయాయి. ఈ రెండు సూచీలు రెండున్నర సంవత్సరాల కనిష్ట స్థాయికి చేరాయి. సెన్సెక్స్, నిఫ్టీలు ఒక్క రోజులో ఇన్నేసి పాయింట్లు పతనం కావడం ఇదే మొదటిసారి. కాగా గత 3 ట్రేడింగ్ సెషన్లలో ఈ సూచీలు అత్యధిక పాయింట్లు నష్టపోవడం ఇది రెండోసారి. ఈ నెల 9(సోమవారం) సెన్సెక్స్, నిఫ్టీలు అత్యధిక పాయింట్లు నష్టపోవడం తెలిసిందే. గురువారం అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్‌సూచీ జీవిత కాల కనిష్టానికి, వాహన సూచీ 6 ఏళ్ల కనిష్టానికి, లోహ సూచీ మూడేళ్ల కనిష్టానికి, నిఫ్టీ బ్యాంక్ సూచీ రెండేళ్ల కనిష్టానికి పడ్డాయి. అన్ని రంగాల నిఫ్టీ సూచీలు ఏడాది కనిష్టానికి చేరాయి.

- సెన్సెక్స్ ఇంట్రాడే 3204
- నిఫ్టీ ఇంట్రాడే 950
- డోజోన్స్ ఇంట్రాడే 2150
- నాస్‌డాక్ ఇంట్రాడే 640
- ఎఫ్‌టీఎస్‌ఈ బ్రిటన్ 639 క్లోజింగ్
- సీఏసీ ఫ్రాన్స్ 566 క్లోజింగ్
- డాక్స్ జర్మనీ 1278 క్లోజింగ్
- నికాయ్ జపాన్ 856 క్లోజింగ్
- హాంగ్‌సెంగ్ హాంకాంగ్ 923 క్లోజింగ్
- ఎస్‌జీఎక్స్ నిఫ్టీ సింగపూర్ 522 క్లోజింగ్

## నష్టాలు ఎందుకంటే...

- **కోవిడ్–19 వైరస్...మహమ్మారి...**
కోవిడ్–19 వైరస్‌ను మహమ్మారి వ్యాధిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) ప్రకటించింది. అసలే ఆర్థిక మందగమనంతో సతమతమవుతున్న అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కోవిడ్ –19 వైరస్ కల్లోలంతో మాంద్యంలోకి జారిపోతుందనే ఆందోళనతో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఇక భారత్‌లో కోవిడ్–19 వైరస్ కేసులు 73కు పెరిగాయి. ఇక ప్రపంచ వ్యాప్తంగా చూస్తే, ఈ వైరస్ సోకిన వ్యక్తులు 1.26 లక్షలకు చేరగా, మరణించిన వారి సంఖ్య 4,600కు చేరింది.
- **'యూరప్' ప్రయాణాలపై నిషేధం**
కోవిడ్–19 వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి యూరప్ నుంచి అమెరికాకు అన్ని రకాల ప్రయాణాలపై నెల రోజుల పాటు అమెరికా నిషేధం విధించింది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలు పర్యాటకంపై ఆంక్షలు విధించాయి. ఫలితంగా ఆర్థిక కార్యకలాపాలన్నీ అతలాకుతలమవుతాయని ఆందోళనలు చెలరేగుతున్నాయి.
- **బేర్ దశలోకి అమెరికా మార్కెట్....**
బుధవారం ఆరంభంలోనే అమెరికా స్టాక్ సూచీలు 7 శాతం నష్టపోతే, ట్రేడింగ్‌ను 15 నిమిషాల పాటు నిలిపేశారు. ఆ తర్వాత ట్రేడింగ్ మొదలైనా ఈ సూచీలు 6–8 శాతం మేర పతనమయ్యాయి. ఇటీవలి గరిష్ట స్థాయిల నుంచి చూస్తే, బుధవారం అమెరికా స్టాక్ సూచీలు 20 శాతం మేర నష్టపోయి బేర్ దశలోకి జారిపోయాయి.
- **ప్రపంచ మార్కెట్ల పతనం**
కోవిడ్–19 వైరస్‌ను మహమ్మారి వ్యాధిగా డబ్ల్యూహెచ్‌ఓ ప్రకటించడం, అమెరికా స్టాక్ మార్కెట్ బేర్ దశలోకి ప్రవేశించడంతో ప్రపంచ మార్కెట్లు అల్లకల్లోలమయ్యాయి. ఆసియా మార్కెట్లు 1.5–4.4% నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు 6% నష్టాలతో మొదలై 11–12% నష్టాల్లో ముగిశాయి.
- **విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు.....**
విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) గత నెల 24 నుంచి మన మార్కెట్‌లో పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. కరోనా కల్లోల భయాలే దీనికి కారణం. 13 ట్రేడింగ్ సెషన్లలో ఎఫ్‌పీఐలు రూ.36,252 కోట్ల మేర పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.



సెన్సెక్స్ భారీ పతనాలు

## పసిడి, క్రూడ్.. క్రాష్



కోవిడ్–19 భయాల నేపథ్యంలో అన్ని ఇన్వెస్ట్‌మెంట్ సాధనాల నుంచీ డబ్బును వెనక్కుతీసుకుని, క్యాష్‌గానే భద్రపరచుకోడానికి ఇన్వెస్టర్లు మొగ్గుచూపుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నిజానికి ఆర్థిక వ్యవస్థల తిరోగమన భయాల నేపథ్యంలో... పసిడి ధర భారీగా పెరగాల్సి ఉంది. అయితే ఇందుకు భిన్నంగా గురువారం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.1 గ్రా) ధర ఈ వార్త రాసే రాత్రి 10 గంటల సమయానికి 4 శాతం పతనమై (65 డాలర్లు) 1,577 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో 1,560 డాలర్ల కనిష్టాన్ని కూడా చూడ్డం గమనార్హం. రెండు వారాల క్రితం పసిడి 1,704 డాలర్ల స్థాయిని నమోదు చేసుకుంది. ఇక లైట్ స్వీట్ నైమెక్స్ క్రూడ్ బ్యారల్ ధర కూడా 35 డాలర్ల కీలక స్థాయిని అధిగమించలేక గురువారం ఒక దశలో 30 స్థాయికి పడిపోయింది. మరోవైపు ఆరు దేశాల కరెన్సీతో ట్రేడయ్యే డాలర్ ఇండెక్స్ 98 వద్ద ట్రేడవుతుండడం గమనార్హం.

## ఒడిదుడుకులు తగ్గేదాకా వేచి చూడండి...!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూరప్ నుంచి ప్రయాణాలపై నిషేధం విధించడంతో ప్రపంచ మార్కెట్లతో పాటు భారత మార్కెట్ కూడా బేర్ దశలోకి జారిపోయిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ఎనలిస్ట్ దీపక్ జసాని పేర్కొన్నారు. మాంద్యం భయాలు ముప్పిరిగొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా మార్కెట్ మరింతగా పతనమయ్యే అవకాశాలున్నాయని బే కాపిటల్ ఎనలిస్ట్ సిద్ధార్థ మెహతా అంచనా వేస్తున్నారు. రానున్న 5–10 ఏళ్లలో మంచి అవకాశాలు అందిపుచ్చుకోగలిగిన, కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలు అత్యున్నతంగా ఉన్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయాలని సూచించారు. అయితే ఒడిదుడుకులు సద్దుమణిగే దాకా వేచి చూస్తే మేలని ట్రేడింగ్‌బుల్స్ సీఈఓ అమిత్ గుప్తా సూచించారు.

**నష్టాల్లో టాప్-10 షేర్లు** — 12 మార్చి — BSE SENSEX 32,778.14 (-2919.26)

| ధర | షేరు | % |
|---|---|---|
| 212.75 | ఎస్‌బీఐ | -13.23% |
| 62.60 | ఓఎన్‌జీసీ | -12.63% |
| 542.85 | యాక్సిస్ బ్యాంక్ | -12.27% |
| 156.25 | ఐటీసీ | -11.07% |
| 1769.85 | టీసీఎస్ | -9.45% |
| 1078.20 | టైటాన్ | -9.31% |
| 2350.00 | బజాజ్ ఆటో | -9.29% |
| 1013.15 | ఎల్‌అండ్‌టీ | -9.29% |
| 425.00 | ఐసీఐసీఐ బ్యాంక్ | -8.68% |
| 165.85 | పవర్ గ్రిడ్ | -8.62% |



## 11,00,000 కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్ భారీ పతనం కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.11.27 లక్షల కోట్ల మేర ఆవిరైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ విలువ రూ.11,27,161 కోట్లు హరించుకుపోయి రూ.1,25,86,398 కోట్లకు పడిపోయింది. సోమవారం రూ.7 లక్షల కోట్ల మేర ఆవిరైన సంపదను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ వారంలో ఇప్పటివరకూ మొత్తం రూ.18 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద హారతి కర్పూరమైంది.




## రూపాయి.. చరిత్రాత్మక కనిష్టం

**ముంబై:** డాలర్ మారకంలో రూపాయి బలహీన ధోరణి కొనసాగుతోంది. గురువారం ఒకేరోజు 56 పైసలు పతనమయ్యింది. 74.24 వద్ద ముగిసింది. గడచిన 17 నెలల కనిష్ట స్థాయి ఇది. ఇంకా చెప్పాలంటే, రూపాయి ఆల్‌టైమ్ కనిష్టం ముగింపునకు (74.39) 15పైసలు దూరంలో ఉంది. నిజానికి గురువారం ట్రేడింగ్ ఒకదశలో రూపాయి విలువ చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.50 పడింది. అటుపై 26పైసలు కోలుకుని 74.24 వద్ద ముగిసింది. క్రూడ్ ధరల భారీ పెరుగుదల నేపథ్యంలో 2018 అక్టోబర్ 9న రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. నిజానికి అంతర్జాతీయ క్రూడ్ ధరల పతనం రూపాయి విలువకు సానుకూలం కావాల్సి ఉంది. అయితే చైనా కరోనా వైరస్ భయాలు, మొత్తంగా ప్రపంచ వృద్ధిపై కోవిడ్–19 ప్రభావం పడుతుందన్న భయాలు, తాజా అమెరికా ట్రావెల్ బ్యాన్, ఈక్విటీ మార్కెట్ల బలహీనత, సురక్షిత సాధనంగా డాలర్‌కు డిమాండ్ తత్సంబంధ అంశాలు రూపాయి తాజా పతనానికి కారణం అవుతుండడం గమనార్హం.

# పర్యాటకం ఢమాల్!

- ఏవియేషన్, ట్రావెల్‌కు భారీ దెబ్బ
- వీసాల రద్దుతో సమస్యలు
- రూ. 8,500 కోట్ల నష్టాల అంచనా



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ దెబ్బతో దేశీ పర్యాటక రంగం కుదేలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. నెలరోజులపాటు వీసాలు రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ట్రావెల్, టూరిజం, ఏవియేషన్ రంగాలు దాదాపు రూ. 8,500 కోట్లు నష్టపోయే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమవర్గాలు తెలిపాయి. కంపెనీలు.. రిక్రూట్‌మెంట్ నిలిపివేయడం, అంతగా అవసరం ఉండని సిబ్బందిని తొలగించడం వంటి చర్యలు తీసుకోనుండటంతో ఆయా రంగాల్లో భారీగా ఉద్యోగాల కోతలు కూడా ఉండొచ్చని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఏఐటీవో), అసోచాం వంటి పరిశ్రమల సమాఖ్యలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో వీసాలపై నెల రోజుల నిషేధాన్ని పది రోజుల తర్వాతైనా పునఃసమీక్షించాలని, కొన్ని నగరాల నుంచైనా భారత్‌కి ప్రయాణాలను అనుమతించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాయి. కరోనా వైరస్ బైటపడినప్పటికీ ఇప్పటిదాకా ఎంతో కొంతైనా పర్యాటకం కొనసాగుతుండటం వల్ల సిబ్బందిని, ఖర్చులను కాస్తయినా నిర్వహించుకోగలుగుతున్నామని.. వీసాల రద్దుతో గట్టి దెబ్బే తగలనుందని అసోచాం టూరిజం, హాస్పిటాలిటీ కౌన్సిల్ చైర్మన్ సుభాష్ గోయల్ చెప్పారు.

**దేశీ ఏవియేషన్ క్రాష్:** అత్యవసరంగా వెళ్లాల్సిన పనుల మీద తప్పించి.. సాధారణ ప్రయాణాలను ప్రజలు వాయిదా వేసుకుంటున్న నేపథ్యంలో దేశీ విమానయానం ఈ మధ్య కాలంలో 15% వరకు తగ్గిపోయిందని అంచనా. ముఖ్యంగా ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి ప్రధాన నగరాల నుంచి రాకపోకలు గణనీయంగా తగ్గిపోయాయి. టికెట్లు బుక్ చేసుకున్న కస్టమర్లు కూడా ఆఖరి నిమిషంలో రద్దు చేసుకుంటున్నారని ఎయిర్‌లైన్స్ చెబుతున్నాయి. ఆక్యుపెన్సీ రేటు తగ్గిపోతున్న కారణంగా విమాన సేవలు నడిపేందుకయ్యే కనీస ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదని, ఫలితంగా ఎయిర్‌లైన్స్ ఆదాయాలు పడిపోతున్నాయని జేఎం ఫైనాన్షియల్స్ ఒక నివేదికలో పేర్కొంది. ఇదే పరిస్థితి ఇంకొన్నాళ్లు కొనసాగితే.. కరోనా వైరస్ మహమ్మారి ధాటికి బ్రిటన్‌కు చెందిన విమానయాన సంస్థ ఫ్లైబీ మాదిరిగానే ఇక్కడి సంస్థలు కూడా కుప్పకూలొచ్చని తెలిపింది.

**బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో తగ్గిన ట్రాఫిక్..**
బెంగళూరు విమానాశ్రయంలో అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య 50 శాతం తగ్గిపోయింది. కరోనావైరస్ భయాలతో పలు దేశాలు ట్రావెల్‌పరమైన ఆంక్షలు విధించడం, పలు ఫ్లయిట్లు రద్దు కావడం తదితర అంశాలు దీనికి కారణం. ఇటు దేశీయంగా ప్రయాణించే వారి సంఖ్య కూడా 2–4 శాతం తగ్గిందని, కరోనా కేసులు పెరిగిన పక్షంలో ఇది ఇంకా పెరగవచ్చని బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (బీఐఏఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. దేశీ విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్యాసింజర్ల సంఖ్య గతంలో రోజుకు 70,000 స్థాయిలో ఉండగా.. ప్రస్తుతం 62,000కు తగ్గిపోయినట్లు పౌర విమానయాన మంత్రి హర్‌దీప్ సింగ్ తెలిపారు. ఇది 40,000కు కూడా పడిపోవచ్చన్నారు.

**వోల్వో బస్సు టికెట్ రేటుకే..**
ఆఖరి నిమిషంలో టికెట్ల రద్దుతో నిర్వహణ ఖర్చులైనా రాబట్టుకునేందుకు ఎయిర్‌లైన్స్ ప్రయత్నిస్తున్నాయి. ఉదాహరణకు.. చెన్నై నుంచి బెంగళూరుకు వోల్వో బస్సు టికెట్ ధర రూ.1,100 ఉండగా.. ఇదే ధరకు పలు కంపెనీల విమాన టికెట్ లభిస్తోంది. ఇంకా చాలా రూట్లలో ఇదే తరహాలో విమాన టికెట్ల రేట్లు పడిపోయాయి.

## 'బేర్' గుప్పిట్లోకి..

ఈ ఏడాది జనవరిలో సెన్సెక్స్, నిఫ్టీలు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిలను తాకాయి. ఈ ఏడాది జనవరి 20న నిఫ్టీ జీవిత కాల గరిష్ట స్థాయి, 12,431 పాయింట్లకు చేరింది. ఈ గరిష్ట స్థాయిల నుంచి చూస్తే గురువారం నాడు నిఫ్టీ 22 శాతం మేర నష్టపోయింది. ఈ దృష్ట్యా చూస్తే, మన స్టాక్ మార్కెట్ బేర్ దశలోకి జారిపోయిందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా షేర్ గానీ, సూచీ గాని ఇటీవలి గరిష్ట స్థాయి నుంచి 20 శాతం పతనమైతే, బేర్ దశ ప్రారంభమైనట్లుగా పరిగణిస్తారు. మన మార్కెట్ బేర్ దశలోకి జారిపోవడం ఇదే మొదటిసారి కాదు. 2015లో, 2010లో కూడా బేర్ దశలోకి జారిపోయింది. ఈ బేర్ దశ చాలా కాలం కొనసాగవచ్చు. సాధారణంగా బేర్ మార్కెట్ రెండేళ్ల పాటు ఉంటుంది. 2015 బేర్ మార్కెట్ నుంచి 2017లో మన స్టాక్ మార్కెట్ కోలుకుంది. ఇక తాజా బేర్ మార్కెట్ ఎక్కువ కాలం కొనసాగకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. కోవిడ్–19 వైరస్ కల్లోలం సద్దుమణగగానే మార్కెట్ మళ్లీ పుంజుకోగలదని వారంటున్నారు.

## మాంద్యంలోకి వెళ్లిపోయాం

### మార్క్ మొబియస్ అభిప్రాయం



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లడం ఖాయమేనని వర్ధమాన మార్కెట్ల ఫండ్ మేనేజర్, మార్క్ మొబియస్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ వ్యవస్థాపకుడు మార్క్ మొబియస్ అన్నారు. ''మనకు మాంద్యం రాబోతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. సాంకేతికంగా చెప్పాలంటే భారత్ సహా ప్రపంచంలో అధిక భాగం మాంద్యంలోనే ఉంది. అలా అని మనం చేతులు పైకెత్తేసి ఓటమిపాలైనట్టు కాదు. ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుంది. సరఫరా వ్యవస్థ ప్రాముఖ్యత, చైనాపై ఏ విధంగా ఆధారపడి ఉన్నామనే దానిపై ప్రజలు మేల్కొంటున్నారు. అడుగు ముందుకు వేసి కొంత మేర ఈ ఔట్‌సోర్స్ వ్యాపార అవకాశాలను సొంతం చేసుకునేందుకు భారత్‌కు ఇది అద్భుతమైన అవకాశం'' అని మొబియస్ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈటీఎఫ్‌ల కారణంగా నేడు అమెరికా మార్కెట్లు ప్రపంచ మార్కెట్లను నడిపిస్తున్నాయన్నారు. దీంతో యూఎస్ మార్కెట్లు పడిపోతే.. అమెరికా మార్కెట్లను అనుసరించే అన్ని మార్కెట్లలోనూ భయానక పరిస్థితి నెలకొనడం సహజమేనన్నారు. ఇక మీదట మార్కెట్లు కనిష్ట స్థాయికి చేరుకుంటాయని అంచనా వేశారు.

epaper.sakshi.com

## బులియన్ రూ.లలో

| | | | |
|---|---|---|---|
| **ముంబై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 44,570 | ▼ | 210 |
| బంగారం (22 క్యారెట్లు) | 42,450 | ▼ | 200 |
| వెండి (కిలో) | 48,900 | ▼ | 600 |
| **హైదరాబాద్/చెన్నై** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,650 | ▼ | 70 |
| బంగారం (22 క్యారెట్లు) | 41,570 | ▼ | 70 |
| వెండి (కిలో) | 48,900 | ▼ | 600 |
| **ప్రొద్దుటూరు** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 43,000 | ▼ | 300 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,810 | ▼ | 290 |
| వెండి (కిలో) | 46,500 | ▼ | 900 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | | |
| బంగారం (24 క్యారెట్లు) | 45,080 | ▲ | 20 |
| బంగారం (22 క్యారెట్లు) | 41,570 | ▼ | 70 |
| వెండి (కిలో) | 46,800 | ▼ | 400 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 30.90 (రాత్రి 11.30కు) | $ 32.98 (బుధవారం ముగింపు) |
| బ్రెంట్ | 32.72 (రాత్రి 11.30కు) | $ 35.79 (బుధవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 13-3-2020

| | |
|---|---|
| విశాఖ | 355–00 |
| చిత్తూరు | 323–00 |
| వరంగల్ | 298–00 |
| విజయవాడ | 324–00 |
| గోదావరి | 324–00 |
| 12-3-2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 295–00 |

# 'యస్'బీఐ ప్రణాళికకు ఓకే..

- యస్ బ్యాంకులో 725 కోట్ల షేర్ల కొనుగోలు
- రూ. 7,250 కోట్ల ఖరీదు
- ఆమోదముద్ర వేసిన ఎస్‌బీఐ ఈసీసీబీ



**ముంబై:** సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేట్ రంగ యస్ బ్యాంకులో ఇన్వెస్ట్ చేసేందుకు తమ ఈసీసీబీ నుంచి అనుమతి వచ్చినట్లు ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వెల్లడించింది. ఈ ప్రణాళిక ప్రకారం యస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐ 725 కోట్ల షేర్లను కొనుగోలు చేయనుంది. షేరు ఒక్కింటికి రూ. 10 చొప్పున మొత్తం రూ. 7,250 కోట్లు చెల్లించనుంది. యస్ బ్యాంక్ పెయిడ్ క్యాపిటల్‌లో 49 శాతం లోపే ఎస్‌బీఐ వాటా ఉండనుంది. 'నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి యస్ బ్యాంక్‌లో రూ. 7,250 కోట్లతో 725 కోట్ల షేర్లను కొనుగోలు చేసేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆఫ్ సెంట్రల్ బోర్డు (ఈసీసీబీ) ఆమోదముద్ర వేసింది' అని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎస్‌బీఐ తెలియజేసింది. ఆర్‌బీఐ రూపొందించిన యస్ బ్యాంక్ పునరుద్ధరణ ప్రణాళిక ముసాయిదా ప్రకారం వ్యూహాత్మక ఇన్వెస్టర్లు బ్యాంకులో 49 శాతం వాటాలు కొనుగోలు చేయాల్సింటుంది. ఆ తర్వాత మూడేళ్ల లోపు దీన్ని 26 శాతానికి లోపు తగ్గించుకోవడానికి ఉండదు. మొండిబాకీలు, గవర్నెన్స్ లోపాలు, నిధుల కొరతతో సతమతమవుతున్న యస్ బ్యాంకుపై ఏప్రిల్ 3 దాకా ఆర్‌బీఐ మారటోరియం విధించిన సంగతి తెలిసిందే.

**మరింత మంది ఇన్వెస్టర్ల ఆసక్తి ..**

యస్ బ్యాంకులో ఇన్వెస్ట్ చేసేందుకు దేశీ సంపన్నులు (హెచ్ఎన్ఐ), ప్రముఖ ఆర్థిక సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు విశ్లేషకులు తెలిపారు. షేరు ధర రూ. 26 స్థాయికి చేరి, వాస్తవ విలువ వెల్లడి కావడంతో ఇన్వెస్టర్లు ముందుకు వస్తున్నట్లు ఐఐఎఫ్‌ఎల్ సెక్యూరిటీస్ డైరెక్టర్ సంజీవ్ భాసిన్ తెలిపారు. స్థానిక ఇన్వెస్టర్లు, మ్యూచువల్ ఫండ్స్, ఏఎంసీలు, రాధాకిషన్ దమానీ (డీమార్ట్), రాకేష్ ఝున్‌ఝున్‌వాలా వంటి హెచ్ఎన్ఐలతో పాటు ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ వంటి ఆర్థిక సంస్థలు వీటిలో కూడా ఉన్నాయన్నారు. పెట్టుబడుల కోసం పలువురు ఇన్వెస్టర్లతో చర్చలు జరుపుతున్నామంటూ యస్ బ్యాంక్ అడ్మినిస్ట్రేటర్ ప్రశాంత్ కుమార్ గతంలోనే వెల్లడించిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఈ శనివారం వెల్లడి కానున్న యస్ బ్యాంక్ మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలపై అందరి దృష్టి ఉంది.

**క్యూ3లో రూ. 1,000 కోట్ల నష్టాల అంచనా..**

అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో బ్యాంకు సుమారు రూ. 1,000 కోట్ల నష్టాన్ని నమోదు చేయొచ్చని ఒక అనలిస్టు అంచనా వేశారు. మరోవైపు, అడాగ్ ఎన్‌బీఎఫ్‌సీతో పాటు కొన్ని రియల్ ఎస్టేట్ ఖాతాలు భారీ మొండిబాకీలుగా మారడం, నిరర్థక ఆస్తులకు మరింతగా ప్రొవిజనింగ్ చేయాల్సి రానుండటం వంటి అంశాలతో డిసెంబర్ త్రైమాసికంలో యస్ బ్యాంక్ సుమారు రూ. 778 కోట్ల మేర నష్టాలు ప్రకటించవచ్చని ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది. ఎస్‌బీఐ యాంకర్ ఇన్వెస్టరుగా ఉండటం వల్ల తదుపరి మరింతగా పెట్టుబడులు సమీకరించేందుకు కూడా సులభం కావొచ్చని వివరించింది. అలాగే ఎస్‌బీఐకి వాటాలు ఉండటం సైతం డిపాజిటర్లకు కాస్త ఊరటనిస్తుందని తెలిపింది.

# ఏవియేషన్ షో..అంతంతే !

- ప్రతిష్టాత్మక కార్యక్రమానికి కోవిడ్ –19 ఎఫెక్ట్
- సాధారణ ప్రజానీకానికి నో ఎంట్రీ
- బిజినెస్ విజిటర్లూ అంతంతే
- నిరాశపర్చిన వింగ్స్ ఇండియా



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** రెండేళ్లకోసారి హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో ప్రతిష్టాత్మకంగా జరిగే వింగ్స్ ఇండియా సదస్సు, ప్రదర్శనకు కరోనా ఎఫెక్ట్ పడింది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం గురువారం (మార్చి 12న) ప్రారంభమైంది. విభిన్న విమానాల ప్రదర్శనతో అటు బిజినెస్ విజిటర్లనూ, ఇటు సాధారణ ప్రజానీకాన్ని ఆకట్టుకునే ఏవియేషన్ షో కళ తప్పింది. వింగ్స్ ఇండియా షోలో ఎంత కాదన్నా ప్రతిసారి 25–30 విమానాలు, హెలికాప్టర్లు దర్శనమిచ్చేవి. ఈసారి ఈ సంఖ్య ఎనిమిదికి పరిమితమైందంటే పరిస్థితికి అద్దం పడుతోంది. భారీ లోహ విహంగాలతో ఆ ప్రాంతం అంతా సందడిగా ఉండేది. 2020 వింగ్స్ ఇండియా చిన్న విమానాలు, హెలికాప్టర్లతో సర్దుకుపోతోంది. అటు కరోనా భయంతో బిజినెస్ విజిటర్ల రాక తగ్గింది. ముఖ్యంగా విదేశీ విజిటర్ల సంఖ్య భారీగా పడిపోయింది. ప్రతిసారి ఎంత కాదన్నా రోజుకు 2,000కిపైగా బిజినెస్ విజిటర్లు వచ్చేవారని ఓ కంపెనీ ప్రతినిధి తెలిపారు. ఈసారి ఈ సంఖ్య 200లలోపు ఉందని చెప్పారు.

**స్టాల్స్ కూడా తగ్గాయి..**

వింగ్స్ ఇండియా కార్యక్రమం ప్రతిసారి ఎంతకాదన్నా 150కిపైగా స్టాల్స్‌తో సందడిగా ఉండేది. ఈసారి 110 స్టాల్స్ మాత్రమే ఏర్పాటయ్యాయని నిర్వాహకులు తెలిపారు. సందర్శకుల తాకిడి లేకపోవడంతో చాలా చోట్ల స్టాళ్లు ఖాళీగా కనపడ్డాయి. వింగ్స్ ఇండియా సదస్సు, ప్రదర్శనకు మొదటి రెండు రోజులు వ్యాపార వర్గాలకు, తర్వాతి రెండు రోజులు సాధారణ ప్రజానీకానికి అనుమతిచ్చేవారు. కరోనా ఎఫెక్ట్‌తో సాధారణ ప్రజానీకానికి ఈమారు అనుమతించడం లేదు. ప్రధాన కంపెనీలు బిజినెస్ టూ బిజినెస్ సమావేశాలకు పరిమితమయ్యాయి. మరోవైపు కరోనీ భయం వెంటాడుతున్నప్పటికీ అందుకు తగ్గ చర్యలు కానరాలేదు.

## పారిశ్రామిక ఉత్పత్తి... కొంచెం ఊరట



**న్యూఢిల్లీ:** పారిశ్రామిక ఉత్పత్తి జనవరిలో కొంచెం ఊరట కలిగించింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధిరేటు 2 శాతంగా నమోదయ్యింది. గడచిన 6 నెలలుగా దేశం ఈ స్థాయి పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటును కూడా చూడకపోవడం గమనార్హం. మైనింగ్, విద్యుత్ ఉత్పత్తి కొంచెం పుంజుకోవడం కొంత ఊరటనిచ్చింది. 2019 జూలైలో 4.9% వృద్ధి రేటు నమోదయింది. అటు తర్వాత ఆగస్టు (–1.4%), సెప్టెంబర్ (–4.6%), అక్టోబర్ (–6.6%)నెలల్లో వృద్ధిలేకపోగా క్షీణత నమోదయ్యింది. అయితే నవంబర్ (1.8%), డిసెంబర్ (0.1 %), జనవరి (1.6%) వృద్ధిరేట్లు నమోదయ్యాయి.

## ద్రవ్యోల్బణం... తగ్గినా తలనొప్పే!



**న్యూఢిల్లీ:** వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 6.58 శాతంగా నమోదయ్యింది. అంటే సూచీలో ఉన్న వస్తువుల బాస్కెట్ ధర 2019 ఫిబ్రవరితో పోల్చితే 2020 ఫిబ్రవరిలో 6.58 శాతం పెరిగిందన్నమాట. జనవరిలో నమోదయిన 7.59 శాతంకన్నా ఫిబ్రవరిలో తగ్గినప్పటికీ, ఈ స్థాయి (6.58 శాతం) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు కేంద్రం నిర్దేశిత స్థాయి (ప్లస్ 2 లేదా మైనస్ 2తో 2 శాతం) కన్నా ఎక్కువగానే ఉండడం గమనార్హం. జనవరితో పోల్చితే ఫిబ్రవరిలో కూరగాయలు ఇతర కొన్ని నిత్యావసర వస్తువుల ధరల తగ్గాయని గురువారం వెలువడిన గణాంకాలు వెల్లడించాయి. జనవరిలో కూరగాయల ధరల పెరుగుదల రేటు 50.19 శాతం ఉంటే, ఫిబ్రవరిలో ఈ పెరుగుదల రేటు 31.61 శాతంగానే ఉంది.

## గోల్డ్ ఈటీఎఫ్‌లకు పెట్టుబడుల వరద

**ఫిబ్రవరిలో 1,483 కోట్లు రాక**



**న్యూఢిల్లీ:** కరోనా వైరస్‌తో అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్యం రావచ్చన్న భయాలు బంగారాన్ని ఆకర్షణీయంగా మార్చేస్తున్నాయి. ఇన్వెస్టర్లు బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఫలితమే ఫిబ్రవరి నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి భారీగా రూ.1,483 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. బంగారం ఈటీఎఫ్‌ల్లోకి వరుసగా పెట్టుబడులు రావడం ఇలా నాలుగో నెలలోనూ కొనసాగింది. ఈ ఏడాది జనవరిలో రూ.202 కోట్లు, 2019 డిసెంబర్‌లో రూ.27 కోట్లు, నవంబర్‌లో రూ.7.68 కోట్ల మేర నికరంగా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు వచ్చాయి. కానీ, అంతక్రితం వరకు పెట్టుబడుల ఉపసంహరణ జరిగింది. 2019 అక్టోబర్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి నికరంగా రూ.31 కోట్ల పెట్టుబడులు బయటకు వెళ్లిపోయాయి. అనిశ్చిత పరిస్థితుల్లో బంగారాన్ని సురక్షిత పెట్టుబడి సాధనంగా ఆశ్రయించే ధోరణి గురించి తెలిసిందే.

## ప్రైవేటు బ్యాంకుల నుంచి డిపాజిట్లు తరలించొద్దు

- రాష్ట్రాలను కోరిన ఆర్‌బీఐ
- డబ్బులు సురక్షితమేనని భరోసా



**న్యూఢిల్లీ:** ప్రైవేటు రంగ బ్యాంకుల పట్ల ఉన్న భయాందోళనలు చాలా తప్పుగా అన్వయించబడినవిగా ఆర్‌బీఐ స్పష్టతనిచ్చింది. భయంతో ప్రైవేటు బ్యాంకుల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు తమ డిపాజిట్లను తరలించడం చేయవద్దని కోరింది. ఒకవేళ ఈ దిశగా నిర్ణయం తీసుకున్నా లేదా తీసుకోబోతున్నా పునఃపరిశీలించాలని సూచించింది. ప్రైవేటు బ్యాంకుల నుంచి డిపాజిట్లను తరలిస్తే అది బ్యాంకింగ్ రంగం, ఫైనాన్షియల్ రంగం స్థిరత్వంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుందంటూ రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య కార్యదర్శులకు రాసిన లేఖలో ఆర్‌బీఐ పేర్కొంది. ఇటీవలే ప్రైవేటు రంగ యస్ బ్యాంకులో సంక్షోభంతో ఆర్‌బీఐ ఆ బ్యాంకు డిపాజిట్ల ఉపసంహరణపై ఆంక్షలు పెట్టిన విషయం తెలిసినదే. ఈ నేపథ్యంలో తమ పరిధిలోని ప్రైవేటు బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లను ప్రభుత్వరంగ బ్యాంకుల్లోకి మార్చాలంటూ ప్రభుత్వ రంగ సంస్థలకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సూచించినట్టు వార్తలు వెలుగు చూశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ లేఖ రాసినట్టు తెలుస్తోంది. ''ప్రైవేటు రంగ బ్యాంకుల పర్యవేక్షణ, నియంత్రణ విషయంలో ఆర్‌బీఐకి తగినన్ని అధికారాలున్నాయి. ఈ అధికారాలను వినియోగించుకోవడం ద్వారా డిపాజిటర్ల డబ్బులన్నీ సురక్షితమేనని భరోసా ఇస్తోంది'' అంటూ ఆర్‌బీఐ తన లేఖలో స్పష్టం చేసింది.

## భారత్‌కు వారానికో విమానం: ఎయిర్‌బస్



ఆనంద్ స్టాన్లీ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ప్రపంచ వ్యాప్తంగా రోజుకో విమానాన్ని ఎయిర్‌బస్ డెలివరీ చేస్తోంది. భారత్‌లోని విమానయాన సంస్థలకు వారానికి ఒక విమానాన్ని సరఫరా చేస్తున్నట్టు ఎయిర్‌బస్ ఇండియా ఎండీ ఆనంద్ స్టాన్లీ తెలిపారు. దేశం నుంచి తమ సంస్థకు 738 విమానాలకు ఆర్డర్లున్నట్టు వింగ్స్ ఇండియా కార్యక్రమంలో తెలిపారు. 'ఎయిర్‌బస్ దేశంలో 7,000 పైగా ఉద్యోగావకాశాలను కల్పించింది. రూ.4,810 కోట్లకుపైగా విలువైన విడిభాగాలను 45కు పైగా కంపెనీల నుంచి ఏటా కొనుగోలు చేస్తున్నాం. 2025 నాటికి ఇది రూ.7,400 కోట్లకు చేరనుంది. 2,000 స్టార్టప్స్ చేతులు కలిపాయి. 2038 నాటికి ఇక్కడి మార్కెట్‌కు కొత్తగా 1,880 ప్యాసింజర్, కార్గో విమానాలు అవసరమవుతాయి. విమాన ప్రయాణికుల వృద్ధి ఏటా ప్రపంచ సగటు 4.3 శాతముంటే, భారత్ విషయంలో ఇది 7.7 శాతముంటుంది. దేశీయంగా ప్రయాణీకుల వృద్ధి 8.2 శాతం నమోదు కానుంది. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్ భారత్' అని వివరించారు.

## విలీనం తర్వాతా సజావుగానే రుణ వితరణ

**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనం (పీఎస్‌బీ) తర్వాత కూడా రుణాల పంపిణీ సజావుగానే సాగుతుందని, కస్టమర్లకు సేవల అనుభవం మెరుగుపడుతుందని కేంద్ర ఆర్థిక శాఖ భరోసా ఇచ్చింది. ప్రభుత్వరంగంలోని 10 బ్యాంకులు ఏప్రిల్ 1 నుంచి విలీనమై 4 బ్యాంకులుగా మారనుండడం తెలిసిందే. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం విలీన బ్యాంకుల చీఫ్‌లతో ఢిల్లీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలీనమయ్యే బ్యాంకులు తమ సన్నద్ధత గురించి మంత్రికి వివరాలు అందించగా, విలీనం చేసుకునే బ్యాంకులు రుణ వితరణ, కస్టమర్లకు మెరుగైన సేవలపై ఎటువంటి ప్రభావం పడదని భరోసా ఇచ్చినట్టు కేంద్ర ఆర్థిక శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.

రాష్ట్రీయం



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో పార్వతీ రాజరాజేశ్వరుల కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం 10.50 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా కల్యాణం జరిపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు స్వామి వారికి పట్టు వస్త్రాలు, జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ తలంబ్రాలు సమర్పించారు. ఈసారి లక్ష మంది భక్తులు పాల్గొన్నారని అంచనా. కాగా, శుక్రవారం మధ్యాహ్నం 3.05 గంటలకు స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నారు. **- వేములవాడ**

**వైభవంగా 'రాజన్న' కల్యాణం**

# ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

## ముగ్గురు దుర్మరణం

- ఇద్దరు మహిళలకు గాయాలు
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వద్ద ప్రమాదం



గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కావేరమ్మపేట వద్ద ఓ ఇంటిని ఢీకొట్టిన లారీ

**జడ్చర్ల:** మహబూబ్‌నగర్ జిల్లాలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఓ లారీ బీభత్సం సృష్టించింది. పనసకాయల లోడ్ తీసుకెళ్తున్న ఈ లారీ సర్వీస్ రోడ్డును ఆనుకొని ఉన్న ఓ ఇంటిని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు లారీ కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. జడ్చర్ల మండలం కావేరమ్మపేట వద్ద గురువారం ఈ ప్రమాదం జరిగింది. సీఐ వీరస్వామి కథనం ప్రకారం.. జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న లారీ కావేరమ్మపేట వద్ద జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డుకు మలుపు తిరిగే క్రమంలో అదుపు తప్పి ఓ ఇంటిని వేగంగా ఢీకొట్టి బోల్తా పడింది. అదే సమయంలో బైక్‌పై వెళ్తున్న బంగారయ్య(23), మల్లయ్య(28)తో పాటు బస్సు కోసం ఎదురు చూస్తున్న రఫీయొద్దీన్(50పై లారీ పడటంతో వారు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. రెండు భారీ క్రేన్‌లను రప్పించి లారీని పక్కకు తొలగించి దాని కింద ఉన్న మృతదేహాలను బయటకు తీశారు. రఫీయొద్దీన్ స్వస్థలం కావేరమ్మపేట కాగా, బంగారయ్యది వనపర్తి జిల్లా మున్ననూరు, మల్లయ్యది నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం రాజాపూర్ అని గుర్తించారు. బంగారయ్య, మల్లయ్య ఓ పని నిమిత్తం రాజాపూర్ నుంచి బైక్‌పై హైదరాబాద్‌కు వెళుతుండగా.. మృత్యురూపంలో లారీ వారిపై పడింది. అదే విధంగా రఫీయొద్దీన్ షాద్‌నగర్‌లో బ్యాగులు అమ్మే వ్యాపారం చేస్తూ ప్రతి రోజు రాకపోకలు కొనసాగిస్తుంటాడు. ఈ క్రమంలో సర్వీస్ రోడ్ మలుపు వద్ద షాద్‌నగర్ వెళ్లే బస్సు కోసం ఎదురు చూస్తూ మృత్యువాతపడ్డాడు. కాగా, గాయపడిన ఇద్దరు మహిళలను ఆస్పత్రికి తరలించారు.

# కరోనా కలకలం!

- వరంగల్‌లో పీహెచ్‌డీ స్కాలర్.. ఖమ్మంలో వైద్య విద్యార్థికి వైరస్ లక్షణాలు?
- ప్రత్యేక వార్డుల్లో ఉంచి వైద్య పరీక్షలు
- వ్యాధి నిర్ధారణకు హైదరాబాద్, పుణేలకు శాంపిల్స్
- ఇటీవల ఇద్దరూ అమెరికా నుంచి స్వగ్రామాలకు రాక..
- కరోనా కేసు నమోదు కాలేదు: ఖమ్మం డీఎంహెచ్ఓ

**కాజీపేట అర్బన్/ఖమ్మం వైద్యవిభాగం:** వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఇద్దరు విద్యార్థులకు కరోనా వైరస్ లక్షణాలు ఉన్నట్లు గురువారం కలకలం రేగింది. వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేటలో ఓ జాతీయ స్థాయి విద్యా సంస్థలోని పీహెచ్‌డీ స్కాలర్, అలాగే.. ఖమ్మం నగరానికి చెందిన ఓ వైద్య విద్యార్థి ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. వీరిద్దరు ఇటీవల అమెరికా నుంచి స్వగ్రామాలకు వచ్చారు. కాజీపేటలోని ఓ జాతీయ స్థాయి విద్యా సంస్థలో చదువుతున్న పీహెచ్‌డీ స్కాలర్‌కు కరోనా లక్షణాలు ఉన్నట్లు అనుమానం రావడంతో గురువారం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఏపీ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన ఇతను.. ఓ ప్రొఫెసర్ పర్యవేక్షణలో జియో టెక్నికల్ అండ్ ఎన్విరాన్‌మెంట్‌పై పరిశోధనలు చేస్తున్నాడు. అమెరికాలో తన పరిశోధన పత్రాలను సమర్పించేందుకు ఇద్దరు ప్రొఫెసర్లతో కలసి వెళ్లాడు. తిరిగి ఈనెల ఒకటో తేదీన కర్నూలులోని స్వగ్రామానికి చేరుకున్నాడు. అనంతరం 8న తాను చదువుతున్న విద్యాసంస్థకు వచ్చాడు. అప్పటి నుంచి జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతుండగా 10న హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. పరీక్షించిన వైద్యులు.. కరోనా లక్షణాలు ఉన్నాయని అనుమానంతో గురువారం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఐసోలేషన్ వార్డులో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి శాంపిల్స్‌ను పంపించారు. పీహెచ్‌డీ స్కాలర్‌తో ఉండే కర్నూలు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు సైతం ఎంజీఎంలో పరీక్షలను నిర్వహించారు. అలాగే.. ఖమ్మం నగరంలోని శ్రీరాం హిల్స్ ప్రాంతానికి చెందిన ఓ వైద్య విద్యార్థి అమెరికాలోని డెట్రాయిట్ నగరంలో వైద్య విద్యను అభ్యసిస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన ఖమ్మం చేరుకున్నారు. అయితే నాలుగు రోజులుగా జ్వరం, జలుబుతో బాధపడుతుండటంతో బుధవారం రాత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రత్యేక వార్డులో ఉంచి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ కోసం శాంపిళ్లను పుణే పంపినట్లు తెలిసింది. కాగా, ఖమ్మంలో ఎక్కడా కరోనా కేసులు నమోదు కాలేదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. మాలతి స్పష్టం చేశారు.

## జమ్మూ పోలీసుల అదుపులో లింగన్న

**మల్లాపూర్ (కోరుట్ల):** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం కుస్తాపూర్‌కు చెందిన సరికెల లింగన్నను గురువారం రాత్రి జమ్మూకశ్మీర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. ఉగ్రవాదుల లింకులపై అతనిపై విచారణ సాగుతోందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లోని ఆర్మీ బేస్ క్యాంప్‌లో పనిచేసే రాకేశ్‌కు రెండు పర్యాయాలు లింగన్న డబ్బులు పంపాడు. రాకేశ్‌కు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో లింగన్న డబ్బులు పంపిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో జమ్మూకశ్మీర్ పోలీసులు మల్లాపూర్‌కు వచ్చి విచారించారు. జమ్మూకశ్మీర్ కోర్టు ఇచ్చిన ట్రాన్సిట్ వారెంట్‌తో లింగన్నను మెట్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అనుమతితో లింగన్నను జమ్మూకశ్మీర్ పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారణ నిమిత్తం ఆర్నియా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు ఎస్సై వివరించారు.

## పసుపు లారీ దగ్ధం

**సుమారు రూ.40 లక్షల నష్టం • నిజామాబాద్ జిల్లాలో ఘటన**



**బాల్కొండ:** పసుపు లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటల్లో చిక్కుకుంది. మంటలు వేగంగా వ్యాపించడంతో లారీతో పాటు అందులో పసుపు కాలిపోయింది. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులో గురువారం ఉదయం ఈ ఘటన జరిగింది. మెండోరా మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన 11 మంది రైతులు లారీలో 294 పసుపు బస్తాలను తరలించారు. అయితే, ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి శివారులోకి రాగానే షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి, క్షణాల్లో లారీ మొత్తం వ్యాపించాయి. ఇది గమనించిన ప్రయాణికులు కొందరు లారీ డ్రైవర్, క్లీనర్‌లను అప్రమత్తం చేయడంతో వారిద్దరు వెంటనే కిందకు దిగారు. సుమారు గంట తర్వాత అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి పోయింది. లారీలో 23 టన్నుల పసుపు ఉందని, ప్రస్తుత మార్కెట్ ధర లెక్క ప్రకారం సుమారు రూ.16 లక్షల నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. అలాగే, లారీ కాలిపోవడంతో రూ. 24 లక్షల నష్టం వాటిల్లిందని ఎస్సై రాజభరత్‌రెడ్డి తెలిపారు.

## సీనియర్ రాజకీయవేత్త కేవీ సత్యనారాయణ కన్నుమూత



**హాలియా:** కాంగ్రెస్ నేత కుందూరు జానారెడ్డి రాజకీయ గురువు, సీనియర్ రాజకీయవేత్త కేవీ సత్యనారాయణ (92) గురువారం కన్నుమూశారు. నల్లగొండ జిల్లా అనుముల మండలానికి చెందిన కేవీ సత్యనారాయణ కొన్ని రోజులుగా శ్వాస కోశ వ్యాధితో బాధపడుతున్నారు. హాలియాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అనుముల గ్రామ సర్పంచ్ నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏపీపీఎస్‌సీ సభ్యుడి దాకా ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. ఎన్టీ రామారావు టీడీపీ స్థాపించిన సమయంలో కేవీ సత్యనారాయణ ముఖ్య భూమిక పోషించారు. ఎన్టీఆర్ హయాంలో ఏపీపీఎస్‌సీ సభ్యుడిగా పని చేసిన సమయంలోనే ఆయన మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, మండల వ్యవస్థ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.

# అమ్మా దమ్ము వస్తోంది.. రేపు మాట్లాడ్తా!

**తల్లితో మాట్లాడాక అమెరికాలో కామారెడ్డి జిల్లావాసి మృతి • కరోనాతో మృతదేహం తరలింపు అనుమానమే!**



**భిక్కనూరు:** కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన భూర్ల అరుణ్ కుమార్ (41) అమెరికాలో గురువారం రాత్రి మృతి చెందాడు. జ్వరం, లోబీపీతో నిద్రలోనే తనువు చాలించాడు. అమెరికాలోని హోస్టన్ సిటీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అరుణ్‌కుమార్.. రెండు రోజులుగా జ్వరం, లోబీపీ సమస్యతో బాధ పడుతున్నాడు. ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన తర్వాత అమెరికా నుంచి కామారెడ్డిలోని తల్లితో భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 10 గంటలకు మాట్లాడారు. 'అమ్మా నాకు దమ్ము వస్తోంది.. మాట్లాడుతుంటే ఇబ్బంది అవుతోంది, రేపు మాట్లాడుతా' అని చెప్పాడు. అరుణ్ మందులు వేసుకుని నిద్రకు ఉపక్రమించిన తర్వాత అతని భార్య రజనీ ఉద్యోగానికి వెళ్లింది. గంట తర్వాత ఫోన్ చేయగా.. స్పందించకపోవడంతో అనుమానం వచ్చి ఇంటికి వచ్చింది. ఎంత పిలిచినా అరుణ్ పలుకక పోవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే అరుణ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. గురువారం రాత్రి అరుణ్ మరణ వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు స్పృహ కోల్పోయారు.

**మృతదేహం తేవడం సాధ్యం కాదు**

పలు దేశాల్లో కరోనా వ్యాధి విజృంభించడం వల్ల అమెరికా నుంచి ఇండియాకు అరుణ్ మృతదేహాన్ని పంపించేందుకు అక్కడి ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవచ్చని తెలుస్తోంది. దీంతో అరుణ్ అంత్యక్రియలను అక్కడే నిర్వహిస్తారని చెబుతున్నారు. అరుణ్, రజనీ తల్లిదండ్రులు గురువారం వేకువ జామున 3 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి అమెరికాకు బయలుదేరి వెళ్లారు.

## స్వామినాథన్ అవార్డుకు వీసీ ప్రవీణ్‌రావు ఎంపిక



**సాక్షి, హైదరాబాద్:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వి.ప్రవీణ్‌రావు.. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ అవార్డుకు ఎంపికయ్యారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి విశ్రాంత ఉద్యోగుల సంఘం, నూజివీడు సీడ్స్ లిమిటెడ్ సంయుక్తంగా ఈ అవార్డుని ఏర్పాటు చేశాయి. దేశంలో వ్యవసాయ రంగ ప్రగతికి తోడ్పాటు అందిస్తున్న శాస్త్రవేత్తలకు, వృత్తి నిపుణులకు రెండేళ్లకోసారి ఈ అవార్డుని అందజేస్తారు. ఐకార్ మాజీ డైరెక్టర్ జనరల్ ఆర్‌ఎస్ పరోడా నేతృత్వంలోని ఎంపిక కమిటీ.. వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధక రంగాల్లో నిష్ణాతులైన 13 మంది నుంచి వచ్చిన దరఖాస్తులను, రికార్డులను పరిశీలించి ఈ అవార్డుకి ఎంపిక చేసింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మొదటి ఉపకులపతిగా ప్రవీణ్‌రావు బోధన, పరిశోధన, విస్తరణలలో తీసుకున్న అనేక విప్లవాత్మక చర్యల కారణంగా దేశంలోని అన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో ఈ యూనివర్సిటీ ఆరో స్థానంలో నిలిచింది. 1985లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కెరీర్ ప్రారంభించిన ప్రవీణ్‌రావు గత 35 ఏళ్లగా బోధన, పరిశోధనలో రంగాల్లో అనేక మైలు రాళ్లను దాటారు. సూక్ష్మసేద్యంలో భారతదేశం, ఇజ్రాయెల్, దక్షిణాఫ్రికాలలో 13 రీసెర్చ్, 6 కన్సల్టెన్సీ ప్రాజెక్టులకు పనిచేశారు. భారత వ్యవసాయ రంగంలోనే మైలురాయి అయిన అతి పెద్ద సూక్ష్మ సేద్యం ప్రాజెక్టుకు సాంకేతిక సలహాదారుగా ఉండి అది అమలు కావటంలో కీలక పాత్ర పోషించారు.

## ఎంఎంటీఎస్‌ను వికారాబాద్ వరకు పొడిగించాలి

### రైల్వే పద్దులపై చర్చలో ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి



**సాక్షి, న్యూఢిల్లీ:** హైదరాబాద్ ఎంఎంటీఎస్ ఫేజ్–1ను లింగంపల్లి నుంచి వికారాబాద్ వరకు పొడిగించాలని కేంద్రాన్ని టీఆర్‌ఎస్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి కోరారు. గురువారం లోక్‌సభలో రైల్వే పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'ఎంఎంటీఎస్ పొడిగింపు వల్ల సమీప ప్రాంతాల ప్రయాణికులకు మేలు జరగడమే కాకుండా హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతుంది. ఇందుకు కొత్త లైన్లు కూడా అవసరం లేదు. ఉన్న లైన్లపైనే పొడిగిస్తే సరిపోతుంది. తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న నవంగి రైల్వే స్టేషన్ లో కేవలం ఒకే రైలే ఆగుతోంది. హుబ్లీ ఎక్స్‌ప్రెస్, లింక్ ఎక్స్‌ప్రెస్, హుసేన్‌సాగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను ఇక్కడ ఆపాలి. తాండూరు స్టేషన్‌లో గరీబ్‌రథ్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లకు, వికారాబాద్‌లో కోణార్క్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ ఇవ్వాలి. తాండూరు స్టేషన్‌ను వాటర్ ఫౌంటెయిన్‌తో అభివృద్ధి చేయాలి. తాండూరులో ఆర్వోబీ ఏర్పాటు చేయాలని ఏడేళ్ల నుంచి అడుగుతున్నాం. వికారాబాద్ రైల్వే లైన్‌పై ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయడంతోపాటు రైళ్ల వేగాన్ని పెంచాలి'అని కోరారు.

## సోనియా గాంధీతో ఎంపీ కోమటిరెడ్డి భేటీ



**సాక్షి, న్యూఢిల్లీ:** భువనగిరి కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీతో గురువారం ఢిల్లీలోని ఆమె నివాసంలో భేటీ అయ్యారు. తెలంగాణలోని రాజకీయ పరిస్థితులను ఆమెకు వివరించినట్టు సమాచారం. మున్సిపల్ ఎన్నికల తర్వాత పీసీసీ అధ్యక్ష పదవి నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తప్పుకుంటానని ప్రకటించడం, కర్ణాటక తదితర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలకు నూతన అధ్యక్షులను నియమించడం వంటి పరిణామాల నేపథ్యంలో కోమటిరెడ్డి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్‌లో పనిచేసిన నేతలకు పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టాలని, అధికార పార్టీని ఎదుర్కొనేందుకు త్వరితగతిన పీసీసీ కమిటీ ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలుస్తోంది.

## 15న సంజయ్ బాధ్యతలు

**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఈ నెల 15న బాధ్యతలు స్వీకరించనున్నారు. పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ నేతల సమక్షంలో బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న ఆయన ఆదివారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం నాంపల్లిలోని బీజేపీ కార్యాలయానికి భారీ ర్యాలీతో రానున్నారు.

**అమిత్‌షా, నడ్డాలను కలిసిన సంజయ్..**

బండి సంజయ్ గురువారం పార్లమెంట్‌లోని కేంద్ర హోం మంత్రి కార్యాలయంలో అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు మరింతగా కష్టపడాలని అమిత్‌షా రాష్ట్ర నేతలకు సూచించారు.



హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పైలట్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం కాక్‌పిట్‌లో మంత్రి కేటీఆర్

# విమానయాన రంగానికి ఉజ్వల భవిష్యత్తు

- భాగస్వామ్య పెట్టుబడులతో విమానయాన రంగం బలోపేతం
- ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ ప్రారంభోత్సవంలో కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** దేశంలో పౌర విమానయాన రంగం తాత్కాలికంగా కొన్ని ఒడిదుడుకులకు లోనవుతున్నా ఈ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. భాగస్వామ్య పెట్టుబడులతో దేశంలో విమానయాన రంగం బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డైరక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), యూరోపియన్ ఏవియేషన్ సేఫ్టీ ఏజెన్సీ (ఈఏఎస్‌ఏ) సహకారంతో ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్‌ఎస్‌టీసీ) హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన అత్యాధునిక పైలట్ శిక్షణ కేంద్రాన్ని కేటీఆర్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పౌర విమానయాన శాఖ, డీజీసీఏ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఎనిమిది విమానాలు నిలిపే సామర్థ్యమున్న (8–బే) పైలట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఇప్పటికే ఏ–320 నియో, బాంబార్డియర్ డాష్–8, ఏటీఆర్ 72–600 సిమ్యులేటర్లను హైదరాబాద్ బేలో ఏర్పాటు చేయగా ఢిల్లీ శివార్లలోని గురుగ్రామ్‌లోనూ ఇప్పటికే మరో ఐదు సిమ్యులేటర్లను ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు. గురుగ్రాం, హైదరాబాద్‌లో ఏర్పాటైన ఎఫ్‌ఎస్‌టీసీ శిక్షణ కేంద్రాల ద్వారా పైలట్లకు అత్యాధునిక శిక్షణ సాధ్యమవుతుందన్నారు. స్వల్ప వ్యవధిలో తక్కువ ఖర్చుతో అత్యాధునిక శిక్షణ లభిస్తుండటంతో ఆగ్నేయాసియా దేశాలకు చెందిన వైమానిక సంస్థలతోపాటు దేశీయ సంస్థలు కూడా భారత్‌లో శిక్షణ భాగస్వాములుగా ఉండేందుకు ఆసక్తి చూపుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఎఫ్‌ఎస్‌టీసీని ప్రారంభించిన అనంతరం మంత్రి కేటీఆర్ సిమ్యులేటర్‌ను కాసేపు సరదాగా నడిపారు.

**2011లో ఎఫ్‌ఎస్‌టీసీ ప్రస్థానం ప్రారంభం...**

వైమానిక రంగంలో ప్రాంతీయ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసే ఉద్దేశంతో ఏర్పాటైన ఎఫ్‌ఎస్‌టీసీ 2012లో ఎయిర్ బస్ ఏ–320, బోయింగ్ బి–737 సిమ్యులేటర్లను అందుబాటులోకి తెచ్చింది. దశలవారీగా కార్యకలాపాలను విస్తరించుకుంటూ 2015లో యూరోపియన్ ఏవియేషన్ సేఫ్టీ ఏజెన్సీ (ఈఏఎస్‌ఏ) గుర్తింపు కూడా పొందింది. 2018లో హైదరాబాద్ శిక్షణ కేంద్రాన్ని శంకుస్థాపన చేయడంతోపాటు గుజరాత్ ఫ్లయింగ్ క్లబ్ నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. ఇప్పటికే సుమారు 1,100 మందికి శిక్షణ ఇచ్చిన ఎఫ్‌ఎస్‌టీసీ... హైదరాబాద్ శిక్షణా కేంద్రం ద్వారా దక్షిణాదిలో పైలట్ల శిక్షణ అవసరాలను తీరుస్తుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

## కదంతొక్కిన ఆశ వర్కర్లు

### ఏపీలో మాదిరిగా ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్

**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్నట్లు తమకు కూడా రూ.10,000 ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని కోరుతూ ఆశ వర్కర్లు తలపెట్టిన 'తెలంగాణ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడి'కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌లోని కోఠి డీఎంఈ కార్యాలయానికి వస్తున్న ఆశ వర్కర్లను సుల్తాన్ బజార్ పోలీసులు కోఠి డీఎంహెచ్ఎస్ గేటు వద్ద అడ్డుకున్నారు. 865 మంది ఆశ వర్కర్లతో పాటు సీఐటీయూ నాయకులను అరెస్టు చేసి నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఘటనపై 8 కేసులను నమోదు చేశారు. తమ హక్కుల కోసం నిరసన తెలిపేందుకు వస్తున్న ఆశా వర్కర్లను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారని తెలంగాణ ఆశ యూనియన్ అధ్యక్షురాలు పి.జయలక్ష్మి ఆరోపించారు. ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ శుక్రవారం (13న) రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు, 19న కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు చేస్తామని వెల్లడించారు.



హైదరాబాద్‌లోని డీఎంహెచ్ఎస్ వద్ద ఆశా వర్కర్లను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



## రాక్షసి పిట్ట

చూడ్డానికి రాక్షసి పిట్టలా కనిపించడం లేదూ.. దాని కళ్లు.. పళ్లు.. ఇది ప్రపంచంలోనే అత్యంత చిన్న డైనోసార్.. ఎంత చిన్నది అంటే.. దీని పొడవు కేవలం 2 అంగుళాలు.. అంటే.. ఇప్పుడు ప్రపంచంలో అత్యంత చిన్న పక్షిగా పేరొందిన బీ హమ్మింగ్ బర్డ్ (2.4 అంగుళాలు) కన్నా చిన్నదన్నమాట. సైజు సంగతి పక్కనపెడితే.. పళ్లు మాత్రం ఏకంగా వంద ఉన్నాయట. దీని తాలూకు శిలాజం ఉత్తర మయన్మార్‌లో దొరికింది. చెట్టు తాలూకు జిగురు మీద పడటం వల్ల ఇది చనిపోయిందట. పురుగులను తిని జీవించే ఈ డైనోసార్ పక్షి.. 9.9 కోట్ల ఏళ్ల క్రితం మయన్మార్‌లో ఉండేదని శాస్త్రవేత్తలు తెలిపారు.

## రాష్ట్రంలో పొడి వాతావరణం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో రాబోయే రెండు రోజులు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తూర్పు విదర్భ నుంచి తెలంగాణ, దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు 0.9 కి.మీ. ఎత్తు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతుందని పేర్కొంది. గురువారం భద్రాచలంలో 37 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్‌లో 36, ఆదిలాబాద్, ఖమ్మంలలో 35, నిజామాబాద్‌లో 34, హైదరాబాద్, నల్లగొండ, రామగుండంలలో 33, హన్మకొండలో 32 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి

### రైల్వే పద్దులపై చర్చలో టీఆర్‌ఎస్ పక్ష నేత నామా నాగేశ్వరరావు



**సాక్షి, న్యూఢిల్లీ:** దేశంలో రైల్వే మౌలిక వసతులు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో ప్రభుత్వం విఫలమైందని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైల్వే పద్దులపై లోక్‌సభలో గురువారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 70 ఏళ్లు పూర్తయినా రైల్వే అనుసంధానం పూర్తికాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే సరుకు రవాణా చార్జీలు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఇజ్జత్ పాస్‌ల అర్హతలు సడలించాలని, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో ఇబ్బందులు ఉన్నాయని వివరించారు. విభజన హామీగా చెప్పిన కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీని ఇంకా స్థాపించలేదని, వెంటనే దాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. భద్రాచలం–కొవ్వూరు లైన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

**అధికారుల నుంచి స్పందన లేదు**

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న మహబూబ్‌నగర్ లైన్, గద్వాల–రాయచూర్ లైన్, వికారాబాద్–వాడి, పటాన్‌చెరు–సంగారెడ్డి, పెద్దపల్లి–కాజీపేట్, కరీంనగర్–హసన్‌పర్తి తదితర రైల్వే లైన్లన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఖమ్మం రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్, సీసీ కెమెరాలు లేవన్నారు. ఖమ్మం స్టేషన్‌లో 2 రైళ్లను ఆపాలని లేఖ రాశామని దానిపై నిర్ణయం తీసుకోవాలన్నారు. ఖమ్మం రైల్వే స్టేషన్‌ను ఏ గ్రేడ్ నుంచి ఏ1 గ్రేడ్ స్టేషన్‌గా ఆధునీకరించాలని కోరారు.

## ఒకే పోస్టు.. నిబంధనలు వేరు..

- గురుకుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పోస్టు నిబంధనల్లో మార్పులు
- టీఎస్‌పీఎస్సీ, టీఆర్‌ఈఐఆర్‌బీ నోటిఫికేషన్లలో భిన్న అర్హతలు

**సాక్షి, హైదరాబాద్:** సంక్షేమ గురుకుల సొసైటీల పరిధిలోని రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో ప్రిన్సిపల్ పోస్టుల భర్తీ ప్రక్రియ అభ్యర్థులను గందరగోళానికి గురిచేస్తోంది. మూడేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా చేపట్టిన గురుకుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పోస్టుల భర్తీ ప్రక్రియలో పేర్కొన్న నిబంధనలు.. తాజాగా తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు భిన్నంగా ఉండటం అయోమయానికి తావిస్తోంది.

**పరిగణనలోకి ప్రైవేటు కాలేజీ అనుభవం**

మూడేళ్ల క్రితం టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన నోటిఫికేషన్‌లో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పోస్టు అర్హతలు అనుభవ విభాగంలో పరిశీలిస్తే.. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ/ఎయిడెడ్/రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో ఐదేళ్ల పాటు లెక్చరర్‌గా పనిచేసిన అనుభవం ఉండాలి. లేదా ప్రభుత్వ/ఎయిడెడ్/రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో ఐదేళ్ల పాటు ప్రిన్సిపల్‌గా పనిచేసిన అనుభవం ఉండాలి. లేదా పదేళ్ల పాటు ప్రభుత్వ/ఎయిడెడ్/రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో లెక్చరర్‌గా పనిచేసిన అనుభవం ఉండాలి. తాజాగా టీఆర్‌ఈఐఆర్‌బీ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఇదివరకున్న నిబంధనలతో పాటు ఏడేళ్ల పాటు ప్రైవేటు/సెల్ఫ్ ఫైనాన్స్ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా లేదా ఏడేళ్ల పాటు ప్రభుత్వ/ఎయిడెడ్/గురుకుల డిగ్రీ కాలేజీలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేసినా సరిపోతుంది. యూనివర్సిటీ డిగ్రీ/పీజీ కాలేజీల్లో కన్సల్టెంట్‌గా పనిచేసినా, ప్రైవేటు/సెల్ఫ్ ఫైనాన్స్ జూనియర్ కాలేజీల్లో తొమ్మిదేళ్ల పాటు లెక్చరర్‌గా, ప్రభుత్వ/ఎయిడెడ్/గురుకుల జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్టు పద్ధతిలో జేఎల్‌గా పనిచేసినా అర్హులేనని పేర్కొంది.

**కొత్త సర్వీసు రూల్స్ ప్రకారం..**

గురుకుల విద్యా సంస్థల సొసైటీలకు గతేడాది నుంచి కొత్త సర్వీసు నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఈ క్రమంలో కొత్త సర్వీస్ రూల్స్ ఆధారంగా గురుకుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పోస్టుల భర్తీ చేపడుతున్నట్లు టీఆర్‌ఈఐఆర్‌బీ చైర్మన్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com